PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

హలో కార్మికా.... చలో విశాఖ

- సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్ ఆవిష్కరణ
- జయప్రదం చేయాలని నేతల పిలుపు

3

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 112 | విజయవాడ, ఆదివారం 23 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 23 November 2025 | Rs

చెమటోడ్చుతున్న బౌలర్లు

- కుల్దీప్‌కు మూడు వికెట్లు
- దక్షిణాఫ్రికా 247/6

8

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరు

- దేశ, విదేశాల్లో నోటిఫికేషన్ కాపీల దగ్ధం
- 26న దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు పోరుకు సిద్ధమయ్యాయి. దేశ శ్రామికుల హక్కులపై పాలక వర్గాలు చేస్తున్న విధ్వంసక దాడిని ప్రతిఘటించేందుకు సమాయత్తమయ్యారు. లేబర్ కోడ్‌లను సమర్థించే వారికి గుణపాఠం చెబుతామని, కార్మిక కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈనెల 26న దేశవ్యాప్తంగా ఆందోళనలకు కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక, స్వతంత్ర పారిశ్రామిక సమాఖ్యల ఐక్య ఉద్యమం పిలుపు ఇచ్చింది. మోడీ నేతృత్వంలోని కార్పొరేట్, హిందూత్వ ప్రభుత్వం కేంద్రంలోని కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు కార్మిక కోడ్‌లను ప్రకటించిన 24 గంటల్లోనే వేలాది మంది కార్మికులు ఆగ్రహంతో దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీ గేట్లు, పని ప్రదేశాల వద్ద నోటిఫికేషన్ కాపీలను తగలబెట్టారు. శనివారం వివిధ ప్రాంతాల్లో లేబర్ కోడ్ల నోటిఫికేషన్ కాపీలను కార్మికులు దగ్ధం చేశారు. పంజాబ్‌లోని బటిండాలో అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ కార్మికులు లేబర్ కోడ్ల కాపీలను దగ్ధం చేశారు. కర్ణాటకలోని బెంగళూరులో పారిశ్రామిక కార్మికులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. లేబర్ కోడ్‌లను తగలబెట్టారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోపాటు పలువురు కార్మికులు నిరసన తెలిపారు. లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మికులను బానిసలుగా మార్చవద్దని పెద్దపెట్టున నినాదాలు చేశారు. కర్ణాటకలోని కల్‌బుర్గి సహా పలు ప్రాంతాల్లో కార్మికులు లేబర్ కోడ్‌ల కాపీలను తగలబెట్టారు. నాలుగు కార్మిక కోడ్‌లను నిరసిస్తూ సైప్రస్‌లో యుఐటిబిబి ప్రపంచ కాంగ్రెస్ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి నేతలు ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లు కార్మికులకు వ్యతిరేకంగానూ, యాజమాన్యానికి అనుకూలంగానూ ఉన్నాయని విమర్శించారు.

బెంగళూరులో లేబర్ కోడ్ కాపీలను తగలబెడుతున్న పారిశ్రామిక కార్మికులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే : సిఐటియు

లేబర్ కోడ్‌లపై కేంద్ర ప్రభుత్వం చేసిన మోసపూరిత వాదనలను సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రకటన విడుదల చేశారు. ఈ కోడ్‌లను "కార్మిక అనుకూల","ఆధునీకరణ"గా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను రద్దు చేయడం దారుణమని అన్నారు. ఇది కార్పొరేట్ దోపిడీ, కాంట్రాక్టలైజేషన్‌ను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.

లేబర్ కోడ్లను తగలబెట్టండి ఎఐకెఎస్ పిలుపు

గ్రామాల్లో నాలుగు లేబర్ కోడ్లను తగలబెట్టాలని రైతులకు ఎఐకెఎస్ పిలుపునిచ్చింది. ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, విజూ కృష్ణన్ ఒక ప్రకటన విడుదల చేశారు. లేబర్ కోడ్లు కార్మికులను బ్రిటిష్ వలస పాలన నాటి చీకటి కాలానికి తీసుకెళ్లే తిరోగమన చట్టాలని పేర్కొన్నారు. కార్మిక కోడ్లు పని దినాన్ని 12 గంటలకు పొడిగించడానికి అనుమతిస్తాయని, కఠినమైన నిబంధనలు కార్మిక సంఘాల ఏర్పాటు, వేతనం కోసం చర్చలు, సమ్మె హక్కును దాదాపు అసాధ్యం చేస్తాయని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) కార్మిక కోడ్‌లకు మద్దతు ఇచ్చి కార్మికులకు ద్రోహం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని జరిగే పోరాటానికి ఎఐకెఎస్ పూర్తి మద్దతును అందిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న రైతులు, వ్యవసాయ కార్మికులు ఈనెల 26న రాష్ట్ర, జిల్లా స్థాయి ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

లేబర్ కోడ్లు శ్రామికులకు మరణ శాసనం : ఎఐఎడబ్ల్యుయు

నాలుగు లేబర్ కోడ్లు శ్రామికులకు, కార్మికులకు మరణ శాసనం లాంటిదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి. వెంకట్ విమర్శించారు. శనివారం నాడిక్కడ సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల 26న జరిగే ఆందోళనల్లో వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్ల బిల్లులు దగ్ధం చేయాలని కోరారు.

కార్మికుల హక్కులను నీరుగార్చే ప్రయత్నం : ఎస్ఎఫ్ఐ

కార్మిక వ్యతిరేక కోడ్లను అమలు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు శనివారం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదర్శ్ ఎం సాజి, శ్రీజన్ భట్టాచార్య ప్రకటన విడుదల చేశారు. ఈ చర్య కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసి దేశంలోని పెట్టుబడిదారీ వర్గానికి గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుందని విమర్శించారు. ఈ నెల 26న ఆందోళనల్లో పాల్గొనాలని దేశంలోని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు.

లేబర్ కోడ్స్‌పై కార్మికాగ్రహం

- వెనక్కి తీసుకోవాల్సిందేనంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- నోటిఫికేషన్ ప్రతులు దగ్ధం చేసిన నిరసన

2

సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, సత్యసాయి ట్రస్టు ఛైర్మన్ రత్నాకర్ తదితరులు

అందరి భాగస్వామ్యంతోనే దేశ పురోగతి

- విద్యతోపాటు వ్యక్తిత్వం ప్రధానం
- సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రయివేటు, ప్రజలందరి భాగస్వామ్యంతో మనదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా నిలుస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు శనివారం ఉదయం పుట్టపర్తికి వచ్చిన ఆమెకు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రశాంతి నిలయానికి రాష్ట్రపతి చేరుకుని సాయికుల్వంత్ హాలులో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యారు. ఆదివాసీ మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం 'శ్రీ సత్యసాయి ఆదివాసీ మహిళా స్వాస్థ్య స్వశక్తీకరణ్' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. అనంతరం 'శ్రీ సత్యసాయి యూనివర్సల్ టార్చ్ ఫర్ పీస్' జ్యోతిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెలిగించి ప్రసంగించారు. సమాజానికి సేవలందించిన వారిలో సత్యసాయిబాబా అగ్రభాగాన ఉంటారని ఆమె కొనియాడారు. 1969లోనే మహిళల అక్షరాస్యతను గుర్తించి ప్రత్యేకంగా బాలికల కళాశాలలు ఆరంభించారని గుర్తు చేశారు. సమాజాభివృద్ధికి అందరూ కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎక్కడ విపత్తు సంభవించినా ప్రజలను సత్యసాయి సేవా సంస్థ ఆదుకుంది : చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థ ఒక ఆధ్యాత్మిక సంస్థ మాత్రమే కాదని, ఎక్కడ విపత్తు సంభవించినా ప్రజలను ఆదుకునేందుకు ఈ సంస్థ ముందుకొస్తుందని అన్నారు. లక్షలాది ప్రజల దాహార్తి తీర్చడానికి సత్యసాయి బాబా ఎంతగానో తపించడమే కాకుండా ఇందుకు సంబంధించిన ప్రాజెక్టులను పూర్తి

మిగతా 7లో

'సంజీవని' రహస్యాలు బయటపెట్టండి

- ప్రజల ఆరోగ్యాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తారా?
- 26న కార్మిక ఆందోళనను జయప్రదం చేయండి : బివి రాఘవులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

సంజీవని పథకం గేమ్ ఛేంజర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్నారని, ఈ పథకం ద్వారా ఏం చేస్తున్నారో రహస్యాలు బయటపెట్టాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. శనివారం ఆయన నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సంజీవని ఏదో అద్భుతంగా చెబుతున్నారని, ఆ పథకం వివరాలు ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. టాటా, బిల్ గేట్స్ ముఖ్యమైన పాత్ర ఉందని చెప్తున్నారని, వాస్తవాలు బయట పెట్టాలని అన్నారు. డిజిటల్ కార్డులను అమలు చేస్తామని, దీనిని చిత్తూరు జిల్లా నుంచి ప్రారంభిస్తున్నామని చెప్తున్నారని, ఆ కార్డులు ఎవరు తీసుకుంటారు? ఎవరు వినియోగించుకుంటారు? ప్రజల ఆరోగ్య వివరాలు కార్పొరేట్ శక్తులకు ఎలా ఇస్తారు? అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న బివి రాఘవులు, పక్కన మూలం రమేష్

కార్మికుల హక్కులు కాలరాయడానికే లేబర్ కోడ్స్

కార్మికుల హక్కులను కాలరాయడానికే కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానే నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చిందని, దీనిని సిపిఎం కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని రాఘవులు తెలిపారు. బీహార్ ఎన్నికల వరకు మౌనంగా ఉన్న ప్రభుత్వం ఎన్నికలు ముగిసిన వెంటనే తన కుట్రను బయటపెట్టిందన్నారు. లేబర్ కోడ్స్ దుర్మార్గమైనవని, కార్మికుల హక్కులు, వేతనాలు, పని గంటలు, నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. లేబర్ కోడ్స్ గొప్పవని ప్రధాని చెబుతున్నారని, ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేకపోయారో చెప్పాలని, కార్మిక సంఘాలు ఎందుకు సమ్మె చేశాయని, జులైలో జరిగిన సమ్మెలో 25 కోట్ల మంది ఎందుకు పాల్గొన్నారని, కార్మికులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలని అన్నారు. ఈ నెల 26న కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు దేశవ్యాపితంగా చేపడుతున్న ఆందోళనకు సిపిఎం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. లేబర్ కోడ్లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికలకు ప్రయోజనం కలిగించే అంశాలు తీసుకురావాలంటే కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రయివేటు వ్యక్తులకు మేలు చేసేలా చట్టాలు తీసుకురావడం సరికాదన్నారు.

మెడికల్ కాలేజీలను పిపిపికి ఇవ్వడం సరికాదు

మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రయివేటు వారికి అప్పగించడం సరికాదని రాఘవులు అన్నారు. గత ప్రభుత్వమే ఈ ప్రయత్నాలను ప్రారంభించిందని, ఆ రోజు వైసిపిపై విమర్శలు చేసిన చంద్రబాబునాయుడు ఇప్పుడు అదే విధానాలను అమలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని డిమాండ్ చేశారు. పది మెడికల్ కాలేజీల్లో ఏడు వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్నాయని, వాటినీ ప్రభుత్వం నిర్వహించకపోతే వెనుకబడిన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు.

పనిచేసే వారిని, శ్రమ చేసే వారిని అవమానకరంగా మాట్లాడుతున్నారు

పనిచేసే వారిని, శ్రమ చేసే వారిని అవమానకరంగా చంద్రబాబు మాట్లాడుతున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని రాఘవులు

మిగతా 7లో

ఎస్ఐఆర్ ఒత్తిడితో ముగ్గురు బిఎల్‌ఒల మృతి

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విధుల్లో ఒత్తిడి భరించలేక శుక్ర, శనివారాల్లో ముగ్గురు బూత్‌లెవెల్ అధికారులు ప్రాణాలు కోల్పోతున్నారు. మధ్యప్రదేశ్‌లో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై చనిపోగా, పశ్చిమ బెంగాల్‌లో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్, దామోహ్ జిల్లాల్లో బూత్ లెవెల్ అధికారులుగా పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యా యులు రమాకాంత్ పాండే, సీతారాం గోండ్ ఎస్ఐఆర్ విధి నిర్వహణ అనంతరం శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లా కృష్ణానగర్‌కు చెందిన ఉపాధ్యాయురాలు రింకు తరఫ్‌దార్ (54) ఎస్ఐఆర్ పని ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇదే రాష్ట్రంలోని జల్పాయ్‌గురికి చెందిన ఓ బిఎల్‌ఒ బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐఆర్ దరఖాస్తులు లక్ష్యానికి అనుగుణంగా పూర్తవకపోవడంతో సస్పెండ్ చేస్తామని ఉన్నతాధికారులు బెదిరిస్తుండటంతోనే బిఎల్‌ఒలు ప్రాణాలు కోల్పోతున్నారని వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించండి

- సిపిఎం డిమాండ్
- కార్మిక చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన

న్యూఢిల్లీ : కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఏకపక్షంగా ప్రకటించడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక సంఘాలు సుదీర్ఘ పోరాటాల ద్వారా ఎంతగానో కష్టపడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటివరకు ఈ చట్టాలు కొంతమేరకు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ వచ్చాయని తెలిపింది. అనేక పరిమితులు వున్నప్పటికీ, వేతనాలు, పనిగంటలు, సామాజిక భద్రత, పారిశ్రామిక భద్రత, తనిఖీ - సమ్మతి యంత్రాంగాలు, సమిష్టి బేరసారాలు వంటివి కొంతవరకు అమల్లో వుండేవని పేర్కొంది. వీటిని కార్మికులకు మరింత అనుకూలంగా మార్చడానికి బదులుగా, కొత్త లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను నీరు గారుస్తున్నాయి, ఈ హక్కులు దీర్ఘకాలం నుండి వున్నాయని, అవన్నీ కార్మికులు పోరాడి సాధించుకున్నవేనని పొలిట్‌బ్యూరో పేర్కొంది. వాటిని పూర్తిగా రద్దు చేయడం ద్వారా యజమానులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ కార్మిక చట్టాల వల్ల ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయని ప్రభుత్వం చేస్తున్న వాదన పూర్తిగా నిరాధారం. పెట్టుబడిదారులను రక్షించడం కోసం కార్మికులకు భద్రత లేకుండా వుండేలా ఈ కోడ్‌లు రూపొందించారు. కార్మిక హక్కులకు సంబంధించిన వివిధ అంశాల విషయంలో అర్థవంతంగా ఉన్న నియంత్రణలన్నీ రద్దు చేయబడతాయని హామీ ఇవ్వడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ఈ కోడ్‌ల ప్రధాన లక్ష్యంగా వుంది. పైగా, కార్మిక వర్గం సమ్మె చేసే హక్కును లాక్కోవాలని, అలాగే కార్మికులు సామూహికంగా చేసే ఏ చర్యనైనా నేరపూరితం చేయాలని ఆ కోడ్‌లు కోరుతున్నాయి. ప్రభుత్వం, పాలనా యంత్రాంగం చురుకైన స్పాన్సర్‌షిప్‌తో మొత్తంగా, కార్మికుల హక్కులను కాలరాచేందుకు కార్పొరేట్ వర్గానికి ఏకపక్షంగా సాధికారత కల్పించడం ద్వారా ఆటవిక రాజ్యాన్ని సృష్టించాలని ఈ లేబర్ కోడ్‌లు పేర్కొంటున్నాయి.

సంబంధిత పక్షంతో ముఖ్యంగా కార్మికులతో నిజాయితీగా త్రైపాక్షికంగా చర్చలు, సంప్రదింపులు జరపకుండా ఈ కోడ్‌లను అమలు చేయడంలో ప్రజాస్వామ్య, ఫెడరల్ నిబంధనలను

మిగతా 7లో

మరమ్మతు పనుల పురోగతిపై ప్రత్యక్ష తనిఖీలు

రోడ్లు, భవనాల శాఖ మంత్రికి ముఖ్యమంత్రి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, డిసెంబరు ఆఖరు నాటికి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆర్‌అండ్‌బి అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రహదారుల నిర్వహణపై అధికారులతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారుల మరమ్మతు పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని, అలాగే స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబును ఆదేశించారు. పనులు చేపట్టని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గతేడాది రోడ్లను గుంతల రహిత రహదారులే లక్ష్యంగా మిషన్‌పాత్‌హోల్ ఫ్రీలో భాగంగా రూ.861 కోట్లతో మరమ్మతులు చేపట్టామన్నారు. ఏడాదిలో రహదారుల నిర్వహణ, ఇంప్రూవ్‌మెంట్ కోసం రూ.2,500 కోట్లతో పనులు చేపట్టేందుకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా రూ.400 కోట్లు నాబార్డు నిధులతో 1,250 కిలోమీటర్లు జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం 191 పనులు మంజూరు చేసినట్లు సిఎం వెల్లడించారు. ఆయా పనులన్నింటికీ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించామని, ఇవి కాకుండా రూ.600 కోట్లు మూలధన వ్యయం కింద 227 పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు 1,450 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేసేందుకు కాంట్రాక్టర్లను గుర్తించి పనులు అప్పగించామన్నారు. మరో 2,104 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి 274 పనులకు పరిపాలనా పరమైన అనుమతులివ్వడంతో పాటు ఇందుకోసం రూ.వెయ్యి కోట్లతో ఆయా పనులకు టెండర్లు పిలవడం పూర్తయ్యిందన్నారు. డిసెంబరు నెల మొదటి వారంలో ఈ పనులన్నింటినీ కాంట్రాక్టర్లు మొదలుపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కేవలం ఒక్క ఏడాది కాలంలోనే రూ.2,500 కోట్లతో 5,471 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి పరిపాలనా అనుమతులిచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు తాము అధికారంలోకి వచ్చేనాటికి రూ.4 వేలకోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిలో ఇప్పటికే రూ.1900 కోట్లు చెల్లించినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు.

తెలంగాణలో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఆయుధాలతో సహా ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు సరెండర్
- గణపతి, దేవ్‌జీల లొంగుబాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం : డిజిపి శివధర్‌రెడ్డి

3

సరుకుల సరఫరాలో రైల్వే రికార్డ్

- ఎనిమిది నెలల్లోనే 100 కోట్ల టన్నుల డెలివరీ
- అందులో సగం పైగా బొగ్గు

అభివృద్ధి ప్రాధాన్యతలు మార్చుకోండి

జి-20 దేశాల నేతలకు ప్రధాని మోడీ సూచన

జొహన్నెస్‌బర్గ్ : ప్రపంచ అభివృద్ధి ప్రామాణికాలపై పునరాలోచన చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో ఆదివారం ప్రారంభమైన జి-20 దేశాల శిఖరాగ్ర సమావేశాలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మాదకద్రవ్యాలు - ఉగ్రవాదం మధ్య గల సంబంధాలను ఎదుర్కొనడానికి జి-20 చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు. అనేక దేశాలు ఎదుర్కొంటున్న అంతర్జాతీయ భద్రతా సవాళ్లలో కొన్నింటినైనా ఎదుర్కొనడానికి ఈ చర్యలు దోహదం చేస్తాయని అన్నారు. అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ ప్రతిస్పందనా బృందాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య రంగ సంక్షోభాలు తరచుగా నెలకొంటున్న తరుణంలో ఇటువంటి బృందాల ఏర్పాటు వల్ల మరింత సమన్వయంతో, సమర్థవంతంగా పని చేయడానికి వీలుంటుందని చెప్పారు.

జి-20 దేశాధినేతల సదస్సులో పాల్గొనేందుకు మూడు రోజుల పర్యటన నిమిత్తం జొహన్నెస్‌బర్గ్ చేరుకున్న ప్రధాని మోడీకి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద సాంస్కృతిక బృందం ప్రదర్శన నిర్వహించింది.

కనడా, ఆస్ట్రేలియాలతో భాగస్వామ్యం

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, కెనడా ప్రధాని మార్క్ కార్నేలతో భేటీ అయిన మోడీ కెనడా, ఆస్ట్రేలియాలతో భాగస్వామ్యాన్ని రూపొందించినట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనివల్ల కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి పరిశ్రమల వ్యాప్తంగా అంతర్జాతీయ సాంకేతిక పరిష్కారాలను చూపేందుకు ప్రయత్నాలు ముమ్మరమవుతాయి. ఆఫ్రికాలో కృత్రిమ మేధను విస్తరించడానికి వంద బిలియన్ల డాలర్లతో చొరవను చేపడతామని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) ప్రకటించింది. ఆఫ్రికావ్యాప్తంగా విద్య, ఆరోగ్య సంరక్షణ, వాతావరణ మార్పులు సహా వివిధ రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగాన్ని పెంపొందించడం ఈ చొరవ లక్ష్యం. ఆఫ్రికా దేశాలు వారి జాతీయాభివృద్ధి ప్రాధాన్యతలను ఎదుర్కొనడం యుఎఇ లక్ష్యంగా వుంది.

జి-20 దేశాల అధినేతలతో ప్రధాని నరేంద్ర మోడీ

పలువురు నేతలతో మోడీ భేటీ

తొలి రోజు పర్యటనలో భాగంగా ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌తో మోడీ చర్చలు జరిపారు. బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్‌తో కూడా ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఇది అద్భుతమైన సమావేశమని ప్రధాని అభివర్ణించారు. 'భారత్ కో జానియే' క్విజ్ విజేతను కూడా కలుసుకున్నారు. భారతీయ సంతతికి చెందిన సాంకేతిక నిపుణులతోనూ సమావేశమయ్యారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, మలేసియా, సింగపూర్ ప్రధానులతో ప్రధాని మోడీ భేటీ అయ్యారు. బ్రెజిల్ అధ్యక్షుడు లాలా డసిల్వా, దక్షిణకొరియా అధ్యక్షుడు లీజే మూయాంగ్, అంగోలా అధ్యక్షుడు జోవో మాన్యుయల్ గొన్‌కాల్వ్‌తో కూడా

మిగతా 7లో

లేబర్ కోడ్స్‌పై కార్మికాగ్రహం

• వెనక్కి తీసుకోవాల్సిందేనంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

• నోటిఫికేషన్ ప్రతులు దగ్ధం చేసి నిరసన • కార్మికవర్గానికి మరణ శాసనంలా 'కోడ్స్' : కార్మిక సంఘాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి-మోడీ ప్రభుత్వం శుక్రవారం నుంచి అమలులోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లపై కార్మికాగ్రహం వ్యక్తమైంది. వీటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఉద్యమించారు. నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేసి తమ నిరసన తెలిపారు. లేబర్ కోడ్స్ వల్ల పారిశ్రామిక వివాదాల చట్టాన్ని కోల్పోయామని, సమ్మె హక్కు, పని భద్రత, ఉద్యోగ భద్రత లేకుండాపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గానికి మరణ శాసనంగా లేబర్ కోడ్స్ ఉన్నాయని, యజమానులకు కట్టుబానిసలుగా కార్మికులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వీటిని తెచ్చిందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది రద్దయ్యే వరకూ కార్మికులతో కలిసి ఐక్య పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించాయి.

విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ఆల్ ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాలుగు లేబర్ కోడ్స్ అమలు నోటిఫికేషన్ కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కె దుర్గారావు, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి మూలే సాంబశివరావు అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించి వేసే నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేయాలని, దీనిలో భాగంగా ఈ నెల 26న దేశ వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన తెలిపాలని, కార్మికవర్గం ఈ ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేట్ శక్తులకు, బడా పారిశ్రామికవేత్తలకు, బడా పెట్టుబడులకుదారులకు లబ్ధి చేకూర్చేలా లేబర్ కోడ్స్ ఉన్నాయని, కార్మికవర్గానికి తీవ్ర నష్టం జరగనుందని వివరించారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి పి పోలారి, వైఎస్‌ఆర్‌టియు రాష్ట్ర కన్వీనర్ పి గౌతంరెడ్డి, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టియుసిఐ నాయకులు ఎం.ప్రసాద్‌బాబు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, మెడికల్ రిప్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యువి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. విశాఖలోని మధురవాడ జివిఎంసి జోనల్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో భవన నిర్మాణ కార్మికులు, సివిల్ సప్లయిస్ హమాలీలు, రైస్‌మిల్లు కార్మికులు పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలంలోని గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో బిల్డింగ్ పెయింటర్స్ అండ్ ఆర్టిస్టుల సంఘం ఆధ్వర్యాన ఉద్యమించారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా గుంటూరు, పల్నాడు, కాకినాడ, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, తిరుపతి, అనకాపల్లి, అల్లూరి, వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనూ నిరసన తెలిపారు.

విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ఆల్ ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్మికులు, నాయకులు

ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు నిర్మించాలి

• ముఖ్యమంత్రికి ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో కాకుండా పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజారోగ్య వేదిక కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి రమణయ్య, టి కామేశ్వరరావు శనివారం లేఖ రాశారు. పరిపాలన, నియంత్రణ, విధానపరమైన నిర్ణయాలు ప్రభుత్వమే నిర్వహిస్తే ప్రైవేట్ భాగస్వామ్యాన్ని తీసుకురావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వద్ద అవసరమైన భూమి, బడ్జెట్, చట్టపరమైన వ్యవస్థ, వైద్య విశ్వవిద్యాలయం ద్వారా నియంత్రణ యంత్రాంగం, అధ్యాపక నియామక వ్యవస్థ ఉన్నాయని తెలిపారు. అన్నీ అందుబాటులో ఉన్నా ప్రైవేట్ సంస్థలను రంగంలోకి తీసుకొస్తే పాలనాపరంగా సమస్యలు పెంచేదిగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండటం వల్ల ప్రవేశాలు, ఫీజులు, వైద్య సేవల నాణ్యత వంటి కీలక అంశాలు పూర్తిగా ప్రజాహితంగా ఉంటాయని తెలిపారు. ప్రైవేట్ భాగస్వామ్యం ఉండటం వల్ల భవిష్యత్తులో విద్యార్థులపై ఫీజుల రూపంలో, రోగులపై సేవల ఖర్చుల రూపంలో, హాస్పిటల్ నిర్వహణ వంటి అదనపు భారాలు ప్రజలపై పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిపిపి విధానం కొనసాగితే ప్రభుత్వ ఆస్తులు మొత్తం ప్రైవేట్ రంగానికి మళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ వల్ల వచ్చిన అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటే పిపిపి విధానంలో ప్రయోజనం ఏమీ కనిపించడం లేదని తెలిపారు. కొత్త కళాశాలల కోసం ప్రకటించిన పిపిపి టెండర్ ప్రక్రియను వెంటనే రద్దు చేసి ప్రభుత్వమే కళాశాలలను అభివృద్ధి చేసేలా వైద్య ఆరోగ్యశాఖకు దిశానిర్దేశాలు ఇవ్వాలని కోరారు.

పాలారు నదిలో సరదాగా బోటులో షికారులో నారా భువనేశ్వరి

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

• నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- కుప్పం:

మానవసేవయే మాధవసేవ అని ఎన్‌టిఆర్ నమ్మారని, దాన్నే ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆచరిస్తోందని నారా భువనేశ్వరి అన్నారు. 4వ రోజు కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. కుప్పంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం ఉపాధికి చేయూత కార్యక్రమానికి నారా భువనేశ్వరి హాజరు 48 కుట్టుమిషన్లు, 30 తోపుడు బండ్లు అందజేశారు. కుప్పం పరిధిలోని శ్రీ కనక నాంచారమ్మ ఆలయాన్ని భువనేశ్వరి సందర్శించారు. అనంతరం పాలారు నదిలో బోటు షికారు చేశారు. దాసే గౌనూరు గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో ముఖాముఖిలో మాట్లాడారు. కార్యక్రమంలో పికెఎం ఉ డా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్ ఎపి ఐఐసి ప్రేమ్‌కుమార్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, రెస్కో డైరెక్టర్లు తులసి, అనసూయ శివ పాల్గొన్నారు.

24న బంగాళాఖాతంలో వాయుగుండం

• ధాన్యం తడవకుండా భద్రపరుచుకోవాలి

• విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 24 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు శనివారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. రానున్న 48 గంటల్లో పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. వాయుగుండం ప్రభావంతో ఈ నెల 28 నుంచి డిసెంబరు ఒకటి వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రైతులు వెంటనే వరి కుప్పలు వేసుకోవాలని, పండిన ధాన్యాన్ని వర్షంలో తడవకుండా భద్రపరుచుకోవాలని సూచించింది. ఈ నెల 23న ప్రకాశం, నెల్లూరు, వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచే చర్యలు

• అమరావతి రెండోదశ ల్యాండ్ పూలింగును వ్యతిరేకిస్తున్నాం

• సెస్ మాజీ ప్రొఫెసర్ రామచంద్రయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వరంగాన్ని మరింతగా నిర్వీర్యం చేస్తున్నారని, బహుళ పంటలు పండే భూములనే పరిశ్రమల పేరుతో లాక్కుంటున్నారని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వికేంద్రీకరణ చర్చావేదిక నాయకులు సి.రామచంద్రయ్య, కె.వసుంధర, సలీం మాలిక్ అన్నారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రానికి సంబంధించి కొన్ని అంశాలపై తమ వైఖరిని బహిరంగపరచడం కోసం ఈ వేదికను ప్రారంభించామని చెప్పారు. సి.రామచంద్రయ్య మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలకు బడ్జెట్లో ఎంత కేటాయించారు. ఎంత ఖర్చు చేశారనేది తెలపాలన్నారు. అలాగే సిఐఐ సమ్మిట్ల పేరుతో గత పదేళ్లుగా నిర్వహించిన సదస్సుల్లో వచ్చిన పెట్టుబడులు ఎన్నో లిఖితపూర్వకంగా తెలపాలని కోరారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అంతకంతకూ దిగజారిపోతోందని, పంటలకు గిట్టుబాటు ధర ఉండటం లేదని పేర్కొన్నారు. అమరావతి రెండోదశలకు భూములు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని వివరించారు. రైతులకు గిట్టుబాటు ధరల లేదని, పంటలను చేలల్లోనే వదిలేస్తున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలకు కేటాయింపులు ఖర్చులను లెక్కలతో సహా బయటపెట్టాలన్నారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామాల రైతుల పోరాటానికి తాము మద్దతు తెలుపుతున్నామని వివరించారు. ఒక సోలార్ ప్లాంటు కోసం 8458 ఎకరాలు సేకరించడం అమానుషమన్నారు. ప్లాంటుకు బంజరు భూములు కేటాయించి భూసేకరణ ఉత్తర్వులు వెంటనే విరమించాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు తీసుకొచ్చిన జిఒ 590ని రద్దు చేయాలని అన్నారు . అమరావతిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టని చెప్పారని, కానీ అదిప్పుడు గుదిబండగా మారుతుందని వివరించారు. రాజధాని పేరుతో ఇప్పటికే రూ.60 వేల కోట్ల పైగా అప్పుతెచ్చినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టిడిపి రాజధానికి నిధులు ఎందుకు తేలేకపోతోందని ప్రశ్నించారు. షాపింగ్‌మాల్స్ కోసం లూలూ లాంటి విశ్వసనీయత లేని కంపెనీలకు విశాఖపట్నం, విజయవాడలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములు కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

మరో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి జిల్లా)

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతి చెందిన మావోయిస్టుల్లో మరో ముగ్గురికి రంపచోడవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. వాసు అలియాస్ సైను, సురేష్ అలియాస్ రమేష్, అనిత మృతదేహాలకు శనివారం పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వారి స్వస్థలాలకు ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాలను తరలించారు. తమ వారిని కడసారి చూసేందుకు వచ్చిన మావోయిస్టుల కుటుంబీకులతో రంపచోడవరం ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చెత్త నిర్వహణకు రూ.603 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో చెత్త నిర్వహణకు రూ.603 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీలో భాగంగా విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, వైఎస్‌ఆర్ కడప, అనంతపురం వంటి చోట్ల ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం రూ.603 కోట్లు విడుదల చేశారు.

నదిలో చిక్కుకున్న ఆరుగురు పశువుల కాపర్లు

• సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన పోలీసులు

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

నదిలో చిక్కుకున్న ఆరుగురు పశువుల కాపర్లను పోలీసులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం అప్పారావుపాలెం గ్రామస్తులైన ఆరుగురు పశువుల కాపర్లు పశువులు మోపుకోవడానికి వెళ్లి తిరిగి ప్రయాణమయ్యారు. పెన్నా నది వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా నదిలో నీరు. అధికంగా రావడంతో అక్కడే చిక్కుకుపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్, ఎస్ఐ సాయి ప్రసాద్ , సంగం ఎస్ఐ రాజేష్ వెంటనే స్పందించి తమ సిబ్బందితో కలిసి వెళ్లి వారు ఒడ్డుకు చేర్చారు.

కేసులు డైవర్ట్ చేసేందుకే లేఖ

• ముఖ్యమంత్రికి జగన్ లేఖపై కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరకామణి, డ్రగ్స్, కల్తీ మద్యం కేసులను పక్కదారి పట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాజీ సిఎం వైఎస్ జగన్ కృష్ణా జిల్లాలపై లేఖ రాశారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు విమర్శించారు. ఈ మేరకు శనివారం జగన్‌కు ఆయన లేఖ రాశారు. దొంగే దొంగ.. దొంగ అన్నట్లు జగన్ లేఖ సారాంశం ఉందని, నిజాలతో కూడిన ప్రశ్న ఒక్కటి కూడా లేదని పేర్కొన్నారు. రాయలసీమ హక్కుల కోసం వైసిపి హయాంలో ఏం చేశారని ప్రశ్నించారు. 811 టిఎంసిల్లో తెలంగాణకు 299 టిఎంసిలు, ఎపికి 512 టిఎంసిల పంపకానికి అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఒప్పించిన ఘనత చంద్రబాబుది అని పేర్కొన్నారు.

కొండారెడ్డిని ఎందుకు సస్పెండ్ చేయలేదు : ఉండవల్లి శ్రీదేవి

వైసిపి విద్యార్థి విభాగం నాయకులు కొండారెడ్డి డ్రగ్స్‌తో ఈగల్ టీమ్‌కు దొరికిపోయినా ఇంతవరకు ఆ పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని ఎపి మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గంజాయి పేరు వినిపించకుండా ఉక్కుపాదం మోపిందన్నారు.

6 నెలల్లో రైతుల సమస్యలు పరిష్కారం

• ఎన్‌జిటిలో కేసుల వల్లే లంక భూములు తీసుకోవడం లేదు

• త్వరలో రాజధాని గ్రామాల్లో వసతులు

• కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని రైతుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి రెండు వారాలకోసారి సమావేశమై రైతుల సమస్యలను పరిష్కరించేలా చూస్తామన్నారు. రాజధాని సమస్యలపై ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ సమావేశం శనివారం రాయపూడిలో సిఆర్‌డిఎ కార్యాలయంలో జరిగింది. దీనిలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవతేజ పాల్గొన్నారు. అనంతరం పెమ్మసాని మీడియాతో మాట్లాడారు. రైతుల పోరాటాలు, త్యాగాలు ఎవరూ మర్చిపోలేదని, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు వల్ల కొన్ని ఇబ్బందులొచ్చాయని, వాటిని ఒక్కొక్కటీ పరిష్కరించుకుంటూ వస్తున్నామని తెలిపారు. రైతుల ప్లాట్లకు సంబంధించి ఇంకా 700 ఎకరాల్లో సమస్యలున్నాయని, ఇప్పటికే 98 శాతం కేటాయింపు పూర్తయిందని తెలిపారు. జరీబు, మెట్ట భూములకు సంబంధించి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన తరువాత పరిష్కరిస్తామన్నారు. గ్రామ కంఠాల విషయంలో సిఆర్‌డిఎ నిబంధనలకు అనుగుణంగా ఉన్నవాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని, 370 మంది రైతులకు ఇబ్బంది ఉందని తెలిపారు. మరోవైపు లంక అసైన్డ్ భూముల విషయంలో ప్రస్తుతం ఎన్‌జిటి కేసు పెండింగ్‌లో ఉందని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తుది తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకూ అభివృద్ధికి అవకాశం లేదని వివరించారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ అంశంపై కేబినెట్ సబ్‌కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. 90 రోజుల్లోగా ఈ సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జనవరి నుంచి 20 గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పన పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతి రైతులకూ న్యాయం చేస్తామన్నారు. రైతులకు సంబంధించి రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వేగంగా జరుగుతున్నాయని, భూములిచ్చిన వారిలో 719 మందికి మాత్రమే ప్లాట్లు కేటాయించాల్సి ఉందని అన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలో ఉన్న లేఅవుట్లలో సరిహద్దు రాళ్లు వేయాలని కమిటీకి సూచించినట్లు పేర్కొన్నారు. తాగునీటితోపాటు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వేసేలా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు డిపిఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు. డిసెంబరు నెలాఖరు నుంచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

స్టీల్ బ్రిడ్జి పనుల పరిశీలన

సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానంగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను మంత్రి నారాయణ శనివారం ఉదయం పరిశీలించారు. ఉండవల్లిలోని పంపింగ్ స్టేషన్ సమీపంలో కొత్తగా వేసిన పిల్లర్ల వద్దకు వెళ్లారు. కాంట్రాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

స్వయం ప్రకటిత దైవాంశ సంభూతులను నిరోధించాలి

• ప్రధాని , సిఎం, డిప్యూటీ సిఎంలకు జెవివి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వయం ప్రకటిత దేవునిగా ప్రకటించుకున్న వ్యక్తి రత్నాకరం సత్యనారాయణరాజు (పుట్టపర్తి సత్యసాయిబాబ) జన్మ శతాబ్ది ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తూ, మహిమా పూర్వకంగా సాధారణ ప్రచారం చేయడం పట్ల జన విజ్ఞాన వేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌లకు జెవివి రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డిలు శనివారం లేఖలు రాశారు. ప్రభుత్వం రాజ్యాంగ సిద్ధాంతాలను గౌరవించి, శాస్త్రీయ ఆలోచనను పరిరక్షించాలని కోరారు. సమాజాన్ని తిరోగమన దిశలో నెట్టేసే ఇలాంటి స్వయం ప్రకటిత దైవాంశ సంభూతులను ప్రభుత్వం నిరోధిస్తుందని ఆశిస్తున్నట్లు ఈ లేఖలో పేర్కొన్నారు. వివాదాస్పద వ్యక్తులు అనేక సామాజిక సేవలు చేసి ఉండొచ్చనే విషయాన్ని తాము అంగీకరిస్తామని, కానీ సామాజిక సేవ పేరిట శాస్త్రీయ విరుద్ధమైన వాదనలు/అద్భుతాలు/మహిమలు ప్రచారం చేయడం, వ్యక్తి పూజలను ప్రోత్సహించడాన్ని ఏ రూపంలోనూ సమాజం సమర్థించలేదన్నారు.

రాజ్యాంగంతో నడిచే ప్రజాస్వామ్యంలో, ప్రభుత్వ సంస్థలు, ప్రజాప్రతినిధులు ప్రజా సంక్షేమ పనులకే వినియోగించాలని, ఏ మత, ఆధ్యాత్మిక, మహిమల సంబంధిత కార్యాక్రమాలకుప్రభుత్వ నిధులు కేటాయించకూడదని లేఖలో వారు ప్రస్తావించారు.

ఇటువంటి అధికారిక కార్యక్రమాలను ప్రభుత్వమే ప్రోత్సహించడం ద్వారా లౌకిక వాదాన్ని చెరిపేస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని బలహీనపరుస్తోందని జెవివి నేతలు పేర్కొన్నారు. దేశం శాస్త్రీయ దృక్పథంతో కూడిన తార్కిక, ప్రగతిశీల దేశంగా ముందుకు సాగాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(హెచ్)లో పేర్కొన్న విధంగా ప్రతి పౌరుని కర్తవ్యమని తెలిపారు. మత, ఆధ్యాత్మిక, మహిమల ప్రదర్శనలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం, ప్రోత్సహించకూడదన్నారు.

ఇంధన పొదుపు, సామర్థ్యంపై విద్యార్థులకు 'షార్ట్ వీడియో పోటీలు'

• జెన్‌కో ఎమ్‌డి నాగలక్ష్మి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్యంపై పాఠశాల విద్యార్థులకు షార్ట్ వీడియో పోటీలు నిర్వహించనున్నట్లు జెన్‌కో ఎమ్‌డి, ఎపి ఇంధన పరిరక్షణ సమితి సిఇఒ ఎస్ నాగలక్ష్మి వెల్లడించారు. డిసెంబరు 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా 'బ్రైట్ ఐడియాస్, బ్రైటర్ ఫ్యూచర్, ఎనర్జీ ఎఫిషియెన్సీ ఛాలెంజ్ ఫర్ స్కూల్' అనే పేరుతో ఈ పోటీలు నిర్వహిస్తామని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు తమ సృజనాత్మకతను చూపడంతోపాటు సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావడానికి ఈ షార్ట్ వీడియో పోటీ ప్రత్యేకమైన అవకాశమని తెలిపారు. విద్యార్థులు తమ నామినేషన్లను సంబంధిత పాఠశాలల ద్వారా మాత్రమే పంపాలన్నారు. ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్యం లేదా సుస్థిర ఆచరణలపై ఆధారపడి, తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో 30 నుంచి 120 సెకన్ల నిడివితో ఎంపి4 ఫార్మెట్‌లో ఒరిజినల్‌గా చేసిన వీడియోలు మాత్రమే పంపాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు డిసెంబరు 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గూగుల్ ఫారమ్ ద్వారా అప్‌లోడ్ చేయాలని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం energyclubs.secm@gmail.com మెయిల్‌కు గానీ, 0866-2457620 నెంబర్ ద్వారా గానీ సంప్రదించాలన్నారు.

1991 ఆర్థిక సరళీకరణల తరహాలో లేబర్ కోడ్స్ ప్రాముఖ్యమైనవి : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన లేబర్ కోడ్స్..1991 నాటి ఆర్థిక సరళీకరణ సంస్కరణల తర్వాత అతి ముఖ్యమైనవని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. లేబర్ కోడ్‌ల అమలుపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పొందుపరిచిన పోస్ట్‌కు చంద్రబాబు రిప్లైగా ఈ పోస్టు చేశారు. ఇవి కార్మికుల భద్రతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. న్యాయమైన వేతనాలను నిర్ధారిస్తాయని, గౌరవాన్ని నిలబెడతాయని పేర్కొన్నారు. దేశాన్ని ప్రపంచస్థాయి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా ఇది నిర్ణయాత్మక అడుగు అని పేర్కొన్నారు. ఈ మైలురాయి సంస్కరణను అమలు చేసినందుకు ప్రధాన మంత్రిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

మరో 11 కార్పొరేషన్ల ఛైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అధికార భాషా కమిషన్ చైర్మన్‌గా విక్రమ్‌ను రాష్ట్రప్రభుత్వం నియమించనుంది. ఈ మేరకు జాబితాను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కార్యాలయం శనివారం విడుదల చేసింది.

కార్పొరేషన్ పేరు	చైర్మన్ పేరు
1. రాష్ట్ర అధికార భాషా కమిషన్	పూల విక్రమ్
2.ఉర్దూ అకాడమీ	మౌలానా షిబిలీ
3.ఎపి పోలీస్ హౌసింగ్	కళ్యాణం శివశ్రీనివాసరావు
4. చైల్డ్ లేబర్ స్టేట్ అడ్వైజరీ బోర్డ్	సత్యనారాయణరాజు
5.ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ	యాతగిరి రాంప్రసాద్
6.పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ	చిరుమామిళ్ల మధుబాబు
7.రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్	కొండ శంకర్ రెడ్డి
8.కుర్ని/కరికాలభక్తుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్	మిన్నప్ప
9. షేక్/షిక్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ	ముక్తియార్
10.ఎపి భట్రాజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	సరికొండ వెంకటేశ్వరరాజు
11.పెరిక(పెరిక బలిజ, పురగిరి క్షత్రియ), వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ	వనపర్తి వీరభద్రరావు

బాలికతో కలిసి హాకీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అనిత

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ప్రారంభం

నక్కపల్లిలో హాకీ అకాడమీ ఏర్పాటు చేస్తాం :మంత్రి అనిత

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

నక్కపల్లిలోని హాకీ క్రీడా మైదానంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న బాల బాలికల అండర్ - 19 రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలను శనివారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. తొలిరోజు ఈ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆటల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనని, రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి టిడిపి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఏర్పాటు చేసి విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న బలిరెడ్డి సూరిబాబును అభినందించారు. నక్కపల్లిలో 40 నుంచి 50 మంది హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతి నియోజకవర్గంలో స్టేడియం, ప్రతి జిల్లాలో ఒక అకాడమీ ఉండాలని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని అన్నారు. నక్కపల్లిలో స్థల సేకరణ చేపట్టి హాకీ అకాడమీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా డివిఇఒ ఉమారాణి, అనకాపల్లి జిల్లా డివిఇఒ వినోద్ బాబు, తహశీల్దార్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

జనసేన కమిటీల నిర్మాణం, కూర్పుపై కసరత్తు

- పార్టీ అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ కమిటీల నిర్మాణం, కూర్పుపై కార్యకర్తల మనోగతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆ పార్టీ శ్రేణులకు అధినేత పవన్‌కల్యాణ్ దిశా నిర్దేశం చేశారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో.. నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం, కార్యక్రమాల నిర్వహణపై నేతలతో శనివారం చర్చించారు. ఈ సందర్భంగా పవనకల్యాణ్ మాట్లాడుతూ.. ఉమ్మడి పొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బలమైన శ్రేణులున్నాయని, అక్కడ నాయకత్వాన్ని మరింత పటిష్టం చేసి పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు, మహిళా నేతలతో చర్చించి నివేదికలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

సుద్దాల అశోక్‌తేజ, గోరేటి వెంకన్నలను శ్రామిక్ ఉత్సవ్ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న కందారపు మురళి

'శ్రామిక్ ఉత్సవ్'కు సుద్దాల అశోక్‌తేజ, గోరేటి వెంకన్నకు ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా డిసెంబర్ 27 నుంచి జనవరి 2వ తేదీ వరకూ విశాఖలో జరగనున్న 'శ్రామిక్ ఉత్సవ్' సాంస్కృతిక కార్యక్రమాలకు అభ్యుదయ కవులు సుద్దాల అశోక్‌తేజ, గోరేటి వెంకన్నను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని వారి నివాసాలలో కలిసి మహాసభలో భాగస్వాములు కావాలని, కార్మికోద్యోమానికి అండగా నిలవాలని కోరారు. తప్పనిసరిగా తమ భాగస్వామ్యం ఉంటుందని వారు హామీ ఇచ్చారు. తమను భాగస్వామ్యం చేస్తున్నందుకు సిఐటియు అఖిల భారత కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. అశోక్‌తేజను, గోరేటి వెంకన్నలను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు సుద్దాల ఫోన్‌లో అభినందించారు.

హలో కార్మికా.... చలో విశాఖ

- సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్ అవిష్కరణ
- జయప్రదం చేయాలని నేతల పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిసెంబరు 31నుంచి 2026 జనవరి 4వరకు 5 రోజుల పాటు విశాఖలో జరుగనున్న సిఐటియు 18వ ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని, సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావులు పిలుపునిచ్చారు. బహిరంగసభకు ఉద్యోగులు, కార్మికులు, చిరుద్యోగులు, పెద్దసంఖ్యలో హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆలిండియా మహాసభల నేపథ్యంలో శనివారం విజయవాడ బందరు రోడ్డు ఎంబివికెలో సిఐటియు నేతలు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆలిండియా మహాసభలో కార్యాచరణ తీసుకుంటామన్నారు. డిసెంబరు 27 నుంచి జనవరి 2వరకు జిల్లాల్లో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడం, జనవరి 4న విశాఖలో లక్షలాదిమంది కార్మికులతో భారీ ర్యాలీ, బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. మహాసభలో పలు దేశాల్లోని ట్రేడ్ యూనియన్ నేతలు పాల్గొని సౌహార్థ్ర సందేశాలు ఇస్తారన్నారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. పెట్టుబడిదారుల దోపిడీకి అడ్డంగా ఉన్నాయని కార్మిక సంఘాలు, ప్రతిపక్షాల అభ్యంతరాలు, నిరసనలను పట్టించుకోకుండా నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేస్తున్నారని అన్నారు. లేబర్‌కోడ్ అమలంటే ఎమర్జన్సీ కంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. పెట్టుబడిదారుల కోసం

సిఐటియు అఖిలభారత మహాసభ పోస్టర్‌ను అవిష్కరిస్తున్న సిహెచ్ నరసింగరావు, ఎవి నాగేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, కె. ధనలక్ష్మీ, కెఆర్‌కె మూర్తి, దయా రమాదేవి, కె.ఉమామహేశ్వరరావు,ఆర్‌వి నరసింహారావు

కార్మికవర్గంపై ప్రభుత్వాలు దాడి చేస్తూనే ఉన్నాయన్నారు. లేబర్‌కోడ్‌ను స్వాతంత్ర్యానంతరం చేపట్టిన సమగ్ర కార్మిక, ప్రగతిశీల సంస్కరణలుగా ప్రధాని ఎక్స్‌లో పోస్టు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులు, ఉద్యోగులకు నష్టదాయకమైన లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా సిఐటియు అఖిల భారత మహాసభల్లో చర్చించి రాబోయో కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు చేసేందుకు ఈ మహాసభల్లో ప్రణాళికలు రచించబోతున్నట్లు వారు వెల్లడించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు లేవని, పిఎఫ్ ఇఎస్ఐ, బోనస్‌లు అమలు కావడంలేదన్నారు. మైనింగ్, బీడీ కార్మికుల సంక్షేమం కోసం సెస్ వసూలు చేసి కార్మికుల సంక్షేమ బోర్డులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌తో పాటు అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, పోస్టల్ , డిఫెన్స్, బొగ్గు గనులు, సిమెంట్ లాంటివన్ని ప్రైవేటీకరిస్తూ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారని చెప్పారు. శ్రామిక మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మీ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని, నిత్యావసర వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగాయన్నారు. ధరలకు అనుగుణంగా జీతాలు పెరగడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, దయా రమాదేవి, ఆర్‌వి నరసింహారావు, కెఆర్‌కె మూర్తి ,సూర్యారావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చూపిన సిబ్బందిపై చర్యలు

- కాకినాడ, రాజమండ్రి ప్రభుత్వాస్పత్రుల ఘటనలపై సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ, రాజమండ్రి ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించిన రెండు ఘటనల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ఆదేశించారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో తాళ్లరేవు మండలం గడిమొగ గ్రామానికి చెందిన 8 నెలల గర్భిణి మల్లేశ్వరి ప్రాణాలు కోల్పోయారు. మల్లేశ్వరికి పాంటాప్రోలోల్ అలెర్జీ ఉందని, హైపర్ టెన్షన్, డయాబెటిస్ కూడా ఉన్నాయని కేస్ షీట్లోనే నమోదు చేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా నవంబరు 20న మధ్యాహ్నం పిజి విద్యార్థిని పాంటాప్ ఇంజెక్షన్ ఇచ్చారని పేర్కొన్నారు. దీనివల్ల పేషెంట్‌కు వెంటనే ఫిట్స్, అనంతరం కార్డియాక్ అరెస్ట్‌తో రాత్రి 10 గంటల సమయంలో మరణించారని ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణ లోపం కూడా కారణమని తేలిందన్నారు. రాజమండ్రి ప్రభుత్వాస్పత్రిలో 55 ఏళ్ల రోగికి అక్టోబరు 2025 నాటికి గడువు ముగిసిన మందులు నవంబరు 8న అక్కడి ఆస్పత్రి వర్గాలు ఇచ్చారని పేర్కొన్నారు. వాటిని వాడిన రోగి మరింత అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. ఈ రెండు సంఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి సంబంధిత వైద్య సిబ్బందిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాకినాడ జిజిహెచ్‌లో మృతి చెందిన గర్భిణి కుటుంబానికి సాయం అందించాలని అధికారులకు సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నిర్దేశించారు.

టాటా డిజిటల్‌లో సగం మంది ఇంటికి..!

న్యూఢిల్లీ : పొదుపు చర్యలే లక్ష్యంగా టాటా గ్రూపు సంస్థల్లోనూ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియలు కొనసాగుతున్నాయి. ఇ-కామర్స్, డిజిటల్ విభాగమైన టాటా డిజిటల్‌లోనూ సగం మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తోన్నట్లు రిపోర్టులు వస్తోన్నాయి. రెండేళ్ల క్రితం ఆవిష్కరించిన టాటా న్యూ యాప్ ఆశించినంత రాబడిని ఇవ్వకపోవడంతో సంబంధిత విభాగంలోనే సిబ్బంది తొలగింపులు అధికంగా ఉంటాయని తెలుస్తోంది. మొత్తం సిబ్బందిలో 50 శాతం కంటే ఎక్కువ మందినే తగ్గించాలని యోచిస్తున్నట్లు సమాచారం. టాటా డిజిటల్‌లో భారీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆ సంస్థ నూతన సిఇఒ సజిత్ శివానందన్ నేతృత్వంలో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. టెక్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)లోనూ 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నారనే రిపోర్టులు ఆ సంస్థ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను పెంచుతోంది.

ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబీలకు, బంధువులు, ప్రజాసంఘాల నేతలు

కావ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం పొడపాటి కావ్య ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రి వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో కొంతమంది టీచర్ల వల్లే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకుందని, తోటి విద్యార్థులు తమకు చెప్పారని, తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ కావ్య చనిపోయి 24 గంటలు కావస్తున్నా కనీసం చింతలపూడి ఎమ్మెల్యే గాని, జంగారెడ్డిగూడెం జడ్‌పిటిసి సభ్యులుగాని, ప్రజా ప్రతినిధులుగాని ఎవరూ కూడా రాకపోవడం చాలా బాధాకరమన్నారు. కావ్య ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలుసుకుని బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జొన్నవారిగూడెం గ్రామస్తులు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడుతున్న రైతులు

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని కూటమి నేతలు దోచుకుంటున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పొగాకు, మిర్చి, మామిడి, పత్తి, కొబ్బరి, పామాయిల్, ధాన్యం ఇలా ఏ పంటకూ ధర లేదన్నారు. రైతులు దెబ్బతింటున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి అయిన తరువాత చంద్రబాబు ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా తీసుకురాలేదని పేర్కొన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచుతుంటే చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

ఉద్దేశపూర్వకంగానే వీడియో విడుదల : టిజెఆర్

మాజీ సిఎం జగన్ కోర్టుకు హాజరైన సమయంలో టిడిపి నాయకులు ఉద్దేశపూర్వకంగా కోర్టులో జగన్ నుంచున్న వీడియోను విడుదల చేశారని, మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. కోర్టు విచారణలో ఉండగా వీడియో తీసేందుకు ఎవరు అనుమతినిచ్చారని ఆయన ప్రశ్నించారు. కోర్టు వీడియోను విడుదల చేయడం నేరమని, దీనిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

తిరుపతి లడ్డూపై అసత్యాలు, వదంతులు : వైవి సుబ్బారెడ్డి

తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారన్నది అసత్యమని, వదంతులని టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. దాదాపు 20 కోట్ల లడ్డూలు నాణ్యత లేని నెయ్యితో తయారు అయ్యాయన్నది నిజం కాదని పేర్కొన్నారు. సిట్ విచారణకు తాను పూర్తిగా సహకరించానని, ఎప్పుడైనా హాజరుకావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. శాస్త్రీయ ఆధారాలతో విచారణ జరగాలని, రాజకీయ ప్రచారాలు విచారణను తప్పుదారి పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. లడ్డూలో జంతువుల కొవ్వును వాడారన్నది నిరాధారమన్నారు.

రోగులకు అండగా 'హెల్పింగ్ హ్యాండ్స్'

- 'మన్యం' కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు, సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం హెల్పింగ్ హ్యాండ్స్ అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్, ఐటిడిఎ, సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. అనంతరం అభా యాప్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో జిల్లాలోని అన్ని ప్రధాన ఆస్పత్రుల్లో వలంటీర్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఒక్కో రోగికి ఒక్కో వలంటీరును అప్పగిస్తామన్నారు. వారంతా రోగికి ఒపి చీటీ తీసుకొని వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స చేయించి, అవసరమైన మందులు తీసుకొని తిరిగి రోగిని ఇంటికి పంపేవరకు పూర్తి బాధ్యత వహిస్తారని వివరించారు. జిల్లాలోని మారుమూల గ్రామాల నుండి వచ్చే గిరిజనులు, నిరక్షరాస్యులు, పేదలకు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు కలగకుండా చూడడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దళిత, గిరిజనుల ఆరోగ్యం

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పట్ల మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు దీన్ని రూపకల్పన చేశామన్నారు. సేవా దృక్పథం ఉన్న యువత, విద్యార్థులు, చదువు పూర్తయినవారు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సెలవు దినాలు, తీరిక సమయాల్లో కేటాయించగల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో చేరవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సేవలో పాల్గొనే వారికి రెడ్ క్రాస్ సంస్థ, వైద్య నిపుణుల ద్వారా ప్రథమ చికిత్స, సిపిఆర్ చేయడంపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆసక్తిగలవారు తమ పేర్లను నమోదు చేసుకుని, ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్ భాస్కరరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి జి నాగభూషణరావు, ఇతర వైద్యాధికారులు, కలెక్టరేట్, ఐటిడిఎ, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఆయుధాలతో సహా ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు సరెండర్
- గణపతి, దేవ్‌జీల లొంగుబాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం : డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు శనివారం లొంగిపోయారు. ఇందులో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉండగా.. మిగతా 34 మంది వివిధ క్యాడర్‌కు చెందినవారున్నారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో లొంగిపోయిన మావోయిస్టులను పోలీసు అధికారులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. మావోయిస్టుల సిద్ధాంతానికి మనుగడ లేదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వారిలో మార్పు వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన పిలుపు మేరకే 37 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని చెప్పారు. ప్రస్తుతం లొంగిపోయిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యడ సాంబయ్య ఎలియాస్ ఆజాద్, అప్పాసీ నారాయణ ఎలియాస్ రమేశ్, నూపో గంగ ఎలియాస్ నీలేశ్‌లు ఉన్నారని, మిగతావారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వివిధ కమిటీ సభ్యులు ఉన్నారని వివరించారు. వీరి వద్ద ఒక ఎకె-47, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు పాయింట్ 303 రైఫిల్స్‌తో కలిపి మొత్తం ఎనిమిది ఆయుధాలున్నాయని తెలిపారు. మావోయిస్టు మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి ఎలియాస్ ముప్పాల లక్ష్మణ్‌రావు, మరో అగ్రనాయకుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీల లొంగుబాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా లొంగిపోయాం : సాంబయ్య, నీలేశ్

ప్రస్తుతం దేశంలో వస్తున్న కాలానుగుణ మార్పులను బట్టి తాము లొంగిపోయినట్టు మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబయ్య, నీలేశ్‌లు అన్నారు. తాము పార్టీకి చెప్పి లొంగుబాటులో నడిచామని తెలిపారు. ఉద్యమంలో అనేక కష్ట, నష్టాలను ఎదుర్కొన్నామని, కానీ అనుకున్న మార్పులేవీ కనిపించకపోవటంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవడమే మేలు అని భావించామని వారు చెప్పారు. సిద్ధాంతపరంగా విభేదాలేవీ లేకపోయినప్పటికీ ఆయుధాలతో పోరాటం చేయడం సాధ్యంకాని పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నదని, అజ్ఞాతంలో ఉన్న మిగతావారు కూడా లొంగిపోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం సర్వం సిద్ధమైంది. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలుపడంతో సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్లకు విధివిధానాలను ఖరారు చేస్తూ శనివారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు జిఒ నెం.46ను జారీ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మహిళలకు రొటేషన్ పద్ధతిలో సీట్లను కేటాయిస్తారు. రెండు రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తారు. రిజర్వేషన్ల కేటాయింపు తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టుగా ఈ నెల 24న రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసి, విచారణ ముగించాలని కోరనుంది. హైకోర్టు ఇచ్చే ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 25 లేదా 26న స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసే అవకాశం ఉంది.

సరుకుల సరఫరాలో రైల్వే రికార్డ్

- ఎనిమిది నెలల్లోనే రూ.100 కోట్ల టన్నుల డెలివరీ
- అందులో సగం పైగా బొగ్గు

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న భారత రైల్వే సరుకు రవాణలో దూసుకుపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్ నుంచి నవంబర్ 19 మధ్య కాలంలో ఏకంగా 100 కోట్ల (1 బిలియన్) టన్నుల సరుకు రవాణతో నూతన మైలురాయిని సాధించింది. రైల్వే మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. కేవలం తొమ్మిది నెలల్లోనే 102 కోట్ల టన్నుల సరకులను రవాణ జరిగింది. అత్యధికంగా బొగ్గు 50.5 కోట్ల టన్నుల సరఫరా నమోదయ్యింది.

ఆర్థిక సంవత్సరం 2025-26లో నవంబర్ 19 నాటికే రైల్వేలు 1 బిలియన్ టన్నుల (100 కోట్ల టన్నులు) సరుకు రవాణా మార్కును అధిగమించడం విశేషం. గతేడాది రోజుకు 4.2 మిలియన్ టన్నులు (42 లక్షల టన్నులు) సరకు రవాణ నమోదు కాగా.. ఈ ఏడాదిలో సగటున రోజుకు 44 లక్షల టన్నుల సరకు రవాణ జరిగిందని.. రైల్వేల నిర్వహణ సామర్థ్యం పెరిగిందని ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

గతేడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 90.69 కోట్ల టన్నుల సరుకు రవాణా జరగగా, ఈ సంవత్సరం అదే కాలంలో 93.51 కోట్ల సరుకు రవాణ నమోదయ్యింది. ఇది ఆరోగ్యకరమైన వృద్ధిని సూచిస్తుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.

వస్తువు	రవాణా (మిలియన్ టన్నుల్లో)
బొగ్గు	505
ముడి ఇనుప ఖనిజం	115
సిమెంట్	92
కంటైనర్ ట్రాఫిక్	59
స్టీల్	47
ఎరువులు	42
మినరల్ ఆయిల్	32
అహార ధాన్యాలు	30
ఇతర వస్తులు	74

భారతదేశ మౌలిక సదుపాయాల వృద్ధిలో కీలక పాత్రను సిమెంట్ రవాణ సామర్థ్యాలను మరింత పెంచడానికి చర్యలు తీసుకున్నట్లు ఆ శాఖ పేర్కొంది. బల్క్ వస్తువుల రవాణాను రోడ్డు మార్గం నుండి రైలు మార్గానికి మార్చడం వల్ల కర్బన ఉద్గారాలు తగ్గడంతో పాటుగా అనేక వాణిజ్యేతర ప్రయోజనాలు ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

అమెజాన్‌లో మళ్లీ కోతలు

- 1800 మంది ఇంజనీర్లకు ఉద్వాసన

న్యూయార్క్ : దిగ్గజ కంపెనీల్లో ఉద్వాసనలు కొనసాగుతున్నాయి. కృత్రిమ మేధా (ఎఐ)పై భారీగా ఖర్చు చేస్తోన్న నేపథ్యంలో ఉద్యోగాల తొలగింపునకు పాల్పడుతోన్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా అమెజాన్‌లో 1800 మంది ఇంజనీర్లను రోడ్డున పడేసింది. ఇప్పటికే 14,000 పైగా కార్పొరేట్ ఉద్యోగాలను తొలగించనున్నట్లు గత అక్టోబర్‌లో ఆ కంపెనీ ప్రకటించిన విషయం తెలిసిందే. క్లౌడ్ సర్వీసెస్, రిటైల్, అడ్వర్టైజింగ్, గ్రోసరీ విభాగాల్లోని సిబ్బంది ఉద్వాసనకు ప్రణాళికలు వేసింది. ఇందులో భాగంగా తాజాగా ఇంజినీర్ల బృందంలోని 1800 మందిని తొలగించింది. న్యూయార్క్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, వాషింగ్టన్ రాష్ట్రాల్లో 4,700 మందికిపైగా ఉద్వాసనల జాబితాలో ఉంటే.. అందులో 40 శాతం మంది ఇంజినీర్లే ఉండటం గమనార్హమని సిఎన్‌బిసి ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. మిగతా రాష్ట్రాల్లోనూ అమెజాన్ తమ తొలగింపుల డేటాను వెల్లడిస్తే ఏఏ విభాగాల్లో ఎంతమందిని తొలగిస్తున్నారనే దానిపై స్పష్టత రానుంది.

తలసేమియా పిల్లల చికిత్సకు మద్దతు

- రెయిన్‌బో హాస్పిటల్‌తో కోల్ ఇండియా ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్

చిన్న పిల్లలకు వైద్య సేవలను అందించే ప్రముఖ సంస్థ రెయిన్‌బో హాస్పిటల్స్‌తో దిగ్గజ ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తలసేమియా, అప్లాస్టిక్ అనీమియా వంటి జన్యు రక్త రుగ్మతలతో బాధపడుతున్న పిల్లల చికిత్సకు కోల్ ఇండియా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా పిల్లలకు మద్దతను అందించనుంది. శనివారం హైదరాబాద్‌లో ఈ ఒప్పందం కేంద్ర గనుల, ఖనిజ వనరుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సమక్షంలో జరిగింది. ముఖ్యంగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బిఎంటి) చికిత్స కోసం ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా ప్రతీ బిడ్డకు రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నారు. దీంతో నిరుపేద కుటుంబాలకు చెందిన రోగులకు స్థానికంగానే ఉన్నత ప్రమాణాలతో కూడిన చికిత్స అందుబాటులోకి వస్తుందని మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని థలసేమియా, అప్లాస్టిక్ అనీమియా రోగులకు అధిక నాణ్యత గల సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో కోల్ ఇండియా ఛైర్మన్ సనోజ్ కుమార్ ఝా, రెయిన్‌బో హాస్పిటల్స్ హోల్ టైం డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చిర్లా, గ్రూప్ మెడికల్ డైరెక్టర్ కె ప్రశాంత్ సహా ఇరు సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.1.43 లక్షల కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి

ముంబయి : ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ)లు తమ రూ.1,43,698 కోట్ల నిధులను భారత స్టాక్ మార్కెట్ల నుంచి తరలించుకుపోయారు. ప్రస్తుతం నవంబర్‌లో మాత్రం ఇప్పటి వరకు రూ.3,788 కోట్ల నికర పెట్టుబడులను పెట్టారు. గడిచిన వారంలో రూ.188 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. ఒక్క శుక్రవారం సెషన్‌లోనే రూ.1,766.05 కోట్ల ఎఫ్ఐఐలను ఉపసంహరించుకున్నారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంలో నెలకొన్న అనిశ్చితి ఆందోళనలకు తోడు, ఇటీవల రాణించిన మార్కెట్ల నుంచి లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారని నిపుణులు భావిస్తున్నారు.

ప్రకటనల్లో పారదర్శకతకు 'ఆస్కి కమిట్‌మెంట్ సీల్'

ముంబయి : అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) తన సభ్య సంస్థల కోసం 'ఆస్కి కమిట్‌మెంట్ సీల్‌'ను ఆవిష్కరించింది. ఇది ప్రకటనల్లో పారదర్శకత, న్యాయబద్ధత, ప్రామాణికత ప్రమాణాలను పెంచనుందని ఆ సంస్థ పేర్కొంది. కంపెనీలు ఈ సీల్‌ను తమ వెబ్‌సైట్లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ప్రకటన ప్రచారాల్లో ప్రదర్శించి నిజాయితీతో కూడిన బాధ్యతాయుత కమ్యూనికేషన్ పట్ల తమ నిబద్ధతను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయవచ్చని ఎఎస్‌సిఐ సిఇఒ, సెక్రటరీ జనరల్ మనీషా కపూర్ పేర్కొన్నారు. ఏదైనా ప్రకటనపై వినియోగదారులు ఈ సీల్‌ను చూసినప్పుడు వినియోగదారుల సమస్యలను న్యాయంగా పరిష్కరించడానికి కట్టుబడి ఉందన్న విశ్వాసాన్ని వారికి అందిస్తుందన్నారు.

సంపాదకీయం

వన బంధం

'వేడివేడి అన్నం మీద కమ్మని పప్పు, కాచిన నెయ్యి/ పప్పూ దప్పళం కలిపి కొట్టడం/ భోజనం వన భోజనం/ తల్లితోడు, పిల్లామేకా, ఆలూమగలు, అత్తాకోడలు, బాసూబంటూ ఒకటేనంటూ కలవడం/ భోజనం వన భోజనం' అంటారు ఆరుద్ర. బంధు మిత్రులతో సమయం గడుపుతూ ఆనందంగా, ఆహ్లాదకరంగా సాగే వనభోజనాలు... రోజువారీ యాంత్రిక జీవనం నుంచి బయటపడేందుకు మంచి ఆటవిడుపు. బంధువులు, స్నేహితులతో కలిసి చెట్ల నీడలో భోజనం చేయటాన్ని వన భోజనం అంటారు. ఇది సమానతను చాటే సందర్భం. ప్రకృతితో మనిషికి వున్న బంధాన్ని గుర్తుచేసుకునే సందర్భం కూడా. 'వనం' అనే పదానికి 'అరణ్యాన్ని ప్రేమించడమ'ని అమరకోశం చెబుతుంది. 'దీపావళి వెళితే కార్తీక మాసం వస్తుంది. అంటే శరదృతువు ద్వితీయార్థం. ఈ మాసంలో వెన్నెల బావుంటుంది, ఇది మానవ సంబంధాలను మెరుగుపరుస్తుంది' అంటారు ప్రముఖ రచయిత శ్రీరమణ. పక్కవారి గురించి పట్టించుకునే తీరికే లేని ఈ ఆధునిక యుగంలో మనిషి, ఒంటరితనంలోకి నెట్టబడుతున్నాడు. ఆ ఒంటరితనం నుంచి, ఒత్తిళ్లతో కూడిన జీవనపోరాటం నుంచి బయటపడి, కాస్తంత సేద తీరేందుకు ఈ వన భోజనాలు చక్కని ఉత్ప్రేరకాలు. అంతేకాదు, బయట గడిపేందుకు ఈ కార్తీక మాసపు రోజుల్లో వాతావరణం అనువుగా ఉంటుంది. చెట్లన్నీ పచ్చగా కళకళలాడుతుంటాయి. అలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో, చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటూ ఆరుబయట అందరూ కలిసి వంటలు వండుకోవడం, చిన్నా పెద్ద తేడా లేకుండా కబుర్లు చెప్పుకుంటూ కలిసి భోజనం చేయడం ఒక అద్భుతమైన అనుభూతి.

అందుకే కార్తీక మాసం రాగానే వన భోజనాల సందడి మొదలవుతుంది. అయితే ఉసిరి చెట్టు వంటి ఔషధ గుణాలున్న వనంలో భోజనాలు చేయడం ఆరోగ్యకరం అంటారు పెద్దలు. వన భోజనాలంటే సంప్రదాయం ఒక్కటే కాదు అందులో సామాజిక కోణమూ వుంది. అంతస్తుల తారతమ్యాలు, కుల, మత బేధాలు లేని స్నేహం, సమైక్యతా భావం ఈ భోజనాల్లో వెల్లివిరుస్తుంది. విహారం, వినోదం, ఆనందం, ఆరోగ్యం, సామరస్యం, సమైక్యత, పరస్పర సహకార భావనల సాంస్కృతిక ఉత్సవం. ఐక్యతకు ప్రతీక. మనిషికీ... ప్రకృతికీ మధ్య పెనవేసుకున్న అనుబంధం. ఈ సందర్భాన్ని కొందరు కుల భోజనాలుగా, ఎన్నికల భోజనాలుగా మార్చేస్తున్నారు. కార్తీక వన సమారాధనలు కాస్తా కుల సమారాధనలుగా, రాజకీయ ప్రచార వేదికలుగా మారుతున్నాయి. అన్నానికి, ఆకలికి కులం ఉండదంటారు పెద్దలు. కానీ ఫ్లెక్సీలు కట్టి మరీ కులాలవారీగా ఈ వన భోజనాల తంతు నిర్వహిస్తున్నారు. వీటికి భిన్నంగా...కుల మత సంకుచిత నీడలకు దూరంగా వన భోజనాలు తరచూ జరగాలి. 'మనుషులు కలిసి నవ్వితేనే బంధం పుడుతుంది' అంటారు రచయిత ఓ.హెన్రీ. మనలోని ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే...కుటుంబంతోనో, బంధు మిత్రులతోనో నిర్వహించుకునే ఇలాంటి వన భోజనాలు ఔషధంలా పనిచేస్తాయి. కొత్త ఉత్సాహాన్నిస్తాయి.

'మనిషి హృదయం ప్రకృతిలో మాత్రమే పూర్తిగా వికసిస్తుంది' అంటారు టాగూర్. చక్కని వాతావరణంలో అందరూ కలిసి భోజనం చేయడం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యాంత్రికతను వదిలించుకొని ఉత్తేజాన్ని పొందాలి. సమైక్యతా భావం, సామాజిక స్పృహ ఈ సహ పంక్తి భోజనాల్లో వెల్లివిరియాలి. అదే సందర్భంలో ప్లాస్టిక్ వినియోగానికి తావు లేకుండా ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. వాస్తవానికి వన భోజనాలు ప్రకృతి ఆరాధన కోసం ఏర్పడ్డాయి. ప్రకృతి మనకు అన్నీ ఇస్తుంది కనుకనే 'వృక్షో రక్షతి రక్షిత:' అంటారు. 'కనిపించని చేతులతో హత్తుకుని/ మనిషికి మరింత దగ్గరవుతుంది చెట్టు/ చెట్టుపై మమకారం పెంచుకుంటాడు మనిషి/ మనుషుల గుండె చప్పుడుని/ వనమంతా చెవులు రిక్కించి వింటూ/ తన ప్రతిస్పందనను/ పున్నాగ పూల వర్షంలా/ మనుషులపై చిలుకరిస్తుంది' అంటారో కవి. కనుక వన భోజనాలను కుల భోజనాలుగా మార్చకుండా...ప్రకృతిని, పర్యావరణాన్ని సంరక్షించుకునే సత్సంప్రదాయాన్ని భవిష్యత్తరాలకూ అందించాలి. 'మన బలం... మనం కలిసి వున్నంత వరకే' అన్న అల్లూరి సీతారామరాజు సందేశం నేటి సమాజానికి మరింత అవసరం.

మహనీయుల మాట



ఈనాడు విజ్ఞానంగా భావిస్తున్నదంతా
గతంలో కొంత మంది
గొప్ప వ్యక్తుల
శ్రమ ఫలమే.

- హెచ్.డబ్ల్యు. లాంగ్‌ఫెలో,
అమెరికన్ కవి, విద్యావేత్త.



ఎ.ఐ ఆర్భాటం..ఉద్యోగాల చెలగాటం..

ప్రస్తుతం

తెలకపల్లి రవి

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎ.ఐ) అనే కృత్రిమ మేధ చుట్టూ పరిభ్రమిస్తున్న ప్రపంచ ఆర్థిక సాంకేతిక చర్చ ఇప్పుడు భారత దేశాన్నీ తెలుగు రాష్ట్రాలనూ తాకింది. విశాఖలో గూగుల్ అదానీ ఎ.ఐ డేటా సెంటర్ స్థాపనకు ఒప్పందంతో ఈ చర్చ మరింత వేడి పుంజుకుంది. 1500 కోట్ల డాలర్ల పెట్టుబడితో రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయనే ప్రచారంపైనా చాలా వాదోపవాదాలు నడిచాయి. ఈ డేటా సెంటర్ల భూసేకరణ, పర్యావరణపై ప్రభావంపైన కూడా భిన్నాభిప్రాయాలు ఇంకా సాగుతున్నాయి కూడా. ఈ క్రమంలో విశాఖ డేటా సెంటర్ క్రెడిట్ వార్ పరాకాష్టకు చేరి మేమంటే మేమని వైసిపి, టిడిపి లు ప్రచారం హోరెత్తించాయి. ఆ రాజకీయాలు అలా వుంచితే ఈ సమయంలో ప్రపంచవ్యాపితంగా ఇదే విధంగా ఎ.ఐ పై చర్చలు సాగుతున్నాయి. ఉత్పత్తి సాధనాలు సాంకేతిక పరిజ్ఞానం ఆధునీకరణలో ఎప్పుడూ ముందుకు పోవలసిందే. కానీ అదే సమయంలో ఉద్యోగాలపై, ఉత్పత్తిపై దాని ప్రభావం ఏమిటి అనేది కూడా తప్పక అవగాహన పెంచుకోవలసిన విషయం. ఇతరులెవరో కాకుండా నేరుగా గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల సిఇవోలు, ప్రఖ్యాత ఆర్థికవేత్తలు ఈ విషయంలో ఏం చెప్పారో తెలుసుకోవడం కన్నా ఇందుకు మెరుగైన మార్గం వుండదు.

సిఇవోల సంకేతాలు

గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సిఇవో సుందర్ పిచాయ్ మొన్న బుధవారం మాట్లాడుతూ ప్రస్తుతం ఎ.ఐ కి సంబంధించి సాగుతున్న హడావుడిలో హేతుబద్ధత కొంత లోపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ప్రపంచ వ్యాపితంగా పెద్ద కంపెనీలు ఎ.ఐ వ్యవస్థలకు మారడం ద్వారా ఖర్చులు తగ్గించుకునేందుకు, లాభాలు పండించుకోవడానికి భారీ బడ్జెట్లు కేటాయించడం జరుగుతున్నది. గూగుల్ జెమినీ, చాట్‌బాట్, ఎ.ఐ చిప్స్ తీసుకొచ్చింది. ఓపెన్ ఎ.ఐ మైక్రోసాఫ్ట్ మధ్య పోటీ కూడా సాగుతున్నది. గత ఏడు నెలల్లో ఆల్ఫాబెట్ షేర్ల విలువ మూడున్నర లక్షల కోట్ల డాలర్లు పెరగడానికి ఎ.ఐ వెల్లువ కారణమైంది. ఎ.ఐ బుడగకు కారణమైన సంక్లిష్ట ఆర్థిక ఇంజనీరింగ్ దీని వెనక వుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎ.ఐ బుడగ పగిలిపోతే గూగుల్ తట్టుకోగలదా అని సుందర్ పిచాయ్‌ని ప్రశ్నించినపుడు మాతో సహా ఏ కంపెనీ కూడా తప్పించుకోజాలదని సమాధానమిచ్చారు. గతంలో వచ్చిన ఇంటర్నెట్ వ్యవహారాన్ని ఇందుకు ఉదాహరణగా చూపారాయన. ఇంటర్నెట్ వచ్చినపుడు కూడా ఇలాగే అతిగా పెట్టుబడులు పెట్టారు. అయితే అది ఇంటర్నెట్ నిజంగా అంత బలమైందా అని మాలాంటివాళ్లం ఎప్పుడూ ప్రశ్నించలేకపోయాము. అప్పుడు జరిగినట్టే ఇప్పుడూ జరుగుతుంది. ఇందులో కొంత హేతుబద్ధత వుంది. ఇలాంటి సమయాల్లో హేతురాహిత్యం కూడా కొంత వుంటుందని సుందర్ పిచాయ్ తేల్చిచెప్పేశారు.

పిచాయ్‌తో పాటు ఓపెన్ ఎ.ఐ సిఇవో శాం ఆల్మన్ కూడా ఎ.ఐ సాంకేతిక వ్యవస్థలో కొన్ని అంశాలు నిజంగా గాలిబుడగ స్వభావంతో వున్నాయని వ్యాఖ్యానించారు. దాని గురించి చెప్పడం చాలా ఆసక్తిగానూ వుంటుందన్నారు. అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ మాట్లాడుతూ దీనివల్ల ఎ.ఐ ప్రభావంతో పారిశ్రామిక బుడగ కూడా వస్తుందని చెబుతూ ఈ రెండింటికీ మధ్య తేడాను వివరించే ప్రయత్నం చేశారు. "బ్యాంకింగ్ బుడగ, బ్యాంకింగ్ వ్యవస్థలో సంక్షోభం... 2008లో అది ఎంతో దుష్ప్రభావం చూపింది. సమాజం అలాంటి వాటిని రాకుండా చేయాలని కోరుకుంది. పరిశ్రమలకు సంబంధించిన బుడగల సంగతీ అంతే. అయితే మంచి బుడగలూ వుంటాయి. అంతా అయిపోయాక చూస్తే వాటివల్ల కలిగిన ఫలితాలేమిటో ఎవరు విజేతలో వాటి వల్ల ఎవరు ప్రయోజనం పొందారో అర్థమవుతుంది" అంటూ నర్మగర్భంగా మాట్లాడారు.

మైక్రోసాఫ్ట్ సిఇవో సత్య నాదెళ్ల కూడా ఈ సమయంలో ఇండియా లోనే పర్యటిస్తున్నారు. ఎ.ఐ శకంలో తమ వాణిజ్య నమూనా పూర్తిగా మరోసారి ఆలోచించుకోవలసి వుంటుందని ఆయనన్నారు. పదిహేనేళ్ల కిందట క్లౌడ్ కంప్యూటింగ్‌కు మారినప్పుడు తమకు పనిచేసి పెట్టిన నిపుణుడు రోల్ఫ్ హార్మ్స్‌నే మళ్లీ ఈ దశలోనూ పరివర్తనకు తోడ్పడాలని తెచ్చుకున్నారు. 2025 జులైలో తమ ఉద్యోగులకు దీనిపై లేఖ రాసిన సత్య నాదెళ్ల అనిశ్చిత పరిస్థితి, గజిబిజిలో లే ఆఫ్‌లకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పరిశ్రమలో కావలసింది విజయమేనంటూ వినియోగదారుల కొత్త అవసరాలను అందుకోవడం కోసం ఇప్పుడున్న వాణిజ్య నమూనా మార్పుతో కొత్త తరహా ఉద్యోగాలు సృష్టించాల్సి వస్తుందన్నారు. దీర్ఘకాలంలో మైక్రోసాఫ్ట్ మనుగడ కోసం ఎంతో ఆందోళన సత్య నాదెళ్ల లేఖలో ప్రతిబింబించిందని మీడియా వ్యాఖ్యానించింది. మినీ కంప్యూటర్లను ఒకప్పుడు పాలించిన డిజిటల్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ కొన్ని వ్యూహాత్మక తప్పిదాలు చేసిన కారణంగా మటుమాయమైపోయిన ఉదాహరణ తనను వెంటాడుతున్నదని పేర్కొన్నారు. మనం సృష్టించిన కొన్ని అతి పెద్ద వ్యాపార వ్యవస్థలు మనం ముందుకు పోతున్నకొద్దీ కొరగానివిగా మారిపోవచ్చని హెచ్చరించారు. మైక్రోసాఫ్ట్ అనేది వినియోగదారీ పరికరాలను సరఫరా చేసే పరిస్థితి నుంచి ఎ.ఐ ఏజంట్లకు అంటే యంత్రాలకు మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించే పాత్రలోకి మారిపోవచ్చని సూచించారు. వాస్తవానికి సత్య నాదెళ్ల స్వయంగా తన గత పాత్ర నుంచి మారిపోగా మరొకరిని తీసుకొచ్చారు. సుందర్ పిచాయ్ మాట్లాడుతూ ఎ.ఐ అనేది సిఇవో లను కూడా వదలిపెట్టబోదని చెప్పిన దాని ప్రభావం ఇక్కడ మనకు కనిపిస్తుంది. సత్య నాదెళ్ల మాటలు అతి తీవ్ర హెచ్చరిక అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా నిర్వహించిన ఐ.టి కంపెనీల అధినేతల సమావేశంలోనే ఎ.ఐ పై పెట్టుబడులు పెంచాలని నిర్ణయానికి వచ్చిన విషయం గతంలో చెప్పుకున్నాం. మీరు ఇప్పుడు ఏ పత్రిక చూసినా డేటా సెంటర్‌పై లేదా ఎ.ఐ పై ఇంత పెట్టుబడి పెట్టాలని నిర్ణయించినట్టు ప్రకటనలే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు టి.సి.ఎస్ తో కలసి డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి టిపిజి ఒప్పందం చేసుకోగా అందుకు 200 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామన్నారు. 1.2 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ నిర్మాణానికి దాదాపు 700 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడతామని టి.సి.ఎస్ ప్రకటించింది. సత్య నాదెళ్ల స్వయంగా కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ తదితరులను కలుసుకున్నారు.

లేఆఫ్‌లు..తొలగింపులు..

అమెరికాలో ఇప్పుడు వరస లేఆఫ్‌ల కాలం నడుస్తున్నది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నిర్వహణ వ్యయం పెరిగిపోయిందని అనేక కంపెనీలు చెబుతున్నాయి. ఇంకొన్ని ఎ.ఐ కి అనుగుణంగా మారడం వంటి కారణాలు చూపిస్తున్నాయి. 43 రోజుల షట్‌డౌన్ దీనికి ఆజ్యం పోసింది. 4.4 శాతం నిరుద్యోగం పెరిగింది. మహిళలలో 7.5 శాతం నిరుద్యోగం పెరిగింది. ఒక్క ఆగష్టు నెలలోనే 4000 ఉద్యోగాలు ఊడాయి. నవంబరులో వెరిజోనా కంపెనీ 13 వేల మందినీ, జనరల్ మోటర్స్ 1700 మందినీ, పారమౌంట్ 2 వేల మందిని (పది శాతం సిబ్బందిని), అమెజాన్ 14 వేల మందినీ తొలగిస్తున్నట్టు ప్రకటించాయి. మొత్తం 30 వేల కార్పొరేట్ ఉద్యోగాలు కత్తిరిస్తున్నట్టు అమెజాన్ వెల్లడించింది. యుపిఎస్ 48 వేల ఉద్యోగాల కోత ప్రకటించింది. నెస్లె ప్రపంచవ్యాపితంగా 16 వేల మందిని తొలిగిస్తానని చెబితే డేనిష్ ఫార్మా కంపెనీ నోవో నోర్డిక్ 9 వేల ఉద్యోగాలకు ఎసరుపెట్టింది. ఇంటెల్ ఇప్పుడున్న 99,500 మంది ఉద్యోగుల సంఖ్యను 75 వేలకు తీసుకురానున్నట్టు సిఇవో లిప్ బూ టాన్ వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ 6 వేల మందినీ, ప్రాక్టర్ అండ్ గాంబిల్ 7 వేల మందినీ తొలగిస్తామని ప్రకటించాయి. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం సంపన్న దేశాలలో 40 శాతం, పేద దేశాలలో 26 శాతం ఉద్యోగాలకు దెబ్బ తగులుతుంది. మెకన్సీ, జెపి మోర్గాన్ వంటివి కూడా ఈ విషయమై ఇలాంటి అంచనాలే ఇచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం ఆహ్వానించదగిందైనా మార్కెట్ ఫైనాన్స్ పెట్టుబడి స్వార్థ ప్రయోజనాలు వినాశక వ్యూహాలు దాన్ని తప్పుదోవ పట్టించడం ఇందుకు కారణం. మానవాళి శ్రేయస్సుకుగాక ఖర్చులు తగ్గించుకొని లాభాలు పెంచుకోవడమే వాటి ఏకైక లక్ష్యంగా వుంటుంది మరి. మన పాలకులు కూడా ఇందులో తమ వాటా కోసం పాకులాడుతుంటారు తప్ప దీర్ఘకాలిక అంశాలు పట్టించుకోరు.

అవగాహన, అప్రమత్తత

మిగిలిన వాటికి భిన్నమైన ఒక ప్రత్యేక లక్షణం ఎ.ఐ బుడగలో ఏమంటే ఇది భూములతో (రియల్ ఎస్టేట్‌తో) ముడిపడి వుంటుంది. దీనిపై 'మనీ కంట్రోల్' పత్రిక ప్రత్యేక కథనమే ప్రచురించింది. ప్రత్యేకమైన భూఖండాలు, చాలా అధునాతమైన సాంకేతిక మౌలిక సదుపాయాలు సిద్ధం చేసి కాలహరణం కూడా జరగకుండా అందజేసేందుకు సిద్ధమవుతున్నాయట. విశాఖ వంటి నగరాలు అటుంచి నవీ ముంబాయ్, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, నోయిడా వంటి చోట్ల ఇందుకోసం ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. గతంలోనైతే డేటా సెంటర్ల నిర్వాహకులు భూములు కొనుక్కొని తమకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేసుకునేవారు. ఇప్పుడు వారు చాలా తొందరలో వుండటంతో అన్నీ అమ్మకందారులే చేయవలసి వస్తున్నది. వీటినే 'ప్లగ్ అండ్ ప్లే' డేటా సెంటర్లు అంటున్నారు. దీనికి చాలా అధునాతనమైన విద్యుత్ సరఫరా ఏర్పాటు వ్యవస్థ కూడా సమకూర్చాలి. అనేక రాష్ట్రాలు పోటీపడి రాయితీలు ఇస్తున్నాయి.

ఈ డేటా సెంటర్ల నీటి అవసరాలు విద్యుత్, వాతావరణం వేడెక్కిపోవడం వంటి అంశాలపైనే స్పష్టత రావలసి వుండగా భూములు, ఉద్యోగాలు, సాంకేతిక మార్పిడి కూడా సవాళ్లు కాబోతున్నాయని చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలు. సాంకేతిక వికాసం కోసం వీటిని ఆహ్వానించినా సమతుల్యతకు తగు రక్షణలు ఎలా తీసుకుంటారనే ప్రశ్న వుండనే వుంటుంది. విస్తారమైన ఈ మార్పు చివరిదాకా ఇలాగే కొనసాగుతుందా? ఈ బుడగ పెట్టుబడి మార్కెట్లను కాపాడుతుందా అనే ప్రశ్నలు వాటి యజమానులను ప్రభుత్వాలను కూడా వేధిస్తున్నాయి. ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ వంటి వారు దీనికి ఎప్పుడో జవాబు చెప్పేశారు. ఆర్థిక రంగానికి ఎ.ఐ చేసే దోహదం నామమాత్రమేననీ, అదే సమయంలో తాత్కాలికంగా కొన్ని రకాల ఉద్యోగాలు వచ్చినా దీర్ఘ కాలంలో మాత్రం పెద్ద మార్పు వుండబోదనీ వివరించారు. ఒకప్పుడు వచ్చిన డాట్ కాం బుడగతో దీన్ని పోలుస్తున్నారు. సుందర్ పిచాయ్ ఇంటర్నెట్‌ను ఉదహరించారు. రియల్ బుడగ, సబ్ ప్రైం సంక్షోభం వంటివన్నీ ఆర్థిక సంక్షోభాల అనేక రూపాలుగా చూడవలసి వుంటుంది. వీటన్నిటికి తలపైన శాశ్వతంగా సైనిక పారిశ్రామిక వ్యవస్థ వుంటుంది. ఆయుధాల వ్యాపారం వుంటుంది. అమెరికా ఏకకాలంలో ఇప్పుడు ఆయుధాల అమ్మకం ఒప్పందాలు కూడా పెంచుకోవడం చూస్తాం. ఆ జాబితాలోనూ భారతదేశం వున్నది. తెలుగు మీడియా రెండవ కోణం అసలు ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందుకే ఈ అంశంపై వాస్తవాల ప్రాతిపదికన లోతైన అధ్యయనం, అప్రమత్తత అనివార్యమవుతున్నాయి.

★



సత్య నాదెళ్ల

సుందర్ పిచాయ్

> **మిగిలిన వాటికి భిన్నమైన ఒక ప్రత్యేక లక్షణం ఎ.ఐ బుడగలో ఏమంటే ఇది భూములతో (రియల్ ఎస్టేట్‌తో) ముడిపడి వుంటుంది. దీనిపై 'మనీ కంట్రోల్' పత్రిక ప్రత్యేక కథనమే ప్రచురించింది. ప్రత్యేకమైన భూఖండాలు, చాలా అధునాతమైన సాంకేతిక మౌలిక సదుపాయాలు సిద్ధం చేసి కాలహరణం కూడా జరగకుండా అందజేసేందుకు సిద్ధమవుతున్నాయట. విశాఖ వంటి నగరాలు అటుంచి నవీ ముంబాయ్, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, నోయిడా వంటి చోట్ల ఇందుకోసం ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. గతంలోనైతే డేటా సెంటర్ల నిర్వాహకులు భూములు కొనుక్కొని తమకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేసుకునేవారు. ఇప్పుడు వారు చాలా తొందరలో వుండటంతో అన్నీ అమ్మకందారులే చేయవలసి వస్తున్నది. వీటినే 'ప్లగ్ అండ్ ప్లే' డేటా సెంటర్లు అంటున్నారు. దీనికి చాలా అధునాతనమైన విద్యుత్ సరఫరా ఏర్పాటు వ్యవస్థ కూడా సమకూర్చాలి. అనేక రాష్ట్రాలు పోటీపడి రాయితీలు ఇస్తున్నాయి.**

> **ఐఎంఎఫ్ అంచనా ప్రకారం సంపన్న దేశాలలో 40 శాతం, పేద దేశాలలో 26 శాతం ఉద్యోగాలకు దెబ్బ తగులుతుంది. మెకన్సీ, జెపి మోర్గాన్ వంటివి కూడా ఈ విషయమై ఇలాంటి అంచనాలే ఇచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం ఆహ్వానించదగిందైనా మార్కెట్ ఫైనాన్స్ పెట్టుబడి స్వార్థ ప్రయోజనాలు వినాశక వ్యూహాలు దాన్ని తప్పుదోవ పట్టించడం ఇందుకు కారణం. మానవాళి శ్రేయస్సుకుగాక ఖర్చులు తగ్గించుకొని లాభాలు పెంచుకోవడమే వాటి ఏకైక లక్ష్యంగా వుంటుంది మరి. మన పాలకులు కూడా ఇందులో తమ వాటా కోసం పాకులాడుతుంటారు తప్ప దీర్ఘకాలిక అంశాలు పట్టించుకోరు.**

విద్యుత్ బిల్లు 'ప్రైవేటు' కోసమే!

వ్యాఖ్య

యం.వి. ఆంజనేయులు

కేంద్ర ప్రభుత్వం 'విద్యుత్ చట్టం 2003'కు సవరణ చేయబోతున్నది. 'విద్యుత్ (సవరణ) బిల్లు 2025' పేరుతో ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. అలాగే వెబ్‌సైట్లో కూడా పెట్టి అభిప్రాయాలు కోరింది. ఈ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు స్పందించిన దాఖలాలు లేవు.

ఇంతకూ ఆ బిల్లులో ఏముందో చూద్దాం. విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 14, సెక్షన్ 42 లకు సవరణలు చేయబోతున్నారు. ఈ సవరణ జరిగితే ఒకే ప్రాంతంలో విద్యుత్‌ను పంపిణీ చేయటానికి అనేక కంపెనీలకు లైసెన్సులిస్తారు. ఇప్పుడు మన రాష్ట్రంలో ఉమ్మడి కృష్ణ, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు ఎ.పి.సి.పి.డి.సి.ఎల్, ఉమ్మడి నెల్లూరు నుండి రాయలసీమ వరకు ఎ.పి.ఎస్.పి.డి.సి.ఎల్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లానుండి ఉత్తరాంధ్ర మొత్తం ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్ విద్యుత్‌ను పంపిణీ చేస్తున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ రంగ సంస్థలే. ప్రైవేటు సంస్థలు లేవు. ఈ చట్ట సవరణ జరిగితే ఈ ప్రాంతాలలో విద్యుత్‌ను పంపిణీ చేయటానికి ప్రైవేటు సంస్థలకు కూడా లైసెన్సులిస్తారు.

అయితే లైసెన్సుదారులు ఎవరికి వారు విడిగా లైన్లు వేయటం, ట్రాన్స్‌ఫారాలు, సబ్ స్టేషన్లు పెట్టకోవటం కుదరదు కాబట్టి, దీనికోసం మరో సవరణ చేస్తున్నారు. ఈ చట్ట సవరణ జరిగిన అనంతరం ఈ మౌలిక సదుపాయాలను ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలకు పంచి ఇవ్వాలి. అంటే ప్రభుత్వ రంగంలో నిర్మించిన ఈ మౌలిక సదుపాయాలను ఎలాంటి పెట్టుబడి పెట్టే పని లేకుండా ప్రైవేటు సంస్థలు వాడుకొని లాభాలు సంపాదించుకుంటాయి. ఈ మౌలిక సదుపాయాలు లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించినవి. వీటిని ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడానికే ఈ సవరణలను ప్రతిపాదించారు.

దీనితోబాటుగా 1 మెగావాట్ (అంటే 1000 కిలో వాట్లు) కన్నా ఎక్కువ వాడే వినియోగదారుల నుండి ప్రభుత్వరంగ డిస్కంలను తప్పించి ప్రైవేటు రంగానికి కేటాయించే విధంగా మరో సవరణ ప్రతిపాదించారు. ఈ సవరణ జరిగితే అత్యధికంగా విద్యుత్ వాడే పరిశ్రమలు, విజయవాడ, విశాఖపట్నం లాంటి నగరాలు ప్రైవేటు కంపెనీల చేతులలోకి పోతాయి. అంటే బాగా ఆదాయం వచ్చే కనెక్షన్లు, ప్రాంతాలు ప్రైవేటు కంపెనీల చేతులలోకి పోతాయి. ఆదాయం అంతగా రానివి ప్రభుత్వ సంస్థలకు మిగులుతాయి. దీనితో ప్రభుత్వరంగ పంపిణీ సంస్థలు దివాలా తీసి వాటిని కూడా ప్రైవేటు సంస్థలకు అప్పగించవలసిన పరిస్థితి సృష్టించబడుతుంది.

విద్యుత్ వినియోగదారులకు, విద్యుత్ పంపిణీ సంస్థలకు మధ్యవర్తిగా ఉండే లక్ష్యంగా విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్లను ఏర్పాటు చేశారు. అలాంటి రెగ్యులేటరీ కమిషన్‌కు విద్యుత్ మార్కెట్‌ను ప్రోత్సహించే అధికారం ఈ సవరణల ద్వారా ఇవ్వబోతున్నారు. అంటే ఇకమీదట రెగ్యులేటరీ కమిషన్ విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలకన్నా, మార్కెట్‌ను ప్రోత్సహించటానికే ఉపయోగ పడుతుంది. మార్కెట్‌ను ప్రోత్సహించటం అంటే విద్యుత్ ప్రైవేటు కంపెనీలను, వాటి ధన దాహాన్ని ప్రోత్సహించటమే.

క్రాస్ సబ్సిడీలను రద్దు చేయటానికి మరో సవరణ ప్రతిపాదించారు. ఇది జరిగితే సాధారణ ప్రజానీకానికి విద్యుత్ చార్జీలు భారీగా పెరుగుతాయి. వ్యవసాయంతో పాటుగా చిన్న పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటాయి. చేతివృత్తులవారు దెబ్బ తింటారు. నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతుంది. మన రాష్ట్రంలోనే కాదు. దేశ వ్యాపితంగా ఇదే జరగబోతున్నది.

ఇలాంటివి అనేక సవరణలు ఉన్నాయి. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటు వారికి అప్పగించటం అనేది ఈ సవరణ బిల్లులో అత్యంత కీలకమైనది.

ప్రైవేటు రంగం పని తీరు ఎలా ఉంటుందనడానికి ఒక ఉదాహరణ చెప్పుకుందాం. ఒరిస్సాలో 1999 లోనే విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరించటం ప్రారంభించారు. ఒరిస్సాలో తుపాను సమయంలో పడిపోయిన స్థంభాలను పునరుద్ధరించటానికి అక్కడ పంపిణీ చేపట్టిన ప్రైవేటు సంస్థ విఫలమైంది. ఖర్చు ప్రభుత్వమే భరించాలని ప్రైవేటు సంస్థలు మొండికేశాయి. చివరకు ప్రభుత్వం పునరుద్ధరించవలసి వచ్చింది. ఈ వివాదం మూలంగా కొన్ని ప్రాంతాలలో విద్యుత్‌ను పునరుద్ధరించటానికి దాదాపు నెల రోజులు పట్టింది. దానికి భిన్నంగా మన రాష్ట్రంలో గత అక్టోబరు చివరి వారంలో వచ్చిన మొంథా తుపానుకు దెబ్బతిన్న విద్యుత్ రంగాన్ని స్వల్ప వ్యవధిలో పునరుద్ధరించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థ ప్రభుత్వ రంగంలో ఉండటం వలననే ఇది సాధ్యపడింది.

విద్యుత్ అనేది భారత రాజ్యాంగం లోని 7వ షెడ్యూల్‌లో ఉన్న ఉమ్మడి జాబితాలో 38వ అంశంగా ఉన్నది. ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్రం రాష్ట్రం సమ బాధ్యతలు కలిగి ఉంటాయి. అందువలన కేంద్రం ముసాయిదాని రూపొందించినా రాష్ట్రాల అభిప్రాయాలు అడగాలి. ఈ సవరణ బిల్లుపై అభిప్రాయాలు చెప్పమని రాష్ట్రాలను అడగలేదు. కేవలం రాష్ట్రాల వ్యాఖ్యలు మాత్రమే కోరింది. సీరియస్‌గా చర్చించి ఒక నిర్ణయానికి వచ్చి తెలియజేసేది అభిప్రాయం అవుతుంది. ప్రభుత్వ స్థాయిలో అయితే మంత్రివర్గ సమావేశంలోనో లేక అసెంబ్లీ సమావేశంలోనో చర్చించి అభిప్రాయాన్ని చెప్పవలసి ఉంటుంది. వ్యాఖ్య అనేది సీరియస్‌గా చేయాల్సిన అవసరంలేదు. ఇది దేశ సమాఖ్య వ్యవస్థను పరిహసించటమే అవుతుంది.

అయితే మన రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వానికి ఇవేమీ పట్టలేదు. బిల్లుపై మౌనం వహిస్తున్నది. ఫెడరల్ వ్యవస్థలో తమ అభిప్రాయాన్ని తెలియజేసే హక్కు రాష్ట్రాలకు ఉన్నది. ఆ హక్కును కాపాడుకోవాలన్న ధ్యాస కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నట్లుగా కనిపించటం లేదు. ప్రభుత్వ సంస్థలను ధ్వంసం చేయటం, ప్రైవేటు కంపెనీలకు పెద్దపీట వేయటం విధానంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటీకరించటం కూడా తన విధానంలో భాగంగానే పరిగణించి ఉండవచ్చు. మరోవైపు అన్ని కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చాలని ఆదేశాలిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చటం అనేది విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు ముందస్తు చర్య. ఈ కారణాల చేతనే ఈ సవరణ బిల్లుపై మౌనం వహిస్తున్నది.

విద్యుత్ ఉత్పత్తిలో కొంత భాగాన్ని ప్రైవేటు సంస్థలకు ఇస్తేనే వినియోగదారులు బిల్లులు కట్టలేక యాతన పడుతున్నారు. ఇక విద్యుత్ పంపిణీ వ్యవస్థనుకూడా ప్రైవేటీకరిస్తే, విద్యుత్ సరఫరాను ఎక్స్చేంజ్‌లకు అప్పగిస్తే ప్రైవేటు కంపెనీల ధన దాహానికి వినియోగదారులు బలవుతారు. రాష్ట్రం అధోగతి పాలవుతుంది. ఇప్పటికే రైతు సంఘాలు, విద్యుత్ ఉద్యోగుల సంఘాలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక సైతం స్పందించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతి పౌరుడు గళం విప్పవలసి ఉన్నది. ప్రైవేటీకరణను అడ్డుకోవాలి.

/ వ్యాసకర్త విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్, విజయవాడ /

> **క్రాస్ సబ్సిడీలను రద్దు చేయటానికి మరో సవరణ ప్రతిపాదించారు. ఇది జరిగితే సాధారణ ప్రజానీకానికి విద్యుత్ చార్జీలు భారీగా పెరుగుతాయి. వ్యవసాయంతో పాటుగా చిన్న పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటాయి. చేతివృత్తులవారు దెబ్బతింటారు. నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతుంది. మన రాష్ట్రంలోనే కాదు. దేశ వ్యాపితంగా ఇదే జరగబోతున్నది. ఇలాంటివి అనేక సవరణలు ఉన్నాయి. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటు వారికి అప్పగించటం అనేది ఈ సవరణ బిల్లులో అత్యంత కీలకమైనది.**



క్యాష్ వ్యాన్ దోపిడీ కేసులో ముగ్గురు అరెస్ట్

- రూ.5.76 కోట్లు స్వాధీనం

బెంగళూరు: బ్యాంకు నుంచి డబ్బు తరలిస్తున్న క్యాష్ వ్యాన్ దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దోచుకున్న రూ.7.11 కోట్లలో రూ.5.76 కోట్లు రికవరీ చేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ నెల 18న మధ్యాహ్నం 12.48 గంటల సమయంలో ఒక బ్యాంకు బ్రాంచ్ నుంచి రూ.7.11 కోట్లు తరలిస్తున్న సిఎంఎస్ క్యాష్ వ్యాన్‌ను జయనగర్ డైరీ సర్కిల్ సమీపంలోని అశోక పిల్లర్ వద్ద కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. 'ప్రభుత్వ వాహనం' స్టిక్కర్ ఉన్న వాహనంలో వచ్చిన ఆ వ్యక్తులు ఆర్‌బిఐ అధికారులుగా చెబుతూ, వ్యాన్ సిబ్బందిని గన్‌తో బెదిరించారు. డబ్బుకు సంబంధించిన పత్రాలను ధ్రువీకరించాల్సి ఉన్నదని పేర్కొన్నారు. సిబ్బందితోపాటు క్యాష్ బాక్సులను తమ వాహనంలోకి ఎక్కించారు. మార్గమధ్యలో వ్యాన్ సిబ్బందిని దించేసి రూ.7.11 కోట్ల డబ్బుతో పారిపోయారు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గోవాలో 30 మందికి పైగా అనుమానితులను విచారించారు. చివరకు సిఎంఎస్ సంస్థకు చెందిన వారే ఈ దోపిడీకి పాల్పడినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. ఆ కంపెనీ వాహనాల కదలికలకు బాధ్యత వహించే ఇన్‌ఛార్జ్, ఆ సంస్థ ఆపరేషన్స్ గురించి బాగా తెలిసిన మాజీ ఉద్యోగి, గ్రౌండ్ సపోర్ట్, ఇంటెలిజెన్స్ సమాచారం ఇచ్చిన గోవిందపుర పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేశారు.

సిఎంఎస్ సంస్థ లాజిస్టిక్స్ హ్యాండ్లర్లు, స్పాటర్లు, డబ్బు తరలింపుదారులతో సహా ఆరు నుంచి ఎనిమిదిమంది ఈ దోపిడీలో భాగస్వాములైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. క్యాష్ వ్యాన్ దోపిడీ కోసం ఈ ముఠా మూడు నెలలుగా ప్లాన్ చేసి రెక్కీ నిర్వహించిందని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. రూ.5.76 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్టైన ముగ్గురు నిందితులు బెంగళూరుకు చెందినవారని తెలిపారు. ఇలాంటివి మళ్లీ జరగకుండా ఉండేందుకు సిఎంఎస్ కంపెనీ అధిపతులను పిలిచి, ఆర్‌బిఐ మార్గదర్శకాల ఉల్లంఘన, భద్రతా లోపాల గురించి చర్చించినట్లు వివరించారు. 60 గంటల్లో కేసు ఛేదించిన బెంగళూరు పోలీస్ బందానికి రూ. 5 లక్షల నగదు బహుమతిని పోలీస్ కమిషనర్ అందజేశారు.

'సాఫ్ట్'గా జీవిద్దాం

- టెన్షన్ వద్దు.. ప్రశాంతత ముద్దు
- మానసిక ఆరోగ్యం జీవన సమతుల్యత ముఖ్యం
- జెన్-జెడ్, మిలీనియల్స్ ఆలోచనా తీరు
- కరోనా అనంతరం మరింత మార్పు

'ఎంత ఎక్కువగా కష్టపడితే.. అంతగా ఎదుగుతావు' అంటూ విజయానికి మార్గంగా చెప్తుంటారు. పగలు-రాత్రి శ్రమించటం, నిద్రలేని రాత్రులు గడపటం, ఓవర్‌టైమ్ కష్టపడటం.. వీటిని అలవాటుగా చేసుకున్న తరాన్ని చూశాం. కొత్త తరం అలా కాదు. ప్రపంచాన్ని మరో కోణంలో చూస్తున్నది. జీవితం పోరాటం కావాల్సిన అవసరం లేదు. విజయమనేది బాధతో కాకుండా.. మానసిక ప్రశాంతత, సమతుల్యతతో కూడా సాధ్యమే అని అంటున్నది. పురోగతి కోసం ప్రశాంతతను తాకట్టు పెట్టని జీవితం.. నిదానంలోనూ అర్థాన్ని గుర్తించటం.. మన అనిపించినవారితో చిన్న ఆనందాల విలువ.. ఇదీ జెన్-జెడ్, మిలీనియల్స్ కోరుకుంటున్నది. దీనినే 'సాఫ్ట్ లైఫ్'గా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

న్యూఢిల్లీ : తరాలు మారుతున్నా కొద్దీ మనిషి ఆలోచనా ధోరణి మారుతున్నది. పాత తరానికి, ప్రస్తుత తరానికి మధ్య స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. 'జీవితం అంటే కష్టపడాలి.. అప్పుడే విజయాన్ని రుచిచూడగలం' అనే మార్గాన్ని పాత తరం అనుసరిస్తుంది. డిజిటల్ యుగాన్ని చూస్తూ పెరిగిన మిలీనియల్స్, జెన్-జెడ్‌లు మాత్రం 'ఎంత పని చేశావు' కంటే 'ఎంత ప్రశాంతంగా ఉన్నావు?' అనే అంశాలకు ఎక్కువ విలువనిస్తున్నారు. ఏదైనా సాధించాలంటే ఆరోగ్యం, మనశ్శాంతి, సంబంధాలు బలి కావాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. ఇదే మార్పు ఇప్పుడు ఈ తరం యువతలో సాఫ్ట్‌లైఫ్ అనే కొత్త జీవనశైలిని తీసుకొచ్చిందని నిపుణులు అంటున్నారు.

ఏమిటి ఈ సాఫ్ట్‌లైఫ్?

సాఫ్ట్‌లైఫ్ అంటే ఒక లగ్జరీ జీవితం కాదు. అలసత్వం, సోమరితనం కూడా కాదు. ఇది మనసుకు శాంతి, జీవిత సమతుల్యతకు ప్రాధాన్యతనిచ్చే ఒక కొత్త జీవన విధానం. అంటే ఉరుకులు, పరుగులతో కాకుండా నిదానంగా ఉదయాన్ని ప్రారంభించటం, తనకు తాను కావాల్సినంత సమయాన్ని ఇచ్చుకోవటం, ప్రియమైన వారితో ఎక్కువ, నాణ్యమైన సమయాన్ని గడపటం, మానసిక, శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ వహించటం. ఒక్కమాటలో చెప్పాలంటే జీవితంలో ఒక పని, ఉద్యోగం వంటి వాటి కోసం కష్టపడకపోవడమో, భయపడి మానేయడమో కాదు.. మన ఆరోగ్యం, మనశ్శాంతిని దెబ్బతీసే పనులకు దూరంగా ఉండటం.

మార్పునకు కారణాలివి..!

కొత్త తరంలో వచ్చిన ఈ మార్పు అకస్మాత్తుగా సంభవించింది కాదని మానసిక వైద్య నిపుణులు చెప్తున్నారు. పనిలో ఒత్తిళ్ళు, విశ్రాంతి లేకుండా చేసే ఉద్యోగాలు, అధిక పని గంటలు, సరైన వేతనాలు లేకపోవటం, మానసికంగా, శారీరకంగా అలసిపోవటం... వంటి వాటిని వారు కారణాలుగా చెప్తున్నారు. మరీముఖ్యంగా ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి.. మనిషి, ఆరోగ్యం, జీవితం, బంధాలు, బంధుత్వాల విలువను తెలిసేలా చేసింది. "జీవితానికి ఏ మాత్రమూ గ్యారంటీ లేదు. అందులో ఉద్యోగం, పని వంటివి జీవితంలో ఒక భాగం మాత్రమే. వీటి కోసం ప్రశాంతతనే కోల్పోతే జీవితానికి ఉన్న అర్థమేంటి?" అని నేటి యువత భావిస్తున్నదని మానసిక నిపుణులు చెప్తున్నారు.

సాఫ్ట్ లైఫ్.. అనుకున్నంత ఈజీ కాదు

సాఫ్ట్‌లైఫ్ అనేది మాటల్లో చెప్పినంత ఈజీ కాదని అంటున్నారు. దీనికి ఆర్థిక స్థిరత్వం, ఆర్థిక భద్రత చాలా ముఖ్యమని చెప్తున్నారు. ఇది మన బ్యాంకు బ్యాలెన్స్, మన నెల జీతం, కుటుంబ పరిస్థితి మీద ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత మిలీనియల్స్, జెన్ – జెడ్ యువతలో పెద్ద తేడా ఇక్కడే కనిపిస్తుంది. ఐటీ సెక్టార్ పుణ్యమా అని లక్షల రూపాయల జీతాలు అందుకుంటున్నవారు.. కుటుంబ పరిస్థితి బాగాలేకపోవటమో, ఆర్థిక నియంత్రణ లేకపోవటమో, అప్పుల్లో కూరుకుపోవటమో.. వంటి కారణాలతో ఈ సాఫ్ట్‌లైఫ్‌ను పొందలేకపోతున్నారు. చాలా మంది చెప్తున్నట్టుగా సాఫ్ట్‌లైఫ్ అనేది మనం కొనే వస్తువు వంటివి కాదు. మన తీరు, అలవాట్లు, నిర్ణయాలు ఇందులో కీలకంగా ఉంటాయి. అర్థవంతమైన సంబంధాలు, చిన్న చిన్న పొదుపులు, మనల్ని మనం కోల్పోకుండా చూసుకోవడం, మైండ్‌ఫుల్ లివింగ్, మినిమలిజం వంటివి భాగమవుతాయి. నిరుద్యోగం, ఖర్చులు పెరుగుతున్న ఈ కాలంలో భవిష్యత్ తరాలు ఈ సమతుల్య జీవనాన్ని ఎలా సాగిస్తాయన్నదే అసలు సమస్య అని నిపుణులు అంటున్నారు. స్మార్ట్ ఫైనాన్షియల్ నిర్ణయాలు, స్పష్టమైన బౌండరీలు, మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టడం ఈ మార్పునకు పునాదిగా వారు వివరిస్తున్నారు.

చివరి వరకూ తేజస్ జెట్ కంట్రోల్‌లోకి తెచ్చుకునేందుకుపైలట్ యత్నం..

న్యూఢిల్లీ : కూలిపోతున్న తేజస్ ఫైటర్ జెట్‌ను పైకి లేపేందుకు పైలట్ చివరివరకూ విఫలయత్నం చేశారు. అందుకు సంబంధించిన వీడియో ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. పడిపోతున్న జెట్‌ను పైకి లేపేందుకు పైలట్, వింగ్ కమాండర్ నమాన్ష్ స్యాల్ చివరి క్షణం వరకు ప్రయత్నంచిన దృశ్యాలు ఆ వీడియోలో క్రిస్టల్ క్లియర్‌గా కనిపిస్తున్నాయి. దుబాయ్ ఎయిర్‌షోలో శుక్రవారం భారత వాయుసేనకు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కూలిపోయింది. ఈ ఘటనలో ఐఎఎఫ్ పైలట్, వింగ్ కమాండర్ నమాన్ష్ స్యాల్ మరణించారు. స్యాల్ స్వరాష్ట్రం హిమాచల్ ప్రదేశ్. చివరి సెకన్లలో జెట్ మంటల్లో చిక్కుకోగా పారాచూట్ లాంటిది బయటికి వచ్చినట్లు కనిపించింది. దాన్నిబట్టి చివరి క్షణంలో పైలట్ బయటికి వచ్చేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అప్పటికే సమయం మించిపోయింది. వీడియోను బట్టిచూస్తే పైలట్ ముందే తన ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తే బయటపడేవాడేనని అర్థమవుతోంది. చివరి క్షణంవరకు పైలట్.. జెట్‌ను కాపాడే ప్రయత్నం చేసినట్లు, వీలు పడకపోవడంతో పారాచూట్ సాయంతో బయటికి రాబోయినట్లు, అప్పటికే ఆలస్యం కావడంతో బయటపడలేకపోయినట్లు ఆ వీడియోను చూస్తే అనిపిస్తోంది.

ఇకపై నమో భారత్ రైళ్లలో ప్రైవేట్ వేడుకలు..

- ఎన్‌సిఆర్‌టిసి కీలక నిర్ణయం

న్యూఢిల్లీ : ఇక నుంచి నమో భారత్ రైళ్లు ప్రైవేట్ వేడుకలకు వేదికలుగా మారనున్నాయి. పుట్టినరోజులు, పెళ్లిరోజులు. పెళ్లిళ్లకు ముందు చేసే ఫొటోషూట్‌లు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాలకు రైలు బోగీలను అద్దెకు ఇచ్చేలా 'నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సిఆర్‌టిసి) కీలక నిర్ణయం తీసుకుంది. వ్యక్తులు, ఈవెంట్ ఆర్గనైజర్‌లు, ఫొటోగ్రఫీ సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. స్టేషన్లలో నిలిపి ఉంచిన బోగీలనుగానీ, లేదంటే కదులుతున్న నమో భారత్ రైలు బోగీలనుగానీ వినియోగదారులు అద్దెకు తీసుకోవచ్చు. వేడుకల కోసం దుహాయ్ డిపో వద్ద ఒక నమూనా బోగీని అలంకరించి ఎప్పుడూ అందుబాటులో ఉంచుతారు. బోగీలకు బుకింగ్ చార్జీలను గంటకు రూ.5,000గా నిర్ణయించారు. వేడుకకు అవసరమైన డెకరేషన్ సామాగ్రి సెట్ చేసుకునేందుకు మరో 30 నిమిషాల సమయం అదనంగా ఇస్తారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల మధ్య మాత్రమే వేడుకలకు అనుమతి ఉంటుంది. వేడుకలు జరుపుకునే వారు సాధారణ రైలు కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలిగించకుండా, ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఈ వేడుకలు ఎన్‌సిఆర్‌టిసి ఉద్యోగులు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలోనే జరుగుతాయి. ఢిల్లీ-మేరఠ్ కారిడార్‌లోని ఆనంద్ విహార్, ఘజియాబాద్, మేరఠ్ సౌత్ స్టేషన్లలో ఈ సౌకర్యం చాలామందిని ఆకర్షిస్తుందని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సినిమా షూట్‌లు, డాక్యుమెంటరీలు, ప్రకటనలు ఇంకా ఇతర విజువల్ ప్రాజెక్ట్‌ల కోసం నమో భారత్ రైళ్లు, స్టేషన్లను అద్దెకు తీసుకునేందుకు మరో విధానాన్ని కూడా ఎన్‌సిఆర్‌టిసి రూపొందించింది.

పౌర అణురంగంసహా 10 బిల్లులు

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో

- జాబితా సిద్ధం చేసిన కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు 10 బిల్లులను కేంద్రప్రభుత్వం సిద్ధం చేసింది. డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశాల్లో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్రపతి నేరుగా చట్టాలు, నిబంధనలను రూపొందించడానికి అనుమతించే రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు ప్రైవేట్ సంస్థల కోసం అణు రంగాన్ని తెరవడానికి ప్రతిపాదించే బిల్లును ప్రవేశపెట్టడానికి జాబితా చేశారు.

రాజ్యాంగ (131 సవరణ) బిల్లు 2025 భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 240లో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని చేర్చడానికి ప్రయత్నిస్తుంది, అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ, పుదుచ్చేరి వంటి శాసనసభలు లేని ఇతర కేంద్రపాలిత ప్రాంతాలతో సమానంగా చేసేందుకు ప్రయత్నిస్తోంది. చండీగఢ్ హర్యానా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధాని. ప్రస్తుతం, పంజాబ్ గవర్నర్ చండీగఢ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే కేంద్రపాలిత ప్రాంతం లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో ఉంటుంది.

పరిశీలన కోసం జాబితా చేయబడిన బిల్లులు

'అణుశక్తి బిల్లు, 2025', ఇది భారతదేశంలో అణుశక్తి వినియోగం, నియంత్రణను నియంత్రించడానికి ప్రయత్నిస్తుంది. భారత ఉన్నత విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించేది భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు కూడా ప్రవేశపెట్టనున్నారు. జాతీయ రహదారుల కోసం వేగంగా భూసేకరణ చేసేందుకు ఉద్దేశించిన జాతీయ రహదారుల (సవరణ) బిల్లు. వ్యాపార సౌలభ్యాన్ని సులభతరం చేయడానికి కంపెనీల చట్టం, 2013 ఎల్‌ఎల్‌పి చట్టం, 2008లను సర్దుబాటు చేయడం లక్ష్యంగా కార్పొరేట్ చట్టాలు (సవరణ) బిల్లు, 2025ను ప్రవేశపెడతారు.

సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి), 2025, ఇది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం, 1992, డిపాజిటరీల చట్టం, 1996, సెక్యూరిటీస్ కాంట్రాక్టుల (నియంత్రణ) చట్టం, 1956 నిబంధనలను హేతుబద్ధీకరించిన ఒకే సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్, ఆర్బిట్రేషన్, కన్సిలియేషన్ బిల్లుగా ఏకీకతం చేయడానికి ప్రతిపాదిస్తుంది. బీమా రంగాన్ని మరింతగా ప్రైవేటీకరించేందుకు ఉద్దేశించిన బీమా చట్టాలు (సవరణ) బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నారు. మణిపూర్‌లో వాడుకలోలేని చట్టాలను తొలగించే బిల్లు కూడా ఉంది.

ది నవీన కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, No.G.2755 విజయవాడ

బహిరంగ వేలము ప్రకటన

డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్, విజయవాడ వారు వారి RC No.3634/2006/C నందు జారీ చేసిన సర్‌ఛార్జ్ ప్రొసీడింగ్స్ ది: 08-02-2011 యొక్క అమలు కొరకు దాఖలు చేయబడిన EP No.151/DR/2012-13 నందు ది: 22-11-2025న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారము ప్రకటించబడిన బహిరంగ వేలము యొక్క వాయిదా ప్రకటన

తీర్పు బకాయిదారుడు: సామంతపూడి రాఘవ రాజు, S/o వెంకట సుబ్బరాజు, చెల్లించవలసిన బకాయిని చెల్లించనందున, జప్తు చేయబడిన స్థిరాస్తిని, సహకార సంఘముల డిప్యూటీ రిజిస్ట్రారు, విజయవాడ వారి ఇ.పి. నెం.151/DR/2012-13, ఉత్తర్వుల తేది: 25-09-2025 దాఖలా. వాయిదా వేయబడిన వేలం తేది: 29-11-2025, ఉ॥ 11-00 గం॥లకు **ది గుణదల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్** నెం.708, మద్దిరావమ్మ గుడి ఎదురు, గుణదల, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా నందు బహిరంగ వేలము వేయబడును.

స్థిరాస్తి వివరములు: డోర్ నం.23-32-45 RS నం.154 (విజయవాడ విలేజ్ పోర్షన్), పాపరాజు వీధి, సత్యనారాయణపురం, విజయవాడ సబ్-రిజిస్ట్రార్, ఎన్టీఆర్ జిల్లా. Asst. No. 10730-53071 గల R.C.C. బిల్డింగ్. దస్తావేజుల ప్రకారము బిల్డింగు నిర్మిత స్థల విస్తీర్ణము 300 చ.గ.లు మరియు దారి స్థల విస్తీర్ణము 60 చ.గ.ల వెరశి 360 చ.గ.లు. **అప్‌సెట్ ధర: రూ.90,00,000/-**

సర్‌ఛార్జ్ ఉత్తర్వుల మేరకు సంఘమునకు చెల్లించవలసిన బాకీ: **రూ.1,98,98,227.52** (31-08-2025 నాటికి) + తదుపరి వడ్డీ మరియు ఖర్చులు.

షరా: ఇతర వివరముల కొరకు సేల్ ఆఫీసర్ గారిని సంప్రదించగలరు. వేలముపాట జరుపుటకు లేదా వాయిదా వేయుటకు సర్కారు వారికి పూర్తి హక్కులు గలవు.

ఎస్. లక్ష్మి
అసిస్టెంటు రిజిస్ట్రారు/ సేల్ ఆఫీసర్
సెల్: 9493240446

ఫిబ్రవరి 15న భారత్, పాక్ ఢీ

టి20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ గ్రూప్ స్టేజ్‌లో భారత్, పాకిస్తాన్ తలపడనున్నాయి. ఈ రెండుజట్లు ఒకే గ్రూప్‌లో ఉన్న దృష్ట్యా ముఖాముఖి తలపడనుండగా.. ఆ మ్యాచ్ ఫిబ్రవరి 15, కొలంబో వేదికగా జరగనుంది. భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 8న అమెరికాతో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఆడనుంది. భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చే 2026 టి20 ప్రపంచకప్ టోర్నీ పూర్తి షెడ్యూల్ అధికారికంగా విడుదల కావాల్సి ఉంది. ఫిబ్రవరి 7 నుంచి టి20 ప్రపంచకప్ ప్రారంభం కానుండగా.. ఈ టోర్నీకి సంబంధించి ఇరుదేశాల్లో కలిపి 8 నగరాలన ఐసిసి ఇప్పటికే ఎంపిక చేసింది. ఈ టోర్నీలో ఆడనున్న 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించగా.. ఒక్కో గ్రూప్‌లో నాలుగేసి జట్లు ఉన్నాయి. ఆతిథ్య జట్టైన టీమిండియా, శ్రీలంక గ్రూప్ దశలో కఠిన ప్రత్యర్ధులతో తలపడనున్నాయి. శనివారం 20 జట్లను గ్రూప్‌లుగా విభించింది. ఒక్కో గ్రూప్‌లో ఐదేసి జట్లు చొప్పున నాలుగు గ్రూప్‌లను చేసింది. ఆతిథ్య టీమిండియా గ్రూప్-1లో ఉండగా.. అదే గ్రూప్‌లో పాకిస్తాన్, నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా జట్లు ఉన్నాయి. శ్రీలంక ఉన్న గ్రూప్-2లోఒ పటిష్ట ఆస్ట్రేలియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్ జట్లు ఉన్నాయి. ఇక గ్రూప్-3లో ఇంగ్లండ్, వెస్టిండీస్.. గ్రూప్-4లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఉన్నాయి. ఫిబ్రవరి 22, 26 మార్చి 1న అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా వేదికలుగా సూపర్-8 మ్యాచ్‌లు జరగనున్నాయి. భారతజట్టు సెమీస్‌కు చేరితే ఆ మ్యాచ్ ముంబయిలోని వాంఖడే స్టేడియంలో జరగనుంది. మార్చి 4న సెమీస్, మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్రమోడీ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. సూపర్-8, సెమీస్, ఫైనల్ మ్యాచుల్లో భారత్, పాకిస్తాన్ ముఖాముఖి తలపడాల్సి వస్తే ఆ మ్యాచ్ కొలంబోలో జరుగుతుందని ఐసిసి తాజా ప్రకటనలో పేర్కొంది.

గ్రూప్‌లు...

- **గ్రూప్-1** : భారత్, పాకిస్థాన్, నెదర్లాండ్స్ నమీబియా, అమెరికా.
- **గ్రూప్-2** : శ్రీలంక, ఆస్ట్రేలియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఒమన్.
- **గ్రూప్-3** : ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ.
- **గ్రూప్-4** : దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్, యుఎఇ, కెనడా.

భారత్ తలపడే మ్యాచ్‌ల షెడ్యూల్...

- **ఫిబ్రవరి 8** : భారత్ X అమెరికా (అహ్మదాబాద్)
- **ఫిబ్రవరి 12** : భారత్ X నమీబియా (న్యూఢిల్లీ)
- **ఫిబ్రవరి 15** : భారత్ X పాకిస్తాన్ (కొలంబో)
- **ఫిబ్రవరి 18** : భారత్ X నెదర్లాండ్స్ (ముంబయి)

డేవిస్ కప్ ఫైనల్‌కు ఇటలీ

- సెమీస్‌లో బెల్జియంపై గెలుపు

న్యూయార్క్: రెండుసార్లు ఛాంపియన్ ఇటలీ జట్టు మరోసారి డేవిస్‌కప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. డిఫెండింగ్ ఛాంపియన్ శుక్రవారం రాత్రి జరిగిన సింగిల్ మ్యాచ్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కోబొల్లి బెల్జియం ఆటగాడిని ఓడించి ఇటలీ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో కోబొల్లి 6-3, 6-7(7-5), 7-6(15-13)తో జిజోవ్ బెర్గ్‌పై చెమటోడ్చి నెగ్గాడు. ముఖ్యంగా ఫైనల్ సెట్ 17-15పాయింట్ల వరకు సాగడం విశేషం. దీంతో వరుసగా రెండో సింగిల్స్‌లోనూ నెగ్గిన కోబల్లి ఇటలీని 2-0 ఆధిక్యతలో నిలిచాడు. అంతకుముందు జరిగిన మరో సింగిల్స్‌లో ఇటలీ జట్టు ఆటగాడు బెర్రెట్టి 6-3, 6-4తో రాఫెల్ కొలిగ్నాన్‌ను ఓడించి ఇటలీని ఆధిక్యతలో నిలిపాడు. తొలిసారి తటస్థ వేదికల్లో డేవిస్‌కప్ టోర్నమెంట్ జరుగుతోంది. ఇక జర్మనీ, స్పెయిన్ జట్ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో టైటిల్‌కై ఇటలీ జట్టు డేవిస్ కప్ ఫనల్లో తలపడనుంది.

అంధుల మహిళల టి20 ప్రపంచకప్

- ఫైనల్‌కు భారత్
- సెమీస్‌లో ఆసీస్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు

కొలంబో: ఐసిసి అంధుల మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లోకి భారత జట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారతజట్టు 9వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో చనకన్ బువాఖావో (34) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ సెమీస్ పోరులో ఆరుగురు ఆస్ట్రేలియా బ్యాటర్లు రనౌటయ్యారు. భారత బౌలర్లలో సిమ్రన్‌జీత్ కౌర్, జమునా రాణి, అను కుమారి తలా వికెట్ సాధించారు. అనంతరం 110 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేధించింది. భారత బ్యాటర్లలో బసంతి హన్సా 45 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. గంగా కదమ్ (41 నాటౌట్), కె. కరుణ (16 నాటౌట్) రాణించారు. ఆదివారం జరిగే ఫైనల్లో భారతజట్టు నేపాల్ తలపడనుంది. రెండో సెమీఫైనల్లో నేపాల్‌జట్టు పాకిస్తాన్‌ను ఓడించి ఫైనల్‌కు చేరింది.

నేటి నుంచి

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

విజ్జీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న ఖోఖో కోర్టులు

- 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు హాజరు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

అండర్ 17 రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీలు ఆదివారం నుంచి మూడు రోజులు పాటు నగరంలోని విజ్జి స్టేడియంలో జరుగనున్నాయి. రాష్ట్రస్థాయి బాలికల పోటీలు విజయనగరంలో జరగడం ఇదే తొలిసారి కావడంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ విభాగం ద్వారా ఏర్పాట్లు ఘనంగా చేశారు. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు, 26 మంది కోచ్‌లు, మేనేజర్లు, 25 మంది రిఫరీలు, 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల నిర్వహణ బాధ్యతను చూడనున్నారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో విజ్జి మైదానంలో ఖోఖో మైదానాలు ఇప్పటికే ఏర్పాటు చేశారు. లీగ్, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. రాష్ట్ర పోటీల్లో బాగా ఆడిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి జాతీయ పోటీలకు పంపించనున్నారు. ఫ్లడ్ లైట్లు వెలుగుల్లో ఈ పోటీలు జరగనున్నాయి. మరో వైపు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు మూడు రోజుల పాటు ఉండేందుకు కష్పా హై స్కూల్‌లో వసతి ఏర్పాట్లు చేశారు. క్రీడామైదానానికి క్రీడాకారులను తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు పోటీలు జిల్లా వాసులను అలరించ నున్నాయి.

పోటీలను ప్రారంభించనున్న మంత్రి కొండపల్లి

అండర్ 17 బాలికల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను ఆదివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, డిఇఒ హాజరు కానున్నారు. స్కూల్ గేమ్స్ రాష్ట్ర కార్యదర్శి కూడా ఈ పోటీలకు హాజరవుతారు.

రాష్ట్ర పోటీలకు సర్వం సిద్ధం

గోపాల్, విజయలక్ష్మి,స్కూల్ గేమ్స్ కార్యదర్శులు

ఖోఖో పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్కూల్‌గేమ్స్ గోపాల్, విజయలక్ష్మి తెలిపారు. వసతి, బోజన సదుపాయంతో పాటు, ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలు విజయవంతంగా జరిగేలా జిల్లా వాసులు ,క్రీడాకారులు,వ్యాయామ ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

బెంగాల్ జట్టులో షమీ,

ఆకాశ్‌దీప్‌లకు చోటు

- సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి బెంగాల్ జట్టును ప్రకటించింది. ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ షమీ, ఆకాశ్ దీప్‌లకు చోటు దక్కింది. రంజీ తొలి దశలో నాలుగు మ్యాచుల్లో షమీ 20 వికెట్లు పడగొట్టాడు. పాదం గాయం నుంచి కోలుకున్న తర్వాత.. షమీ ఈ సీజన్‌లో బెంగాల్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు ఆడాడు. ఉత్తరాఖండ్, గుజరాత్‌లపై బెంగాల్ వరుసగా గెలిచిన తొలి రెండు మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌తో పాటు షమీ కూడా బెంగాల్ జట్టుకు ఎంపికయ్యాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బెంగాల్ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. దేశీయ క్రికెట్‌లో రాణించి జాతీయ జట్టులోకి రావాలని చూస్తున్న షమీకి మరో చక్కని అవకాశం లభించింది. బెంగాల్ జట్టులో రైజింగ్ ఆసియా కప్‌లో ఇండియా-ఏ తరపున ఆడిన వికెట్ కీపర్, బ్యాటర్ అభిషేక్ పోరెల్ సైతం చోటు దక్కించుకున్నాడు. అదనపు వికెట్ కీపర్‌గా షకీర్ హబీబ్ గాంధీ సైతం ఉన్నాడు. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్ నవంబర్ 26 నుంచి ప్రారంభం కానుంది. గ్రూప్-సిలో బెంగాల్‌తోపాటు బరోడా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, సర్వీసెస్, పంజాబ్, పుదుచ్చేరి, సర్వీసెస్ జట్లు ఉన్నాయి.

జట్టు : అభిమన్యు ఈశ్వరన్(కెప్టెన్), సుదీప్ ఘరామి, అభిషేక్ పోరెల్, షకీర్ హబీబ్ గాంధీ (వికెట్ కీపర్లు), యువరాజ్ కేస్వానీ, ప్రియాంషు శ్రీవాస్తవ, షాబాజ్ అహ్మద్, ప్రదీప్త ప్రమాణిక్, రితిక్ ఛటర్జీ, కరణ్ లాల్, సక్షమ్ చౌదరి, మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్, సయాన్ ఘోష్, కనిష్క్ సేథ్, యుధాజిత్ గుహ, శ్రేయాన్ చక్రవర్తి.

యూనికొ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: ది ఓవల్, 8వ అంతస్తు, నం.10 & 12, వెంకట నారాయణ రోడ్, టి.నగర్, చెన్నై-600 017.

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమాలను చూడండి)
స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 30 రోజుల ఇ-వేలం అమ్మకపు ప్రకటన. ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు & హామీదారులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/ చార్జ్‌డ్ పెట్టబడినది. సెక్యూర్డ్ క్రెడిటర్ **యూనికొ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్** (సిఐఎన్: యు64990 టిఎన్2023పిటిసి158736) యొక్క అధీకృత అధికారిచేత ఏదైతే స్వాధీనంచేసుకోబడి, దానిని **రుణ ఖాతా నం. 995117184901 పై శ్రీ వేములపల్లి శ్రీనివాస రావు మరియు శ్రీమతి వేములపల్లి సునీత** నుండి సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బకాయిగా రుణ ఒప్పందం యొక్క నియమాలలో వర్తించబడు తదుపరి వడ్డీతోపాటు వాస్తవ చెల్లించు తేదీ వరకు వడ్డీ మరియు **20.11.2025** నాటికి బకాయి **రూ.23,84,009/- (రూపాయలు ఇరువై మూడు లక్షల ఎనభై నాలుగు వేల తొమ్మిది మాత్రమే)**ల కొరకు తేది: **29.12.2025** న **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" "ఏవేని రీకోర్స్ లేకుండా"** విక్రయించబడును.

వేలం కొరకు రిజర్వు ధర **రూ.21,50,000/- (రూపాయలు ఇరువై ఒక లక్షల యాభై వేలు మాత్రమే)** మరియు ధరావత్తు డిపాజిట్ **రూ.2,15,000/- (రూపాయలు రెండు లక్షల పదిహేను వేలు మాత్రమే)** అనగా., రిజర్వు ధరలో 10%, ఏదైతే టెండరు ఆన్‌లైన్ దాఖలుచేయుటకు ముందు **"యూనికొ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్"** పేరున తీసిన డిమాండ్ డ్రాఫ్టు ద్వారా డిపాజిట్‌చేయవలెను. గెలుపొందిన బిడ్డరుదారు వెంటనే అనగా., అదే రోజున లేదా ఆలస్యం కాకుండా మరుసటి పని దినమున అమ్మకపు ధర (ఇ-వేలంలో పాల్గొనుటకు టెండరు పత్రంతో చెల్లించిన 10% ధరావత్తు మొత్తాలు తీసివేసి) యొక్క 25% డిపాజిట్‌చేయవలెను. అమ్మకపు ధరలో మిగతా 75%ను స్థిరాస్తి అమ్మకం ఆమోదం తేది నుండి 15 రోజుల్లోగా డిపాజిట్ చేయవలసిందిగా కోరబడుచున్నది.

షెడ్యూలు-ఎ: ఆస్తి వివరణ: నందివాడ గ్రామం, నందివాడ మండలం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. యొక్క కొత్త ఆర్.ఎస్.నం.471/3, పాత ఆర్.ఎస్.నం.470/1ఎ వద్దగల డోర్ నం.3-188, అసెస్మెంట్ నం.557 లో నిర్మించిన నిర్మాణాలతోపాటు **148చ.గ.లు** విస్తీర్ణంతో ల్యాండ్ & భవనము యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: మాచర్ల వెంకటరత్నంకు చెందిన ఆస్తి, దక్షిణం: బేవార శ్రీనివాస రావుకు చెందిన ఆస్తి, పడమర: పుట్టి పాల్ సుధాకర్‌కు చెందిన ఆస్తి, ఉత్తరం: పంచాయతి బాజారు.

పాల్గొనుటలో బిడ్/ధరావత్తు/అభ్యర్ధన లేఖ దాఖలుచేయుటకు చివరి తేది 28.12.2025న సా॥5గం.ల వరకు.
బిడ్ పెంపుదల మొత్తాలు రూ.10,000/-ల గుణాంకాలులో అనుమతించబడును.
ఆస్తి పరిశీల తేది: 13.12.2025 & 20.12.2025.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, దయచేసి సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్ అనగా., https://www.unicohfc.com & https://www.auctionfocus.in పై ఇవ్వబడిన లింకును పరిశీలించండి.
ఆసక్తిగల బిడ్డరుదారులు సంప్రదించండి: **శ్రీ రామారావు, అతని మొబైల్ నం. +91 99639 99198 & శ్రీ జి. పవన్ సాయి రాజేష్ అతని మొబైల్ నం. 70937 48103.**
ఇ-వేలంకు సంబంధించిన ఏవేని సహాయం కొరకు, సంప్రదించండి: హెల్ప్‌లైన్ నం.: 9016641848; ఇమెయిల్ ఐడి: support@auctionfocus.in

తేది: 22.11.2025,
ప్రదేశం: విజయవాడ.

అధీకృత అధికారి,
యూనికొ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్: U65923K12010PIC039179, యూనిట్ నం.301- 315, 3వ అంతస్తు, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై-400093.

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్"గా పిలువబడుతుంది) యొక్క అధీకృత అధికారి IV/470A(పాతది)W/638A(కొత్తది) మణప్పురం హౌస్ వలపడ్ త్రిస్సూర్, కేరళ 680567 మా నమోదిత కార్యాలయం ఉంది మరియు వివిధ ప్రదేశాలలో దీని శాఖా కార్యాలయాలు ఉన్నాయి, కంపెనీల యాక్ట్ 1956 క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (ఇకపై యాక్ట్ గా సూచించబడుతుంది) యొక్క సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎమ్) యొక్క సబ్ క్లాజ్ (4) అర్ధం ఆర్థిక సంస్థ నం.ఎస్.ఓ.3466 (ఇ)తో చదువుతూ నిర్మాణం మరియు / లేదా నివాస యూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్‌ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది మరియు దిగువ కాలమ్ నం. 2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ రుణగ్రహీతలు ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ నుండి రుణం పొందినట్లు పేర్కొన్న చార్ట్ తేది 18 డిసెంబర్, 2015న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ద్వారా జారీ చేయబడింది మరియు ఏదైతే సెక్యూర్డ్ క్రెడిటార్ గా ఉన్న ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సర్ఫేసీ యాక్ట్ క్రింద, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 2తో చదువుతూ సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తంతో పాటు దానిపై తదుపరి వడ్డీతో చెల్లించమని రుణగ్రహీత/సహ రుణగ్రహీతలను పిలుస్తూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. అయితే వివిధ కారణాల వల్ల కొందరికి నోటీసులు అందజేయలేదు. దానితో పాటు క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కొరకు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా పేర్కొన్న రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర. సం	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతల పేరు / ఎల్ఎఎన్/శాఖ	సృష్టింబడిన వడ్డీ విషయంలో సెక్యుర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	నోటీసు పంపిన తేది మరియు బకాయి మొత్తం
1	పిట్టు నాగలక్ష్మి, పిట్టు శ్రీనివాసరెడ్డి, పిట్టు వెంకటకృష్ణారెడ్డి/ MHL00310019065/ విజయవాడ	బాపట్ల జిల్లా, బాపట్ల రిజిస్ట్రేషన్ జిల్లా, కర్లపాలెం గ్రామం పంచాయతీ ప్రాంతము, మంతెన వెంకటరాజుపాలెం, కర్లపాలెం గ్రామం, డోర్.నం.428, డోర్ నం 5-444, మూల్యాంకనం నం 679, విస్తీర్ణత 145.2 చ.గజాల రెసిడెన్షియల్ సైట్ ఎసిసి షీట్ల షెడ్డు కలిగి వుంది. పిన్ 522111, ఆంధ్రప్రదేశ్. తూర్పు-పిట్టు వెంకట కృష్ణా రెడ్డి యొక్క మిగితా సైట్, పడమర-పంచాయతీ బజార్, దక్షిణం-పంచాయతీ బజార్, ఉత్తరం-పిట్టు వెంకట కృష్ణా రెడ్డి యొక్క మిగితా సైట్	21-10-2025	24-10-2025 & Rs.468241/-
2	ఓగిరాల లక్ష్మి, ఓగిరాల సత్యనారాయణ, భీమవరపు నివేధిత, ఓగిరాల దుర్గారావు/ NHL00310014732/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, విసన్నపేట సబ్-రిజిస్ట్రీ, రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ప్రాంతము, రెడ్డిగూడెం గ్రామం, ఆర్ఎస్.నం 450-2, డోర్ నం 15-21, మూల్యాంకనం నం 1224, విస్తీర్ణత 101.17 చ.గజాలు, ఆంధ్రప్రదేశ్-521215. తూర్పు-కందుల కృష్ణ ఆస్తి, పడమర-రోడ్డు, దక్షిణం-రోడ్డు, ఉత్తరం-చంద్రగిరి పద్మ ఇల్లు మరియు సైట్	21-10-2025	24-10-2025 & Rs.963838/-

గమనిక, ఈ నోటీసును ప్రచురించిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు వ్యతిరేకంగా ఇక్కడ చూపిన మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని పిలుస్తూ పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు ఆస్తులపై సెక్యూరిటీ ఇంట్రస్ట్ అమలు చేయడం కోసం ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సెక్షన్13(4) ని తీసుకోవలసి ఉంటుంది. సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13(8)లో వివరించిన విధంగా విక్రయం, పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ చేయడానికి నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి.
సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ ఎస్-13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ అసెట్స్‌ను ఏ పద్ధతిలోనైనా అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో బదిలీ చేయకుండా మరియు/లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోగలరు.

తేది: 23/11/2025, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి , మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

'సింగరేణి ఓపెన్ కాస్ట్'తో ప్రకృతి విధ్వంసం

- అండర్ గ్రౌండ్ నుంచి క్రమంగా తప్పుకుంటున్న సంస్థ
- లాభాల కోసం.. ఓపెన్ మైనింగ్‌కే మొగ్గు
- చుట్టు పక్కల ప్రాంతాలను కబళిస్తున్న వాయు, శబ్ద కాలుష్యం
- మెజార్టీ గని కార్మికులకు దీర్ఘకాలిక వ్యాధులు
- తవ్వకం పూర్తయిన ప్రాంతమంతా ...మరుభూమే

ఫైల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి భూ ఉపరితల గనుల తవ్వకం (ఓపెన్ కాస్ట్ మైనింగ్) ప్రకృతి విధ్వంసానికి పరాకాష్టగా మారుతోంది. లాభాల కోసం క్రమంగా భూగర్భ గనులను అటకెక్కించి... ఓపెన్ కాస్ట్ వైపు సంస్థ పరుగులు పెడుతోంది. ఫలితంగా వాయు, శబ్ద కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వేలాది ఎకరాల భూమి వ్యవసాయానికి పనికి రాకుండా పోతోంది.

గనులు విస్తరించిన ప్రాంతాల్లోని గ్రామాల ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పెద్ద ఎత్తున సాంకేతిక యంత్రాలు వినియోగించడంతో మ్యాన్ పవర్ క్రమంగా తగ్గుతోంది. ఒకప్పుడు లక్షకు పైగా కార్మికులకు ఉపాధి కల్పించి రాష్ట్రంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందిన సింగరేణిలో నేడు 40 వేలకు కార్మికులు తగ్గి పోయారు. అలాగే ఉపరితల గనుల తవ్వకం పూర్తయిన ప్రాంతమంతా భవిష్యత్‌లో మరుభూమిగా మారే ప్రమాదముందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

బొగ్గు గనుల తవ్వకం, ఉత్పత్తి, సరఫరాలో కోల్ ఇండియా తర్వాత దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణికి గుర్తింపు ఉంది. ఒకప్పుడు కార్మికుల సంక్షేమానికి ప్రతీకగా పేరొందిన సింగరేణి క్రమంగా ప్రయివేట్ కార్పొరేట్ హంగులను అద్దుకుంటూ ప్రజా హితాన్ని మరుస్తున్నదనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. లాభాల కోసం పోటీ పడే క్రమంలో సంస్థ అడుగులు దారి తప్పుతున్నాయి. అండర్ గ్రౌండ్ బావులు మూతపడుతున్న క్రమంలో వాటి స్థానంలో ఓపెన్ కాస్ట్ భావులకు ప్రాధాన్యత ఇస్తోంది. 2004లో సింగరేణిలో 50కిపైగా భూ గర్భ బావులుండగా నేడు అవి 22కు తగ్గి పోయాయి. భావి ఏరియా, సామర్థ్యాన్ని బట్టి దాని జీవిత కాలం ఉంటుంది. సింగరేణి సంస్థ చరిత్రలో బెల్లంపల్లి ప్రాంతంలో ఉన్న శాంతిఖని భూగర్భ బొగ్గుబావి 70 సంవత్సరాలకు పైగా పనిచేస్తోంది. కంపెనీ చరిత్రలో అత్యంత సుదీర్ఘ కాలంగా సేవలందిస్తోంది. ఉత్పత్తిని కొనసాగించడానికి, నిల్వలను సంరక్షించడానికి లాంగ్‌వాల్, బోల్టర్ మైనర్ టెక్నాలజీని వాడుతున్నారు. అయితే ఈ విధానం ఓపెన్ కాస్ట్‌తో పోలిస్తే ఖరిదైనదిగా పరిగణించబడుతున్నది. దాంతో లాంగ్ వాల్ అయిన బావులను మూతేసి వాటి స్థానంలో ఉపరితల గనుల వైపు సంస్థ మొగ్గు చూపుతోంది. ఈ విధానం ప్రజలతో పాటు పర్యావరణానికీ ప్రమాదమని తెలిసినా లాభాలు, మార్కెట్ పోటీని తట్టుకునేందుకు సింగరేణి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వైపు మళ్లుతోంది. సంస్థ తీరును సింగరేణిలోని ట్రేడ్ యూనియన్లు, కార్మికులు వ్యతిరేకిస్తున్నారు.

ఆరోగ్య సమస్యలు...

ఓపెన్ కాస్ట్ విధానంలో బొగ్గు తవ్వకాలు పర్యావరణానికి ప్రమాదంగా మారాయి. బొగ్గు బ్లాస్టింగ్ చేసినప్పుడు భూమి నుంచి భారీ లోహాలు, ఇతర విషపదార్థాలు విడుదలవుతున్నాయి. దాంతో గాలితో పాటు నీరు కూడా విషతుల్యంగా మారుతోంది.

ఇది సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ సమీప గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ ప్రాంతాల్లో నివసించే మనుషుల జీవిత కాలం కనీసం ఐదు నుంచి పదేళ్లు తగ్గుతోందని వైద్యులు చెబుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు, చర్మ, ఎముకల జబ్బులు, గుండె సంబంధిత రోగాలతో ఎక్కువగా బాధపడుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పర్యావరణ, జీవశాస్త్ర విభాగాలకు చెందిన పరిశోధక బృందం 2023లో సింగరేణి కోల్ మైన్ కార్మికుల ఆరోగ్య స్థితిపై సర్వే చేసింది. "ఎపిడమలాజికల్ స్టడీస్ ఆన్ హెల్త్ స్టేటస్ ఆఫ్ కోల్ మైన్స్ వర్కర్స్" పేరుతో మంచిర్యాల జిల్లాలో కేస్ స్టడి చేసింది. వీరు చేసిన సర్వే ప్రకారం బొగ్గు గనిలో పని చేస్తున్న కార్మికుల్లో 141 మందిలో... (54.6శాతం)77 మందికి వైరల్ డిసీసెస్ ఉండగా, (45.4 శాతం) 64 మందికి డిసిసెస్ లేదు. నాన్ కోల్ మైన్ వర్కర్లలో.... కేవలం (7.8 శాతం) 11 మంది మాత్రమే వైరల్ సమస్యలతో బాదపడుతున్నారు. (92.2శాతం) 130 మందికి ఎలాంటి వైరల్ డిసీసెస్ లేవు. ఈ పరిశోధన సింగరేణి బొగ్గు గని కార్మికుల ఆరోగ్య పరిస్థితికి అద్దం పడుతోంది.

అండర్ గ్రౌండ్ గనులతో పోల్చితే ఓపెన్ కాస్ట్ గనులతో జరిగే నష్టాలు

అండర్ గ్రౌండ్	ఓపెన్ కాస్ట్
1) భూమి వినియోగం తక్కువ. భూ గర్భంలో గని విస్తరించిన ప్రాంతం వ్యవసాయానికి, ఇతర ప్రజావసరాలకు ఉపయోగ పడుతుంది.	1) గని విస్తరించిన ప్రాంతం అంతా దేనికి పనికి రాదు వ్యవసాయం, రహదారులు ఇతర అవసరాలకు యోగ్యం కాదు.
2) వర్షాకాలంతో సహా... సంవత్సరంలో 365 రోజులు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం ఉండదు	2) భారీ వర్షాలు కురిస్తే గనిలో నీరు నిండి ఉత్పత్తి ఆగి పోతుంది. బొగ్గు ఉత్పత్తి లక్ష్యంపై ప్రభావం పడుతుంది. డీ వాటరింగ్ చేసిన తర్వాతే మైనింగ్ ప్రారంభమవుతుంది.
3) బ్లాస్టింగ్ భూ గర్భంలో జరగడం వల్ల పర్యావరణానికి ప్రమాదంఉండదు. చెట్ల పెంపకానికి ఎలాంటి ఆటంకం కలగదు	3) సహజ పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటాయి. అడవులు తగ్గడంతో గనులు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో తక్కువ వర్ష పాతం నమోదవుతున్నది.

ఉపాధికి ప్రమాదం

సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్‌తో ఉపాది క్రమంగా తగ్గుతోంది. యంత్రాల వినియోగం కార్మికుల పొట్ట కొడుతోంది. ఒకప్పుడు లక్షమందికి పైగా కార్మికులున్న చోట నేడు 40 వేలకు పడిపోయారు. దానికి తోడు పర్యావరణ విధ్వంసం, భూగర్భ జలాలు అడుగంటి పోవడం లాంటి అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. భవిష్యత్‌లో ఓపెన్ కాస్ట్ ప్రాంతం నివాసానికి కూడా పనికి రాదు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సంస్థ భూగర్భ గనులకు ప్రాధానత్య ఇవ్వాలి.

రాజిరెడ్డి, అధ్యక్షులు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)

ప్రజాజీవితం అస్తవ్యస్తం

సింగరేణి ఓపెన్ కాస్ట్ మైన్‌లతో ప్రజా జీవితం అస్తవ్యస్తంగా మారుతుంది. గనులు విస్తరించిన ప్రాంతం నివాస యోగ్యం కాకపోవడంతో పాటు వ్యవసాయానికి పనికి రాదు. బ్లాస్టింగ్ వల్ల వెలువడే దుమ్ము, దూళిలో ప్రమాదకరమైన రసాయనాలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చుట్టు పక్కల గ్రామాల్లో వ్యవసాయ దిగుబడులు కూడా తగ్గుతాయి. ఏ రకంగా చూసినా ఉపరితల గనులు పర్యావరణంతో పాటు ప్రజల మనుగడ ప్రమాదంగా మారుతున్నాయి.

దొంతి నర్సింహారెడ్డి, పర్యావరణ వేత్త

ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

కార్గో ఎయిర్ పోర్టు పేరుతో ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించేది లేదని కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ప్రభుత్వానికి హెచ్చరించింది. మండలంలోని వంకులూరు గ్రామస్తులు సంఘ భవనం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి కార్గో ఎయిర్పోర్టుకు వ్యతిరేకంగా శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దానం పల్లెల్లో విధ్వంసకర కార్గో ఎయిర్ పోర్టు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న కార్గో ఎయిర్ పోర్టు బాధిత రైతులు పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మహాధర్నా చేసి అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేసేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఇంతలో పోలీసులు రైతులను నిర్బంధించి ఆర్‌డిఒను కలిసే అవకాశం ఇవ్వలేదని తెలిపారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 21 నుంచి 26వరకు నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం అన్ని ప్రభావిత గ్రామాల్లో చేపడుతున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా మన జాతిపిత గాంధీజీ భావజాలంతో ప్రజలు శాంతియు తంగా పోరాటం చేస్తుంటే... మా మనోభావాలు దెబ్బతి తీసుకున్నారని అన్నారు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు, లండ రామస్వామి, జోగి శ్రీదేవి, లండ హైమావతి, గుంటు సంతమ్మ, సండూపల్లి పార్వతి, గుల్ల ఈశ్వరరావు, గుంటు రామస్వామి, గుంటు నాగేశ్వరరావు, సుంకర రాజు, బర్రి జోగారావు, యంపల్ల కామేష్, కోనేరు రమేష్, మహిళలు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భయం... భయం...

- నేడు మావోయిస్టు పార్టీ నిరసన దినం

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి జిల్లా)

మారేడుమిల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులకు పోలీసులుకు ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మాతో పాటు ఆయన భార్య రాజేతో సహా 15 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌కు గురి కావడంతో మావోయిస్టుల కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. నిరసన దినం పాటించేందుకు మావోయిస్టు పార్టీ తలపెట్టడంతో ఎఒబి సరిహద్దుల్లో యుద్ధవాతావరణం నెలకొంది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కంచుకోటగా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర పోలీసు బలగాలను మొహరించి విస్తతంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టి అడవిని జల్లెడ పడుతున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అణువణువునా గాలింపు చర్యలు చేపడుతూ భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా నష్టపోయిన మావోయిస్టులు చెలరేగి ప్రభుత్వ ఆస్తులతో పాటు పోలీసులకు భారీ నష్టం కలిగించే ముప్పు ఉందని ఇంటెలిజెన్సీ వర్గాలు ఇప్పటికే పోలీసులకు హెచ్చరికలు జారి చేసి అప్రమత్తంచేశాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు సిఆర్‌పిఎఫ్ అవుట్ పోస్టుల వద్ద అదనపు బలగాలను మొహరించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. చత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి మావోయిస్టులు సురక్షితమైన ప్రదేశంగా ఎఒబిని ఎంచుకుని తలదాచుకోవచ్చునని పోలీసులు భావించి ఆ దిశగా గాలింపు చర్యలు చేపడుతూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, రంపచోడవరం మన్యంలో కేంద్ర బలగాలు గ్రేహౌండ్స్ స్పెషల్ పార్టీ రంగంలో దింపి అణువణువునా గాలింపు చర్యలు చేపడుతూ మావోయిస్టుల ఆచూకీ కోసం ఆపరేషన్ ముమ్మరం చేశారు.

టెన్షన్ వాతావరణం

మావోయిస్టు పార్టీ నిరసన దినం పాటించేందుకు పిలుపునివ్వడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. చత్తీస్‌గడ్, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో మావోయిస్టులు ఎటువంటి విధ్వంసాలకు పాల్పడతారోఅని కంటిమీద కునుకు లేకుండా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను వారి ఆధీనంలో తీసుకుని పోలీసులు రాత్రీ, పగలు ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

ఎఒబిలో వణుకుతున్న గిరిజనులు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఒక్కసారిగా వందల సంఖ్యలో పోలీసులను మోహరించి తనిఖీలు నిర్వహిస్తుండడంతో గిరిజనులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజులుగా నిశ్శబ్దంగా ఉన్న ఎఒబి పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయడంతో ఎటువంటి ఉపద్రవం వస్తుందోనని గిరిజనులు అయోమయానికి గురవుతూ భయాందోళన చెందుతున్నారు.

సీలేరులో ముమ్మర తనిఖీలు

జికె వీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మావోయిస్టు కదిలికలపై నిఘా పెట్టారు. ఆంధ్ర వలస సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెట్టారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన గాలికొండ, గుమ్మిరేవులు, గుర్తేడు తదితర ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి గాలింపు చర్యలు చేపడుతున్నారు. పోలీస్ ఇన్ ఫార్మర్లతో మావోయిస్టు కదిలికలపై నిఘా పెట్టారు. మావోయిస్టు కేంద్ర కమిటీ భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

నైట్ బస్ సర్వీసులు రద్దు

మావోయిస్టు కేంద్ర కమిటీ భారత్ బంద్ తలపెట్టడంతో విశాఖ వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదగా వెళ్లే విశాఖ భద్రాచలం నైట్ సర్వీస్ బస్‌తో పాటు విశాఖ సీలేరు నైట్‌హాల్ట్ బస్ సర్వీసులు శని ఆదివారాల్లో రద్దు చేసినట్లు విశాఖ డిపో మేనేజర్ మాధురి ప్రకటించారు.

వరండాలో చదువులు

- నిలిచిన పాఠశాల భవనం పనులు

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

మండలంలోని లుంగపర్తి స్కూల్ కాంప్లెక్స్ వాలసి పంచాయతీ పరిధి ఊటగెడ్డ ప్రాథమిక ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ఓ ఇంటి ఇరుకు వరండాల్ లో చదువు కొవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. నిలిచిపోయిన పాఠశాల పనులు తక్షణమే పూర్తి చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. 15 ఏళ్ల క్రితం పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా అప్పటి ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు సన్ సైడ్ రూపు లెవెల్ వరకు పనులు చేపట్టి నిధులు డ్రా చేసి పనులు వదిలివేశారు. దీంతో ఈ పాఠశాలలో చదివుతున్న విద్యార్థులకు ఎండాకాలంలో చెట్లు కింద, వర్షాకాలంలో ఇంటి వరండాలో చదువు కోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుత అధికార కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తుందే తప్పా విద్యారంగానికి ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. నిలిచిన పాఠశాల పనులు పున:ప్రారం భించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోల్‌కతాలో మకాం... జిల్లాలో చోరీలు

- కరుడుగట్టిన నేరస్తుడు కృష్ణ అరెస్టు
- 33 ఏళ్లలో 218 నేరాలు
- భారీగా బంగారం, నగదు స్వాధీనం
: ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 218 కేసులు నిందితుడిగా ఉన్న మెళియాపుట్టి మండలం చాపురానికి చెందిన కోల్‌కతాలోని బాటానగర్‌లో నివాసముంటున్న కరుడుగట్టిన నేరస్తుడు దున్న కృష్ణను అరెస్టు చేసినట్టు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 10న రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో 25 గ్రాముల వెండి పోయిందని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నగరంలోని ఎస్‌బిఐ స్టాఫ్ కాలనీకి చెందిన ఎతిరాజుల భవాని అదే నెల 13న ఫిర్యాదు చేసిందన్నారు. దర్యాప్తులో భాగంగా ఆయనను అరెస్టు చేసి విచారించగా శ్రీకాకుళం రూరల్ పరిధిలో 14, శ్రీకాకుళం రెండో పట్టణ పరిధిలో 3, ఒకటో పట్టణ పరిధిలో ఒక దొంగతనం చేసినట్టు తేలిందన్నారు. 18 దొంగతనాల కేసులో చోరీ చేసింది 362.4 గ్రాముల బంగారం, 1443 గ్రాముల వెండి అభరణాలు, వస్తువులు, నగదు రూ.7.03 లక్షలని తెలిపారు. ఇప్పటి వరకు నిందితుడు కృష్ణ నుంచి 237 గ్రాముల బంగారం, 1391 గ్రాముల వెండి, నగదు రూ.1.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 55 ఏళ్ల కృష్ణ 33 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు 218 ఇళ్లలో నేరాలు చేసినట్టు తెలిపారు. వీటిలో సుమారు 60 కేసుల్లో శిక్ష పడిందన్నారు. కృష్ణ జీవితంలో సగం జైల్ జీవితం అనుభవించినట్టు తెలిపారు. కృష్ణ ఆయన కుటుంబంతో కోల్‌కతాలోని బాటానగర్‌లో నివాసముంటూ జిల్లాకు వచ్చి నేరాలు చేసి వెళ్లిపోతుంటాడని వివరించారు. వ్యక్తిగత గుర్తింపు కార్డు ఉంటే పోలీసులకు పట్టుబడతానని ఆధార్, ఓటరు కార్డు తీసుకోలేదని అన్నారు. సెల్‌ఫోన్ వాడడం కూడా లేదని తెలిపారు. తాళం వేసి ఉన్న ఇళ్లను తాళాలను పగలగొట్టి ప్రవేశించి ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదు దొంగలించడం ప్రవృత్తిగా మార్చుకున్నాడని తెలిపారు. 2024 జనవరి 13న జైల్ నుంచి బయటకు వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు శ్రీకాకుళం నగరం పరిధిలో 18 నేరాలు చేసినట్టు వివరించారు. కృష్ణతో బ్రోతల్ కేసులో అరెస్టు అయిన గూనపాలెంకు చెందిన సయ్యద్ రఫీకి జైల్లో పరిచయం ఏర్పడిందన్నారు. కృష్ణ చోరీ చేసిన సొత్తును రఫీకి ఇచ్చి దాన్ని విక్రయించి ఇద్దరు వాటాలు పంచుకొనేవారిని తెలిపారు. అదేవిధంగా కోల్‌కతా, సోనాపూర్‌కి చెందిన ఇద్దరు వ్యక్తులకు కృష్ణ చేసిన చోరీ సొత్తును వారికి ఇచ్చినట్టు విచారణలో తేలిందన్నారు. వారిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసుల్లో కృష్ణతో పాటు రఫీని అరెస్టు చేసినట్టు తెలిపారు.

ఇద్దరిపై చర్యలు

నగరం పరిధిలో నమోదైన 18 కేసుల్లో ఇద్దరు ఫిర్యాదుదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బంగారం పోకుండానే 46 గ్రాముల బంగారం పోయినట్టు ఒకరు ఫిర్యాదు చేశారని ఎస్‌పి తెలిపారు. మరో కేసులో కేవలం 15 గ్రాముల బంగారం పోతే, 71 గ్రాములు బంగారం పోయినట్టు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తప్పుడు ఫిర్యాదు చేసినందుకు ఇరువురుపై చట్టరీ త్యా చర్యతీసుకుంటామని వివరించారు.

ప్రతిభకు ప్రశంస

నిందితుడిని అదుపులోకి తీసుకోవడం, చోరీ అయిన బంగారం, వెండి అభరణాలు, నగదు రికవరీ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చినవారికి పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్‌పి ప్రశంసించి అభినందించారు. అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద సూచనలతో రూరల్ సర్కిల్ సిఐ కె.పైడిపునాయుడు, సిసిఎస్ సిఐ చంద్రమౌళి, ఎస్‌ఐలు రాజేష్, గణేష్, రూరల్ ఎస్‌ఐ కె.రాము, సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

ఇ-స్టాంపు విక్రయాల్లో చేతివాటం

ప్రజాశక్తి- మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

ప్రభుత్వం ఇ-స్టాంపు విక్రయాలను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించడంతో ఆ నిర్వాహకులు ఆడిందే ఆటగా మారింది. గతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఉండేవి. స్టాంప్‌ల విక్రయాల్లో అవకతవకలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీలకు వీటి విక్రయ బాధ్యతలను అప్పగించింది. దీంతో ఏజెన్సీలు కొంతమంది వ్యక్తులకు ఐడిలు ఇచ్చి మండల కేంద్రాల్లో విక్రయించేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ విక్రయానికి గాను ఐదు శాతం కమీషన్ కూడా ఏజెంట్లకు ఇవ్వనుంది. గతంలో వెండర్లు మండలాల్లో స్టాంపులు విక్రయించి స్టాంపులపై ఉన్న ధర కంటే రూ.10 నుండి 20 వరకు అదనంగా వసూలు చేసేవారు. ప్రస్తుత ప్రయివేటు ఏజెన్సీలో అది కమీషన్ వ్యవహారం పరాకాష్టకు చేరింది. శుక్రవారం మక్కువ మండల కేంద్రంలో మధు కంప్యూటర్స్ సెంటర్లో చెముడు గ్రామానికి చెందిన కె.మహేశ్వరరావు పేరిట ఆయన బంధువు రూ.50 ఇ-స్టాంపు కొనుగోలు చేశారు. ఆ స్టాంపుపై అదనంగా మరో 50 రూపాయలు వసూలు చేసిన విషయం శనివారం వెలుగు చూసింది. మక్కువ గ్రామానికి చెందిన ఓ ఇద్దరు వ్యక్తులు దుకాణ తనకాల విషయంలో తీసుకున్న రూ.100 ఇ-స్టాంప్ పేపర్లకు గాను 500 రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ తపాలా ఉద్యోగి తన బంధువుల పేరుతో నిర్వహిస్తున్న మీ సేవా కేంద్రంలోనే కాకుండా ఇతర కేంద్రాల్లో కూడా ఇదే తరహా దోపిడీ జరుగుతుందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అవసరాలకు ఇ-స్టాంపులు కొనుగోలు చేయాలంటే సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం పట్టణాలకు కొనుగోలుదారులు వెళ్లాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న నిర్వాహకులు విచ్చలవిడిగా దోపిడీకి తెగబడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ఇ-స్టాంపులు అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

INDIA NON JUDICIAL
Government of Andhra Pradesh
e-Stamp
Certificate No. : IN-AP42257029950798X
Certificate Issued Date : 21-Nov-2025 01:39 PM
Account Reference : CSCACC (GV)/ apcsceg07/ AP-MNY/ AP-MNYVEN1229/apvenhem1229u
DDO Code : 27002308001 O/o IG R
Unique Doc. Reference : SUBIN-APAPCSCEG0768255933296685X
Purchased by : KARANAM MAHESWARRAO Son of Late GUMPASWAMY CHEMUDU
Description of Document : Article 6(C) Agreement in any other case
Property Description : AGREEMENT
Consideration Price (Rs.) : 0 (Zero)
First Party : KARANAM MAHESWARRAO Son of Late GUMPASWAMY CHEMUDU
Second Party : Not Applicable
Paid By (For Whom) : KARANAM MAHESWARRAO Son of Late GUMPASWAMY CHEMUDU
Stamp Duty Amount(Rs.) : 50 (Fifty only)
Please write or type below this line
GG 0024622656
Statutory Alert:

అధిక ధరకు విక్రయించిన ఇ-స్టాంపు ఇదే

మా పరిధిలోకి రావు

ఇ-స్టాంపు విక్రయాలు ప్రస్తుతం మా పరిధిలోకి రావు. వీటిని ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించింది. ఏజెన్సీలు కొంతమంది ఏజెంట్లు నియమించుకొని నిర్వహణ చూసుకుంటున్నాయి.

- నాగరాజు, సబ్ రిజిస్ట్రార్, సాలూరు

విచారణ చేపడుతాం

తపాలా శాఖ ఉద్యోగిపై ఇ-స్టాంపు విక్రయాల్లో వస్తున్న ఆరోపణలపై విచారణ చేపడతాం. బిపిఎంలకు వారు విధులు నిర్వహించిన తర్వాత కొన్ని వెసులుబాట్లు ఉన్నాయి. ఇ-స్టాంపుపై ఉన్న ముద్ర ఆ ఉద్యోగిది కాదా? అవునా? అన్న విచారణ చేపడతాం.

- బాబూరావు, పోస్టల్ సూపరింటెండెంట్, పార్వతీపురం

ఉపాధ్యాయులు టెట్ రాయాల్సిందే

- దరఖాస్తులకు నేటితో ముగుస్తున్న గడువు

ప్రజాశక్తి- టెక్కలి (శ్రీకాకుళం జిల్లా)

టిడిపి కూటమి ప్రభుత్వం చేపడుతున్న విద్యాసంస్కరణలో భాగంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయాలన్న సుప్రీం కోర్టు నిబంధనల మేరకు ఉపాధ్యాయులు పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 19న కేంద్ర విద్యాశాఖ మంత్రిని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంబంధిత విద్యాశాఖ అధికారులు కలిశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయిం పు ఇవ్వాలని కోరాల్సి ఉన్నా... ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. దీంతో సుప్రీంకోర్టు తన వాదని డిసెంబరు నెలకు వాయిదా వేసింది. దీంతో ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు తప్పకుండా టెట్ పరీక్ష రాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్‌కు సమయం కూడా ఆదివారంతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు దరఖాస్తులు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. సుప్రీంకోర్టు విలువరించిన తీర్పు మేరకు జిల్లాలో 9300 మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు అర్హత సాధించారు. 2010 సంవత్సరం ముందు బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులు టెట్ పరీక్ష తప్పనిసరిగా రాయాలన్న నిబంధనపై చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యాయ సంఘ నాయకులు ఈ తీరుపై ఆక్షేపణ వెల్లడిస్తున్నారు.. కాగా, విద్యా సంస్కరణల్లో భాగంగా పరీక్ష రాయాలన్న నిబంధనపై ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్న ఆందోళనకు ఇటు ప్రభుత్వం నుంచి గాని, అటు కోర్టు నుంచి గాని ఊరడింపు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌టిపిసి బూడిదపై గుత్తాధిపత్యం..!

- అర్హులకు టెండరు దక్కినా పనులకు అడ్డంకి..
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- న్యాయం కోసం కుందనపల్లి నిర్వాసితుల ఎదురుచూపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మేం నిత్యం తీవ్రమైన కాలుష్యంతో సహజీవనం చేస్తున్నాం.. మమ్మల్ని ఆదుకోవడం లోనూ, మాకు ఉపాధి కల్పించడంలోనూ ప్రభుత్వాలు, సంస్థ యాజమాన్యం విఫలమవుతూ వస్తోంది. మా ఆవేదనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మాకు దక్కాల్సిన అవకాశాలు స్థానికేతరులు పొందుతున్నారు. ఉపాధి కరువై ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఎన్‌టిపిసి కరెంటు ఉత్పత్తిలో భాగంగా వచ్చే బూడిద వ్యర్థాలను తరలించేలా టెండరు వేసి వేలంలో దక్కించుకున్నా.. బడా కాంట్రాక్టర్లు అడ్డుతగులుతున్నారు. భయభ్రాంతుల కు గురిచేస్తున్నారు" అని పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్‌టిపిసి ప్రభావిత ప్రాంతమైన కుందనపల్లి నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్‌టిపిసి కరెంటు ఉత్పత్తిలో భాగంగా వచ్చే బూడిద వ్యర్థాలను తరలించేలా సంస్థ యాజమాన్యం అందరికీ టెండరు దాఖలు చేసుకునే అవకాశం కల్పించింది. దీనిలో భాగంగా నిర్వాసిత గ్రామమైన రాజాపూర్ గ్రామానికి చెందిన కొంత మంది టెండరు దాఖలు చేసి ఆ టెండరును దక్కించుకున్నారు. ఈ గ్రామంలో 540 ఎకరాల భూమిని ఎన్‌టిపిసి బూడిద చెరువు కోసం అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో అక్కడి వారు టెండర్లు వేసి పనులు చేసేందుకు ముందుకొచ్చారు. మొత్తం 30లక్షల టన్నుల బూడిదకు.. టన్నుకు రూ.30చొప్పున 19లక్షల టన్నులకు, రూ.26తో 11 లక్షల మెట్రిక్ టన్నులకు వేలాన్ని దక్కించుకున్నారు. 40మంది కలిసి ఈ వేలంలో పాల్గొని ఈ టెండర్లు సొంతం చేసుకున్నారు. దీనిలో కుందనపల్లికి చెందిన నలుగురు ఉన్నారు. అయితే మమ్మల్ని పనులు చేయకుండా కొంతమంది బడా కాంట్రాక్టర్లు అడ్డుకుంటున్నారని కుందనపల్లి నిర్వాసితులు వాపోతున్నారు.

అధికార పార్టీ ఏదైనా.. హవా వీరిదే..

ఎన్‌టిపిసి నిర్వహించే కాంట్రాక్టు టెండరు ఏదైనా.. కొంతమంది బడా కాంట్రాక్టర్లదే హవా కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీకి అనుకూలంగా ఉండి అప్పుడు పనులు చేసిన వారు.. ఇప్పుడు ప్రభుత్వం మారినా వారే ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. తమను అధికారేతర పార్టీ ప్రజలుగా ముద్రవేస్తూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదని కుందనపల్లి నుంచి టెండర్ దాఖలు చేసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ఆచరణ ఎక్కడా..?

ఎన్‌టిపిసి నిబంధనల మేరకు 2లక్షల మెట్రిక్ టన్నుల లోపు బూడిద తరలింపునకు ఆన్‌లైన్ ద్వారా టెండరు దక్కించుకున్న వారు ఎలాంటి యంత్రాలనూ వినియోగించకూడదన్న నిబంధన ఉంది. 50వేల టన్నులకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ జేసీబీ లాంటి యంత్రాలను ఈ తరలింపునకు వినియోగించుకునే అవకాశం లేదు. దీంతో టెండర్లు దక్కించుకున్న నలుగురు కాంట్రాక్టర్లు కలిసి పనిచేస్తూ 2లక్షల టన్నులకుగాను యంత్రాలను వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించారు. నలుగురు చిన్న కాంట్రాక్టర్లు కలిసి పనిచేసే విధానాన్ని తట్టుకోలేని.. బడా కాంట్రాక్టర్లు యంత్రాలు వినియోగించకుండా అడ్డుకుంటున్నారు. పని జరగకుండా నిలువరిస్తే బడా కాంట్రాక్టర్లను ఆశ్రయిస్తారని, తమ చెప్పుచేతల్లో ఉంటారనే కుయుక్తులు పన్నుతున్నారు.

అలా చిన్నచిన్న కాంట్రాక్టర్లలందరూ పెద్ద కాంట్రాక్టర్లను ఆశ్రయించేలా ఎన్‌టిపిసి యాజమాన్యంతో కలిసి ఒత్తిడి చేయిస్తున్నారు. పెద్ద కాంట్రాక్టర్ల జేసీబీలను వినియోగించుకునేలా ఒప్పందం చేసుకునేలా కుట్ర చేస్తున్నారు. దీంతో చిన్న కాంట్రాక్టర్లు తమకు మిగిలే కొద్దిపాటి లాభాన్ని సైతం పెద్ద కాంట్రాక్టర్ల జేసీబీలకు చెల్లించాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు.

అన్ని అర్హతలున్నా.. అధిపత్యం ఎందుకు..?

కాంట్రాక్టు నిబంధనలకు సంబంధించి టెండర్లలో పాల్గొనేవారికి అర్హతలు ఉన్నవారందరూ ఈ యేడాది మార్చిలో నిర్వహించిన టెండర్లలో పాల్గొన్నారు. టన్ను బూడిదకు ఎన్‌టిపిసి రూ.1 చొప్పున ధర నిర్ణయించగా.. కుందనపల్లికి చెందిన నిర్వాసితులు టెండరు దాఖలు చేసి పనులు దక్కించుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా రూ.76 వేలను ఎన్‌టిపిసి ఖాతాలో డిపాజిట్ చేశారు. జిఎస్‌టి, సొసైటీ రిజిస్ట్రేషన్ లాంటి అన్ని అర్హతలు ఉండి పనులు దక్కించుకున్న చిన్న కాంట్రాక్టర్లు పనులు చేయకుండా పెద్ద కాంట్రాక్టర్లు ముందుకు వెళ్లనీయడం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు అన్ని వసతులు కల్పించి పనులు కొనసాగేలా చూడాల్సిన ఎన్‌టిపిసి యాజమాన్యం దీనిపై మౌనం వహిస్తూ పెద్ద కాంట్రాక్టర్లకే వత్తాసు పలుకుతోందన్న ఆరోపణలున్నాయి. ఈ సమస్యలపై ఎన్‌టిపిసి అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఎన్‌టిపిసి అధికారులు ఫోన్ లిఫ్ట్ చేయడంగానీ ప్రకటనగానీ చేయడం లేదు. ఒక వేళ లిఫ్ట్ చేసినా తెలుగేతర భాషలో మాట్లాడుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

భూములు కోల్పోయినా అన్యాయమే..

అధికారికంగా అన్ని అర్హతలతో టెండర్లు దక్కించుకున్నా పనులు జరగడం లేదు. నిర్వాసిత ప్రజలుగా మేము భూములు కోల్పోయినా మాకు తగిన న్యాయం జరగడం లేదు. కాలుష్యాన్ని భరిస్తూ అనారోగ్య పాలవుతున్నా ఎన్‌టిపిసి యాజమాన్యం పట్టించుకోవడం లేదు. మాపై ఆధారపడి చాలా మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. మాకు న్యాయం జరిగేలా ఎన్‌టిపిసి యాజమాన్యం చొరవ చూపాలి.

దుబాసి పరమేశ్వర్, కుందనపల్లి

ఎన్‌టిపిసి యాజమాన్యం బాధ్యత వహించాలి

ఆన్‌లైన్ ద్వారా టెండరు దక్కించుకున్న మా తరపున ఎన్‌టిపిసి యాజమాన్యం బాధ్యత వహించాలి. నిబంధనలకనుగుణంగా మేము డిపాజిట్ చేసిన నగదుతోపాటు మా పనులు సవ్యంగా కొనసాగేలా చూడాలి. సీఐఎస్ఎఫ్, ఎన్‌టిపిసి యాజమాన్యం పర్యవేక్షణలో పనులు కొనసాగేలా చర్య తీసుకోవాలి. మాపై అధిపత్యం చేస్తున్న వారి టెండర్లు రద్దు చేసేలా ఎన్‌టిపిసి కఠిన నిబంధనలు అమలు చేయాలి.

చిలుక ప్రసాద్, కుందనపల్లి

లేబర్ కోడ్‌లపై భగ్గుమన్న కార్మిక లోకం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లపై కార్మికలోకం భగ్గుమంది. దేశంలోని పలు ప్రాంతల్లో లేబర్ కోడ్‌ల కాపీలను కార్మికులు తగలబెట్టారు. శతాబ్దాలుగా కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న లేబర్ కోడ్‌లను తిప్పికొడతామని ప్రతినబూనారు. తక్షణమే ఉపసంహరించుకోవాలని పెద్దపెట్టున నినదించారు.

పంజాబ్‌లోని భటిండాలో ఆందోళన చేస్తున్న కార్మికులు

యుఐటి వరల్డ్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు సైప్రస్ వెళ్లిన సిఐటియు, ఎఐటియుసి నేతలు నినాదాలు చేస్తున్న దృశ్యం

ఢిల్లీలో 'వెరీపూర్'లోనే గాలి నాణ్యత

న్యూఢిల్లీ : ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. వెరీ పూర్ కేటగిరీలోనే గాలి నాణ్యతలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం దేశ రాజధాని ఢిల్లీలో 359 స్థాయి వద్ద గాలి నాణ్యతలు నమోదయ్యాయి. శుక్రవారం 364 కంటే ఈరోజు స్వల్పంగా గాలి నాణ్యతలు మెరుగుపడ్డాయి. అయినప్పటికీ గాలి నాణ్యతల స్థాయి వెరీ పూర్ కేటగిరీలోనే నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఢిల్లీలో కార్లు, బస్సుల నుంచి వచ్చే పొగ వల్లే గాలి కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని ఢిల్లీవాసులు చెబుతున్నారు. రోడ్లపై విపరీతంగా కార్లు, బస్సులు, టూవీలర్ వాహనాలు నడుస్తున్నాయి. వీటివల్ల ట్రాఫిక్‌జామ్‌తోపాటు, కాలుష్యం కూడా పెరిగిపోతోంది.

బైజూస్ రవీంద్రన్‌కు యుఎస్ కోర్టు షాక్

- రూ.9వేల కోట్లు చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ : కోవిడ్ సమయంలో ఓ వెలుగువెలిగిన ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థ బైజూస్, ఆ సంస్థ ఫౌండర్ రవీంద్రన్‌కు అమెరికా కోర్టు భారీ షాక్ ఇచ్చింది. బైజూస్ ఆల్ఫాపై అమెరికాకు చెందిన రుణదాత గ్లాస్‌ట్రస్ట్ కంపెనీ ఎల్‌ఎల్‌సి దాఖలు చేసిన పిటిషన్‌పై అమెరికా కోర్టు వాదనలకు వీలు లేకుండా డిఫాల్ట్ తీర్పును వెలువరించింది. పిటిషనర్లకు 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9వేల కోట్లు) వ్యక్తిగతంగా చెల్లించాలని బైజూస్ రవీంద్రన్‌ను ఆదేశిస్తూ నవంబర్ 20న తీర్పు వెలువరించింది. తమ తీర్పును రవీంద్రన్ ఉల్లంఘించడం, పట్టించుకోకపోవడంతో ఈ ఆదేశాలు ఇస్తున్నట్లు డెలావేర్ దివాలా పరిష్కార కోర్టు తన తీర్పులో పేర్కొంది. ఈ ఆదేశాలను బైజూస్ రవీంద్రన్ తోసిపుచ్చారు. అప్పీల్‌కు వెళతామని పేర్కొన్నారు. కోర్టులో వాదనలు వినిపించేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని బైజూస్ తరపు లాయర్లు తెలిపారు.



బైజూస్ పేరిట సేవలందిస్తున్న సమయంలోనే బైజూస్ ఆల్ఫాను 2021లో నెలకొల్పారు. అంతర్జాతీయ రుణదాతల నుంచి నిధుల సమీకరించే ఉద్దేశంతో ఈ కంపెనీని ఏర్పాటు చేశారు. దీనిద్వారా బైజూస్ ఆల్ఫా 1 బిలియన్ టర్మ్‌లోన్‌ను బైజూస్ పొందింది. కాగా.. బైజూస్ ఆల్ఫా టర్మ్‌లోన్ నిబంధనలను ఉల్లంఘించిందని, మొత్తం అప్పులో 533 మిలియన్ డాలర్లు (రూ.4,777 కోట్లు) అమెరికా నుంచి చట్టవిరుద్ధంగా తరలించినట్లు రుణదాతలు ఆరోపించారు. దీనిపై గ్లాస్‌ట్రస్ట్ డెలావేర్ కోర్టును ఆశ్రయించింది. దీంతో బైజూస్ ఆల్ఫాను స్వాధీనం చేసుకునేందుకు గ్లాస్ ట్రస్ట్‌కు కోర్టు అనుమతించింది. దీనిపై రవీంద్రన్ స్పందించలేదు. దీంతో బైజూస్ ఆల్ఫా, గ్లాస్ ట్రస్ట్ 533 మిలియన్ డాలర్లకు సంబంధించిన నిధుల లావాదేవీల కోసం మరోసారి కోర్టును ఆశ్రయించాయి. తమ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే రవీంద్రన్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన కోర్టు.. తాజాగా డిఫాల్ట్ ఆదేశాలు జారీ చేసింది. ఆల్ఫా ఫండ్లను ఎలా ఖర్చు చేశారో.. పూర్తి వివరాలను లెక్కలు సమర్పించాలని ఆదేశించింది.

నిరాశ కలిగించింది !

- గవర్నర్ల అధికారాలపై సుప్రీం తీర్పుపై సిపిఎం

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని 200వ అధికరణ కింద గవర్నర్ల అధికారాలకు సంబంధించి రాష్ట్రపతి చేసిన ప్రస్తావనపై సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనతో కూడిన అభిప్రాయం నిరాశ కలిగించేలా వుందని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్రం చేతిలో అధికంగా కేంద్రీకృతమవుతున్న అధికారాల కారణంగా రాష్ట్రాల హక్కులపై ప్రస్తుతం జరుగుతున్న దాడికి ఇది ఏ రకంగానూ అడ్డుకట్ట వేయదని పేర్కొంది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో గవర్నర్లకు విచక్షణాధికారాలు వుంటాయని చెప్పడం, వారికెలాంటి కాల పరిమితులు విధించకపోవడం వల్ల సుప్రీంకోర్టు వెలువరించిన ఈ అభిప్రాయం ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ల రాజ్యాంగయేతర అధికారాలను అమలు చేసేలా మాత్రమే ప్రోత్సహిస్తుందని ఆ ప్రకటన పేర్కొంది.

ముఖ్యంగా, గవర్నర్ బిల్లును పున:పరిశీలించాల్సిందిగా కోరిన తర్వాత కూడా రాష్ట్ర అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లుకు గవర్నర్ తప్పనిసరిగా ఆమోదముద్ర వేయాల్సిన అవసరం లేదనడం తిరోగమన సూచన. దానికి బదులుగా గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతికి నివేదించవచ్చు, తద్వారా నిరవధికంగా జాప్యం జరిగేలా చేయవచ్చు. పెండింగ్ బిల్లుపై గవర్నర్ సుదీర్ఘంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వున్న పక్షంలో పరిమిత స్థాయిలో జ్యుడీషియల్ జోక్యం వుండవచ్చని పేర్కొనడం ఈ తీర్పులో ఇచ్చిన ఏకైక ఉపశమనం. అయితే ఇది కూడా చాలా అస్పష్టంగానే వుంది. ఎందుకంటే సుదీర్ఘమైన కాలం కార్యాచరణ కొరవడడం లేదా జాప్యం జరగడమంటే ఏమిటనేందుకు నిర్వచనం లేదు. ఆ రకంగా సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పులో, కేంద్రం తరపున రాజకీయ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్ల ఏకపక్ష పనితీరుపై ఎలాంటి రాజ్యాంగపరమైన అడ్డుకట్టలు లేకుండా పోయాయి.

పైలట్ నయాన్ష్ మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు

దుబాయ్ : దుబాయ్‌లో అల్ మఖ్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఎయిర్ షో నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో మరణించిన భారత వైమానిక దళ (ఐఎఎఫ్) తేజస్ యుద్ధ విమానం పైలట్, వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ (34) స్వగ్రామంలో విషాదం అలముకుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని తెహసిల్ నగ్రోటా బాగ్వాన్‌లోని పాటియాల్కర్ గ్రామానికి చెందిన నమాన్ష్ భార్య కూడా ఐఎఎఫ్ అధికారిగా పనిచేస్తున్నారు. వీరికి ఆరేళ్ల కుమార్తె ఉన్నారు. నమాన్ష్ తండ్రి జగన్నాథ్ స్యాల్ ఇండియన్ ఆర్మీ మెడికల్ కార్ప్స్‌లో పనిచేశారు. తర్వాత విద్యాశాఖలో పనిచేసి ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. దుబాయ్‌లో జరిగిన ఎయిర్‌షోలో తేజ్ యుద్ధ విమానం కూలి పైలట్ నమాన్ష్ ప్రాణాలు కోల్పోవడం విచారకరమని, ఇలాంటి దు:ఖ సమయంలో మృతుల కుటుంబానికి అండగా నిలుస్తామని భారత వైమానిక దళం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రమాదానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి దర్యాప్తు ప్రారంభించినట్లు ఐఎఎఫ్ తెలిపింది.

గాజాలో దారుణ పరిస్థితులు

- 'కాల్పుల విరమణ'లోనూ చిన్నారుల మరణాలు
- ఒప్పందం తర్వాత 67 మంది పాలస్తీనా పిల్లలు మృతి
- ఈ ధోరణి భయంకరమైంది : యూనిసెఫ్ ఆందోళన

ఇజ్రాయిల్ దాడిలో తాజాగా ధ్వంసమైన గాజాలోని ప్రాంతం

జెనీవా, గాజా సిటీ : అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినా.. అది నిత్యం ఉల్లంఘనలకు గురవుతున్నది. ఇజ్రాయిల్ ఈ ఒప్పందానికి పదే పదే తూట్లు పొడుస్తున్నది. గతనెల 11 నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన విషయం విదితమే. ఇక అప్పటి నుంచి ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులతో గాజా పట్టణంలో 67 మంది పాలస్తీనా చిన్నారులు మృతి చెందారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి బాలల నిధి (యూనిసెఫ్) వెల్లడించింది. జెనీవాలో జరిగిన విలేకరుల సమావేశంలో యూనిసెఫ్ ప్రతినిధి రికార్డో పైరెస్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం.. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో ఇజ్రాయిల్ జరిపిన వైమానికదాడిలో ఒక శిశువు ప్రాణాలు కోల్పోయింది. బుధవారం జరిగిన దాడుల్లో మరో ఏడుగురు పిల్లలు మరణించారు. "ఇది కాల్పుల విరమణ సమయంలో జరుగుతోంది. ఈ ధోరణి భయంకరమైంది" అని రికార్డో పైరెస్ అన్నారు. ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం.. ఒక కల ఉంది. నిరసంతర హింస వీటన్నిటినీ క్షణాల్లో నేలమట్టం చేస్తోంది" అని ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

పిల్లలపై యుద్ధ ప్రభావం

ఇజ్రాయిల్ వరుస దాడులతో పాలస్తీనాలోని సాధారణ పౌరులేగాక.. మహిళలు, చిన్నారులు కూడా చనిపోతున్నారు. 2023 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు ఇజ్రాయిల్ చేసినదాడులలో 64వేల మంది పాలస్తీనా చిన్నారులు మరణించటం, గాయపడటం జరిగిందని యూనిసెఫ్ అంచనా వేస్తోంది. సేవ్ ద చిల్డ్రెన్ నివేదిక ప్రకారం.. సగటున 475 మంది పాలస్తీనా చిన్నారులు 'జీవితాంతం మిగిలిపోయే గాయాల'తో బాధపడుతున్నారు. అలాగే గాజాపై ఇజ్రాయిల్ విధిస్తున్న ఆంక్షల కారణంగా ఆహార కొరత తీవ్రమై.. పిల్లలు ఆకలితో మరణించే ఘటనలూ అక్కడ నమోదవుతున్నాయి. ఈ వారం ఖాన్ యూనిస్ ప్రాంతంలో తమ సైనికులపై కాల్పులు జరిగాయన్న కారణం చూపి ఇజ్రాయిల్ గాజాపై వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో కనీసం 32 మంది పాలస్తీనీయులు మరణించారని కథనాలు వెలువడ్డాయి.

చలిలో వణుకుతున్న చిన్నారులు

ఇజ్రాయిల్ సహాయక సరుకుల రవాణాపై కొనసాగిస్తున్న ఆంక్షలతో గాజా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శీతాకాలంలో అవసరమైన గూడారాలు, వేడి ఏర్పాట్లు లేకపోవటంతో పిల్లలు బయటే పడుకుంటూ వణుకుతున్నారు. "గాజాలో పిల్లలకు సురక్షిత స్థలం ఎక్కడా లేదు. వారి బాధల్ని ప్రపంచం సాధారణంగా తీసుకోవద్దు" అని పైరెస్ పిలుపునిచ్చారు.

హిందువులు లేకుంటే ప్రపంచ మనుగడే లేదట

- మణిపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఉవాచ

ఇంఫాల్ : హిందువులు లేకుంటే ప్రపంచ మనుగడే ఉండదని, ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలక పాత్ర పోషిస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ చెప్పుకొచ్చారు. భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో ముందుకుపోతున్న దేశంలో మణిపూర్‌లో జాతుల అల్లర్లలో భాగస్వామి అయిన ఆర్‌ఎస్‌ఎస్ పరివార్ శక్తుల తరపున ఆయన పర్యటించడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అక్కడ ఉన్న జాతుల, మతాల ఘర్షణలను చల్లార్చడానికి బదులు ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని చెబుతున్నారు. 'ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని పరిస్థితులను చూసింది. గ్రీస్, ఈజిప్ట్, రోమ్... ఈ నాగరికతలన్నీ అంతరించిపోయాయి. మన నాగరికతలో ఏదో ఉంది. అందుకే మనం ఇప్పటికీ ఇక్కడ ఉన్నాము' అని భగవత్ చెప్పుకొచ్చారు. మణిపూర్‌లో పర్యటిస్తున్న భగవత్ ఓ సభలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. జాతిపరమైన ఘర్షణలు జరిగిన తర్వాత భగవత్ రాష్ట్రానికి రావడం ఇదే మొదటిసారి. హిందూ సమాజం అనేది ప్రపంచ ధర్మ పరిరక్షకురాలని, హిందువులు అనే వారే లేకుంటే ప్రపంచమే అంతమవుతుందని వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక స్వావలంబన సాధించడం మరీ పెద్ద కష్టమైన లక్ష్యమేమీ కాదని తెలిపారు. నక్సలిజం క్షీణిస్తోందని అంటూ దానిని ఎట్టి పరిస్థితులలోనూ సహించరాదని సమాజం నిర్ణయించినందునే అది కనుమరుగు అవుతోందని భగవత్ చెప్పారు.

ట్రంప్ వ్యాఖ్యలను నిరసిస్తూ రిపబ్లికన్ సభ్యురాలి రాజీనామా

వాషింగ్టన్ : అమెరికా ప్రతినిధి సభకు రాజీనామా చేస్తానని రిపబ్లికన్ సభ్యురాలు మర్జోరీ టేలర్ గ్రీన్ ప్రకటించారు. ఒకప్పుడు దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు గట్టి మద్దతుదారైన గ్రీన్ ఇటీవల ఆయనతో విభేదించారు. ఆమె తన రాజీనామా నిర్ణయాన్ని శుక్రవారం పొద్దుపోయిన తర్వాత సామాజిక మాధ్యమంలో తెలియజేశారు. 'ప్రతినిధి సభ సభ్యురాలిగా సాధారణ అమెరికన్లందరికీ ప్రాతినిధ్యం వహించాను. అందుకే నన్ను వాషింగ్టన్ డీసీలో అవమానించారు' అని జార్జియా నుంచి ప్రతినిధి సభకు ఎన్నికైన గ్రీన్ తన వీడియో పోస్ట్‌లో తెలియజేశారు. జనవరి 5న ప్రతినిధి సభకు గుడ్‌బై చెబుతానని అన్నారు. ట్రంప్ చేపట్టిన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) ఉద్యమానికి గ్రీన్ ఓ చిహ్నంగా నిలిచారు. ఆ తర్వాత ట్రంప్ ఆమెను అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారు. లైంగిక నేరస్థుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైల్స్ విడుదల విషయంలో ట్రంప్‌తో ఆమె విభేదించారు. 'పద్నాలుగేళ్ల వయసులో లైంగికదాడికి గురైన అమెరికా మహిళల పక్షాన నిలబడ్డాను. ధనవంతులు, శక్తివంతులైన పురుషుల చేతిలో అక్రమ రవాణాకు గురైన వారి కోసం నిలబడ్డాను. అలాంటి నన్ను అధ్యక్షుడు ద్రోహి అన్నారు. నేను ఎవరి కోసమైతే పోరాడానో ఆ వ్యక్తి నన్ను బెదిరించి ఉండకూడదు' అని ఆమె తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. గాజాపై అమెరికా మిత్రదేశమైన ఇజ్రాయిల్ దాడిని తూర్పారబడుతూ మారణహోమంగా గతంలో ఆమె అభివర్ణించారు. ట్రంప్ ఆమెను కించపరుస్తూ తన ట్రూత్ సోషల్ వేదికలో అనేక పోస్టులు పెట్టడంతోపాటు వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ రాజీనామా ప్రకటనపై ట్రంప్ స్పందిస్తూ ఇది దేశానికి గొప్ప వార్త అని తాను భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. 2026లో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగాల్సి ఉండగా, గ్రీన్ రాజీనామా నిర్ణయం రిపబ్లికన్ పార్టీని కలవరపాటుకు గురిచేస్తోంది. 'మాగా' ఉద్యమం బీటలు వారుతోందని ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి.

అభివృద్ధి ప్రాధాన్యతలు మార్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమయ్యారు. జి 20 నేతలతో గ్రూపు ఫోటోను ఎక్స్‌లో పోస్టు చేస్తూ "అందరం కలిసి అంతర్జాతీయ పురోగతి, సంక్షేమానికి నిబద్ధతను పునరుద్ఘాటించాం." అని పేర్కొన్నారు.

ముప్పులను ఎదుర్కొనేందుకు బహుముఖ సహకారం

జి 20 డిక్లరేషన్ పిలుపు

వాతావరణ మార్పుల తీవ్రతను డిక్లరేషన్ నొక్కిచెప్పింది. ప్రస్తుతమున్న, కొత్తగా తలెత్తుతున్న ముప్పులను ఎదుర్కొనడానికి బహుముఖ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సూడాన్, కాంగో, పాలస్తీనా, ఉక్రెయిన్‌ల్లో సమగ్ర, న్యాయమైన, శాశ్వత శాంతి స్థాపన కోసం మనందరం కలిసి కృషి చేయాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. జి-20 సదస్సును అమెరికా బహిష్కరించింది. అయినా జి 20 నేతలు డిక్లరేషన్‌ను ఆమోదించారని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా ప్రతినిధి శనివారం తెలిపారు.

ట్రంప్‌తో మమ్దానీ భేటీ

- శ్వేతసౌధంలో సాదరపూర్వక స్వాగతం

వాషింగ్టన్ : న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీకి అమెరికా అధ్యక్ష భవనంలో సాదర పూర్వక స్వాగతం లభించింది. గతంలో చేసిన ఆరోపణలన్నింటినీ పక్కనపెట్టి మమ్దానీకి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చిరునవ్వుతో స్వాగతం పలికారు. అంతేకాదు... ఆయనపై ప్రశంసలు కురిపించారు కూడా. గతంలో మమ్దానీ తనను ఫాసిస్టుగా సంబోధించడాన్ని గుర్తుచేసుకుంటూ 'అయితే ఓకే' అని అన్నారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల సమయంలో ట్రంప్, మమ్దానీ మధ్య వివిధ అంశాలపై పరస్పరం విమర్శలు చేసుకున్నారు. ట్రంప్ వ్యక్తిగత దూషణలకు సైతం దిగారు.

అయితే ఓకే

ట్రంప్‌ను ఇప్పటికీ ఫాసిస్టుగానే భావిస్తున్నారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు మమ్దానీ సమాధానమిస్తూ 'నేను దాని గురించి మాట్లాడాను' అని అన్నారు. ఇంతలోనే ట్రంప్ జోక్యం చేసుకొని 'అయితే ఓకే. మీరు అవును అని అనవచ్చు' అని చెప్పారు. దీంతో ఇరువురు నేతలు చిరునవ్వులు చిందించారు. 'అది చాలా సులభం. వివరించడం కంటే సులభం. నేను దానిని పట్టించుకోను' అంటూ ట్రంప్ తన రాజకీయ ప్రత్యర్థితో చేయి కలిపారు. మమ్దానీ కూడా నవ్వుతూ 'అవును' అని బదులిచ్చారు. ట్రంప్, మమ్దానీ మధ్య నడిచిన సంభాషణ కొద్దిసేపటికే సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది.

అనేక విషయాలు చర్చించాం

ట్రంప్‌తో కరచాలనం చేస్తున్న మమ్దానీ

ఇమ్మిగ్రేషన్ నుంచి ఆర్థిక విధానాల వరకూ... అనేక అంశాల్లో విభేదాలున్న మమ్దానీ, ట్రంప్ శుక్రవారం సమావేశమయ్యారు. తాను ఆశించిన దాని కంటే అనేక అంశాలపై ఏకాభిప్రాయంతో ఉన్నామని ట్రంప్ చెప్పారు. న్యూయార్క్ నగరాన్ని ఇద్దరం ప్రేమిస్తున్నామని, దాని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అనేక అంశాలపై పరస్పరం అభిప్రాయాలు తెలియజేసుకున్నామని అన్నారు. ఇమ్మిగ్రేషన్ అమలుపై కూడా మాట్లాడుకున్నామని ట్రంప్ చెప్పారు. తమ మధ్య నెలకొన్న అభిప్రాయ భేదాలు ప్రస్తావనకు రాలేదని మమ్దానీ తెలిపారు. జీవన వ్యయానికి సంబంధించిన ఒత్తిడులపై ప్రధానంగా దృష్టి సారించామని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు తగ్గించడం తదితర అనేక అంశాలపై చర్చించామని తెలిపారు.

'సంజీవని' రహస్యాలు బయటపెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. కార్మికులు పనిచేయకపోతే లక్షల టన్నుల ఉత్పత్తి ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని వివరించారు. ప్రభుత్వం రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఒక్క గనిని కూడా ఇవ్వలేదని, ప్రయివేటు స్టీల్ ప్లాంట్లకు మాత్రం ఇస్తున్నారని అన్నారు. బొగ్గు రవాణాకు ఓడలు ఇవ్వలేదని, అదానికి పోర్టులను కట్టబెట్టారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బతీస్తున్నాయని, కార్మికులపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు.

వైద్యులను తక్కువ చేసి మాట్లాడడం సరికాదు

వైద్యులను ముఖ్యమంత్రి తక్కువ చేసి మాట్లాడుతున్నారని, ప్రాణమున్న డాక్టర్లు కన్నా ప్రాణం లేని ఎఐ గొప్పగా పనిచేస్తుందని చెప్పడం అవివేకమని రాఘవులు పేర్కొన్నారు. సిఎం నుంచే దీనిని తన ఇంటి ప్రారంభించాలని, డాక్టర్లను ఇంటింటికి పంపి ఎఐ ద్వారా వైద్యం చేయించుకోవాలని అన్నారు. కంప్యూటర్ చేసే వైద్యం మనుషుల కన్నా గొప్పది కాదని తెలిపారు. టెక్నాలజీపై ఎక్కువ ఆధారపడడం మంచిది కాదని ప్రపంచంలోని మేధావులు చెబుతున్నారని గుర్తు చేశారు.

బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకం

బూటకపు ఎన్‌కౌంటర్లకు సిపిఎం వ్యతిరేకమని రాఘవులు చెప్పారు. సిపిఎం నాయకులను, కార్యకర్తలను నక్సలైట్లు హత్య చేశారన్నారు. నక్సలైట్లను ప్రభుత్వం ఎన్‌కౌంటర్ చేస్తే తమ పార్టీ వ్యతిరేకించిందని, ప్రభుత్వ హింసను ఖండించిందని గుర్తు చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం మావోయిస్టులను హత్య చేస్తోందని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపాలని, ఇలా హత్యలు చేయడం మంచిది కాదని అన్నారు. మావోయిస్టులను అరెస్ట్ చేసి, చిత్రహింసలు పెట్టి హత్య చేయడం సరైంది కాదని తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లను నిలుపుదల చేయాలని, అరెస్టుల సమయంలో కేసులు పెట్టి చట్టబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

అమెరికా ఆంక్షలపై పోరాడకపోతే ఏ పరిశ్రమలు వస్తాయి

సిఐఐ సమ్మిట్‌లో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయని చంద్రబాబు చెబుతున్నారని, ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి అనువైన పరిస్థితులు కల్పించాలని, అలా కాకుండా ఆహ్వానం పలికితే సరిపోదని రాఘవులు అన్నారు. ఇక్కడికి వచ్చే పారిశ్రామివేత్తలకు కారుచౌకగా భూములు ఇవ్వడానికి ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపుతోందని, నిరుద్యోగ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని చెప్పారు. పెట్టుబడులు ఉపాధి సృష్టించే రంగాల్లో రావాలని, అప్పుడే అందరికీ ఉపయోగమని అన్నారు. అమెరికా ఆంక్షలపై పోరాడకపోతే ఏ పరిశ్రమలు వస్తాయని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాఘవులతో సోమిరెడ్డి భేటీ

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులతో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. శనివారం ఆయన సిపిఎం జిల్లా కార్యాలయంలో రాఘవులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఇద్దరు నాయకులు పలు విషయాలను చర్చించుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం, గతంలో జరిగిన ప్రజా పోరాటాలను గర్తుచేసుకున్నారు. ఈ భేటీలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఉన్నారు.

చైనా పౌరులకు గ్లోబల్ టూరిస్ట్ వీసాలు

- సేవలను పున: ప్రారంభించిన భారత్

న్యూఢిల్లీ : భారత ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌ల వద్ద చైనా పౌరులకు టూరిస్ట్ వీసా సేవలను మళ్లీ ప్రారంభించింది. భారత్-చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి వస్తున్న తరుణంలో తాజా పరిణామం చోటు చేసుకున్నది. 2020లో గల్వాన్ లోయలో హింసాత్మక ఘర్షణ తరువాత ఇరుదేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఈ ఏడాది జులైలో భారత్ మొదట బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ, హాంకాంగ్ కార్యాలయాల ద్వారా మాత్రమే వీసా ప్రాసెసింగ్‌ను పాక్షికంగా పునరుద్ధరించింది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వీసా సేవలు తిరిగి ప్రారంభించటం ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలను సూచిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. 2020 తర్వాత నిలిచిపోయిన భారత్-చైనా డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు కూడా గతనెలలో మళ్లీ ప్రారంభమైన విషయం తెలిసిందే. వేసవిలో కైలాస్-మానసరోవర యాత్రను కూడా పునరుద్ధరించారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించండి

(మొదటిపేజీ తరువాయి)

దారుణంగా ఉల్లంఘించడాన్ని కూడా పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మొత్తం ప్రక్రియలో కార్మిక సంఘాలను ప్రభుత్వం పూర్తిగా పక్కనబెట్టింది. చర్చ జరపకుండానే పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని ఆమోదించింది. పైగా, తిరుగులేని వాదనలు, నిర్దిష్టమైన డాక్యుమెంటరీ సాక్ష్యాధారాలను ప్రాతిపదికగా తీసుకుని లేబర్ కోడ్‌లకు చేసిన అభ్యంతరాలన్నింటినీ ప్రభుత్వం చాలా దురుసుగా తిరస్కరించింది. ఈ లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం పిలుపునిచ్చింది. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రతిఘటించేందుకు, మరింత సమగ్రమైన రీతిలో కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు సమైక్య పోరాటాలను నిర్మించాలని అన్ని కార్మిక సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులకు సిపిఎం విజ్ఞప్తి చేసింది.

అభివృద్ధికి అవకాశాలు ఉంటాయి

- విదేశీ సంస్థలను ఆహ్వానిస్తున్న చైనా

బీజింగ్ : చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ, నేషనల్ ఫైనాన్షియల్ రెగ్యులేటరీ అడ్మినిస్ట్రేషన్ సహా పలు చైనా ప్రభుత్వ సంస్థలు ఇటీవలి కాలంలో ప్రపంచ కంపెనీలతో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించాయి. రౌండ్‌టేబుల్ సమావేశాలు, ముఖాముఖి చర్చలు కూడా జరిగాయి. చైనాలో అభివృద్ధికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని విదేశీ ఇన్వెస్టర్లను కోరేందుకే ఈ సమావేశాలు జరుగుతున్నాయని నిపుణులు తెలిపారు. విదేశీ కంపెనీలను అనుమతిస్తామని, మెరుగైన వ్యాపార వాతావరణం కల్పిస్తామని స్పష్టమైన సంకేతాలు పంపడం ఈ సమావేశాల వెనుక ఉన్న ముఖ్యమైన ఉద్దేశం.

ఈ సమావేశాలు ఇప్పటికే సానుకూల ఫలితాలను అందిస్తున్నాయి. ఉదాహరణకు ప్రముఖ సరకు రవాణా సంస్థ మెర్స్క్ షాంఘైలోని లింగాంగ్ ప్రాంతంలో గురువారం తన లాజిస్టిక్ కేంద్రాన్ని ప్రారంభించింది. దీని పెట్టుబడి 140 మిలియన్ డాలర్లు. ప్రపంచవ్యాప్తంగా ఆ సంస్థ పెట్టిన అతి పెద్ద గిడ్డంగుల పెట్టుబడులలో ఇది ఒకటి. చైనా మార్కెట్‌లో సమీకృత లాజిస్టిక్ వ్యూహాన్ని అమలు చేయడంలో ఇదో మైలురాయి అవుతుందని సంస్థ సీఈఓ విన్సెంట్ క్లర్క్ చెప్పారు. కాగా అమెరికాకు చెందిన దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్‌కు చెందిన శామ్స్ క్లబ్ శుక్రవారం ఛాంగ్‌పింగ్ జిల్లాలో అతి పెద్ద బీజింగ్ స్టోర్‌ను ప్రారంభించింది.

విదేశీ సంస్థలతో ఫైనాన్స్, తయారీ, సాంకేతిక ఆధునీకరణ, బయోటెక్, రిటైల్ వంటి అంశాలపై పలు దఫాలుగా చర్చలు జరిగాయి. ప్రముఖ విదేశీ కంపెనీలు వ్యక్తం చేసిన సందేహాలను సీనియర్ అధికారులు నివృత్తి చేశారు. చైనా వాణిజ్య శాఖ అధికారులు ఈ నెలలో అమెరికాకు చెందిన కేకేఆర్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపుతోనూ, బయోటెక్నాలజీ కంపెనీ ఇల్యూమినాతోనూ భేటీ అయ్యారు. పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. మరోవైపు చైనా నేషనల్ ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీ అడ్మినిస్ట్రేషన్ (సీఎన్‌ఐపీఏ) ఔషధ కంపెనీ అయిన రోచేతో చర్చలు జరిపి వారికి అవసరమైన హామీలు ఇచ్చింది.

విద్యార్థికి పట్టా అందజేస్తున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

అందరి భాగస్వామ్యంతోనే దేశ పురోగతి

(మొదటిపేజీ తరువాయి)

చేశారని గుర్తు చేశారు. ఆయన ప్రవచనాలు ప్రపంచ శాంతిని నెలకొల్పే విధంగా ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవానికి ఉపరాష్ట్రపతి హాజరు

సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లెర్నింగ్ (డీమ్డ్ యూనివర్సిటీ) 44వ స్నాతకోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గౌరవ అతిథులుగా హాజరై ప్రసంగించారు. సత్యసాయి విద్యా సంస్థలో అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలతో సత్కరించారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్ తమ విద్యా సంస్థ పరిధిలో జరిగిన పురోగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, రిజిస్ట్రారు శ్రీకాంత్ ఖనన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన సౌరభం

వైఫల్యం ఎదురైతే నిరాశ చెందకూడదు. అది కొత్త ప్రేరణకు పునాది కావాలి.

మీకోసం

చేపముక్కలకు కొంచెం ఉప్పు కలిపి డీప్ ఫ్రీజర్‌లో ఉంచితే నిల్వ ఉంటాయి. ముక్కలు అంటుకోవు.

JEEVANA జీవన the family

దుష్టబుద్ధి

పాము కనులు కానరాక
ఆకలికే తాళలేక
చెట్టు కింద పడి ఉండెను
దారి వెంట సాగలేక

గొప్పలెన్నొ చెప్పుకొనెడు
కప్ప దాన్ని చేరుకొనెను
పాము గుడ్డితనము తెలిసి
సానుభూతి చాటుకొనెను

తిండి తెచ్చి పెట్టేందుకు
పడగ నీడ పట్టేందుకు
ఒట్టు పెట్టు కొనెను రెండు
కలిసి మెలిసి బతికేందుకు

పాము కింత తిండి దొరికె
కప్పకింత నీడ కలిగె
పాము గొడుగు పట్టె ననుచు
కప్ప డాంబికాలు పలికె

కప్ప గొప్ప తనము చాటి
ఎవ్వరనుచు తనకు సాటి
కప్పలలో మేటి ననుచు
విర్రవీగె హద్దు దాటి

కాల వేగ మెవ్వడాపు
పాము కనుల కలిగె చూపు
మారెనపుడు పాము బుద్ధి
చేరవచ్చె కప్ప దాపు

కప్ప వెంట బడెను పాము
గెంత సాగె కప్ప ఝాము
దుష్టబుద్ధి మారదనుచు
కప్ప దూరె గడ్డివాము!

-డా.పోతగాని సత్యనారాయణ
91825 31202



సరైన నీడ ఏది?

పిల్లలూ, ప్రియా స్కేటింగ్ చేస్తుంది. పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో తన సరైన నీడను కనిపెట్టండి.

జవాబు : 2

నేను గీసిన బొమ్మ

బి.హారిణి రెడ్డి,
9వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పాముల ప్రమాదాన్ని అవగాహనతో అరికట్టారు!

ప్రతి ఏడాది వానాకాలంలో వచ్చే ఎన్నో సమస్యల్లో పాముకాట్ల ప్రమాదాలు సర్వ సాధారణం. పాము కాటు వల్ల మరణించేవారి సంఖ్య ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఉంటుంది. 'ప్రపంచంలో ఏడాదికి పాము కాటు వల్ల మరణిస్తున్న వారు 78 వేల మంది ఉంటే- వారిలో ఒక్క మనదేశంలోనే 64 వేల మంది ఉన్నారు' అని 2022లో 'నేచర్ కమ్యూనికేషన్‌లో' ప్రచురితమైన 'పీర్-రివ్యూడ్ జర్నల్‌లో' పేర్కొన్నారు. దీన్నిబట్టే మనం ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నామో అర్థం చేసుకోవచ్చు. ఈ విపత్తు నుండి ప్రజలని కాపాడే బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదే. ఆ దిశగానే అడుగులు వేసి లక్ష్యం వైపు దూసుకెళ్తోంది కేరళ వామపక్ష ప్రభుత్వం. గడిచిన ఐదేళ్లలో అక్కడ పాము కాటు మరణాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. దీనికోసం ప్రజలు, విద్యావంతులు, క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతవర్గం వరకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకున్నారు. అవగాహన కల్పించడం, నివారించడంలో పంచాయతీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయి.

పాము కాటు వల్ల వయనాడ్‌లోని ఓ స్కూల్లో పదేళ్ల చిన్నారి మరణించింది. 2019లో జరిగిన ఈ దుర్ఘటనతో కేరళ రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో డిజిటల్ రెస్క్యూ నెట్‌వర్క్‌ని అభివృద్ధి చేసింది. అప్పటి నుండి అన్నిచోట్లా ఈ ప్రమాదాలని నివారించడంలో విశేష కృషి చేస్తోంది. ఈ ఏడాది అక్టోబరు 10న కేరళ ప్రజారోగ్య చట్టం 2023ని అనుసరించి, పాము కాటు విషప్రయోగాలను ప్రజారోగ్య ప్రాముఖ్యత కలిగిన వ్యాధిగా గుర్తించాలని ప్రకటించింది.

ఈ నోటిఫికేషన్ ప్రజలకి ఎంతో మేలు కలిగించేదిగా ప్రమాదాలని తగ్గించేదిగా ఉంది. ఈ విషయాన్నే కేరళ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాష్ట్ర నోడల్ అధికారి అజన్. ఎంజె ఇలా వివరించారు. 'ఇది పాము కాటు కేసులని త్వరితగతిన గుర్తించడానికి వీలు కల్పిస్తుంది. ప్రమాద తీవ్రతని అంచనా వేయడానికి దోహదపడుతుంది. అధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో నివారణా కేంద్రాల ఏర్పాటుకి సహాయపడుతుంది' అని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ భౌగోళిక స్వరూపం చాలా భిన్నమైనది. దట్టమైన ఉష్ణమండల అడవులు, విస్తృతమైన చిత్తడి నేలలు, అధిక జనసాంద్రత గల ఈ ప్రాంతంలో 130కి పైగా పాము జాతులు ఉన్నాయి. వాటిలో దాదాపు 10 రకాలు అత్యంత విషపూరితమైనవి. వ్యవసాయ క్షేత్రాలు, అడవులు, గ్రామాలు, పట్టణాల్లో తరచూ జరిగే పాముకాటు ప్రమాదాలు ఒక పెద్ద ఆరోగ్య సవాలుగా ఉంటుంది. కేరళలో కూడా ఇదే జరిగింది. ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ డేటా ప్రకారం ఏటా దాదాపు 5 వేల పాముకాటు ప్రమాదాలు నమోదవుతున్నాయి. నమోదుకాని వాటితో లెక్కిస్తే ఈ సంఖ్య ఇంకా పెరగొచ్చు. దశాబ్దకాలంగా అక్కడ వన్యప్రాణుల సంబంధ మరణాల్లో పాము కాటు వల్ల జరిగినవి 70 శాతం ఉన్నాయని అటవీశాఖ పేర్కొంది.

ప్రజల్లోకి విస్తృతంగా 'సర్ప' యాప్

ఈ ప్రమాదాలని నివారించేందుకు కేరళ అటవీశాఖ 2020 నుండి 'స్నేక్ ఎవేర్‌నెస్, రెస్క్యూ, అండ్ ప్రొటెక్షన్ యాప్ (ఎస్ఎఆర్‌పిఎ)ని ప్రారంభించింది. ఈ యాప్ ప్రజలని శిక్షణ పొందిన రక్షకులతో అనుసంధానిస్తుంది. పాముకాటుపై ప్రథమ చికిత్స సమాచారాన్ని అందిస్తుంది. అలాగే పాము జాతులని గుర్తించడానికి సహాయ పడుతుంది. 'ఈ పద్ధతిని అవలంబించిన రాష్ట్రాల్లో దేశంలోనే కేరళ మొదటిది' అని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

పాములని పట్టుకోవడం, పాముకాటు నుండి రక్షణ పొందే సాంప్రదాయ పద్ధతులు అశాస్త్రీయం, ప్రమాదకరం. వాటిని నివారించేందుకు భద్రతా పద్ధతుల్లో 'బ్యాగ్, పైప్' విధానాన్ని అక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 6200 మంది శిక్షణ పొందారు. వీరిలో వైద్యులు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, ఐటి నిపుణులు, సాధారణ కార్మికులు, పరిశోధకులు వంటి సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు ఉన్నారు. లైసెన్సు పొందినవారు 3300 మంది ఉన్నారు. యాక్టివ్‌గా 1000 మంది పనిచేస్తున్నారు.

స్పష్టమైన తగ్గుదల

'ఎస్ఎఆర్‌పిఎ' యాప్ ప్రారంభం తరువాత అంటే ఈ ఐదేళ్లలో పాముకాటు మరణాలు గణనీయంగా తగ్గాయి. 2018-19లో 123గా ఉన్న మరణాల సంఖ్య 2024-25కి 34కి తగ్గిపోయింది. ఈ ఏడాదిలో ఈ నెల 21న నమోదైన మరణంతో కలిపి ఇప్పటివరకు 14 మరణాలు నమోదు అయ్యాయి. అలాగే 58 వేల పాములని రక్షించి సురక్షిత ప్రాంతాలకి తరలించినట్లు 'ఎస్ఎఆర్‌పిఎ' రాష్ట్ర నోడల్ అధికారి అన్వర్ తెలిపారు.

ప్రమాదాలు జరిగిన తరువాత కాకుండా, అసలు జరగకుండా తీసుకునే చర్యల పట్ల కూడా అక్కడ గొప్ప కృషి జరుగుతోంది. 'బహిరంగ మల విసర్జనపై నిషేధం, వంట చెరకుని తగ్గించి, ఎల్‌పిజీ విధానాన్ని ప్రోత్సహించడం, యంత్రాల సహాయంతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం నివారణకు కీలకంగా దోహదపడ్డాయ'ని కొచ్చిలోని అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో అడల్ట్ కార్డియాలజీ, పబ్లిక్ హెల్త్ ప్రొఫెసర్ డాక్టర్ జైదీప్ సి. మీనన్ అన్నారు..

ప్రభుత్వ శాఖలన్నీ..

స్థానిక స్వపరిపాలన శాఖ, సాధారణ విద్యాశాఖ, ఇతర విభాగాలు కూడా పాము కాటు నివారణలకై ముందస్తు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రతి విద్యా సంవత్సరానికి ముందు పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. ఉపాధి హామీ కార్మికులకి గమ్‌బూట్లు, చేతి తొడుగుల పంపిణీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది.

యాప్ ద్వారా పాములు, విష జాతులపై యువతకి అవగాహన కల్పించేందుకు 'సర్ప పదం' ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. 'కుటుంబశ్రీ' వంటి సమూహాలకి కూడా అవగాహన సెషన్లు నిర్వహిస్తున్నారు. 'ప్రతి స్థానిక సంస్థల్లో కనీసం ఒక యాక్టివ్ లైసెన్స్ పొందిన పాముల నిర్వాహణదారుడు ఉండేలా చర్యలు తీసుకోనున్న'ట్లు అటవీశాఖ విభాగం తెలిపింది.

వైద్య సేవలు బలోపేతం

వైద్య సవాళ్లు కూడా ముఖ్యమైన అవరోధమని అధికారులు గుర్తించారు. పాము విషం చూపించే ప్రభావానికి కంటే ముందు ప్రాణభయం మరణానికి దారితీస్తుంది. దీన్ని అధిగమించాలంటే పాము కాటు గురించి ప్రజల్లో అవగాహన రావాలి. ప్రీ-హాస్పిటల్లో అత్యవసర సేవలు ఉన్నా భయం కారణంగా ప్రైవేటుకు మొగ్గుచూపడం ఇందుకు ఉదాహరణ. నివారణ కోసం తక్షణం అందుబాటులో ఉండేలా 'అంబులెన్స్ సేవలు బలోపేతం చేయడం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, తాలూకా హాస్పిటళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నెట్‌వర్క్‌కి మద్దతు ఇవ్వాలని, 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ని అమలు చేయాల'ని నిపుణులు పిలుపునిచ్చారు.

అవగాహనతోనే సాధ్యం

'ప్రజల్లో అవగాహన, ప్రమాదాల నివారణకై ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయ'ని హెర్పెటాలజిస్ట్ సందీప్ దాస్ అంటున్నారు. 'పాముల పట్ల ప్రజల దృక్పథంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. భయం, శత్రుత్వం ఆవహించిన చోట ఇప్పుడు అవగాహనతో వాటిపై గౌరవం పెరిగింది. ఎలుకల నుండి పంటని కాపాడే జాతిగా వాటిని గుర్తిస్తున్నారు. దీంతో కనిపించిన వెంటనే చంపడం తగ్గింది. పాముకాట్లు లేకుండా చేయాలన్న లక్ష్యం వైపు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మార్పు దిశగా పనిచేస్తున్నాయి' అని ఆయన చెబుతున్నారు.

నేడు 'వృష కర్మ' సినిమా పోస్టర్ విడుదల

అక్కినేని నాగచైతన్య నటిస్తున్న ఎన్‌సి 24 సినిమాకు సంబంధించిన టైటిల్ రివీల్, నాగచైతన్య ఫస్ట్‌లుక్‌ను కథానాయకుడు మహేష్‌బాబు ఆదివారం ఉదయం 10.08 గంటలకు విడుదల చేయనున్నారు. 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమాకు 'వృష కర్మ' అనే టైటిల్ పెడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

స్త్రీలు బలహీనులు కారు

రష్మిక ఇటీవల స్త్రీశక్తి గురించి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ షేర్ చేశారు. 'అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరు. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుంది. మంచి స్నేహితురాలి దొరికితే ఎంతో సంతోషం కలుగుతుంది. ప్రపంచమంతా మన కళ్ల ముందు జరుగుతున్నట్లు అనిపిస్తుంది. స్త్రీలు ఒకరి కొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుంది. స్త్రీలు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తుల'ని రష్మిక పేర్కొన్నారు. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటున్నానని కూడా ఆమె చెప్పారు.

'మోహన రాగ..'తో మనోజ్



'కొత్త ప్రయాణం ఆరంభం' అంటూ తాజాగా మంచు మనోజ్ ఆ వివరాలని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'మోహన రాగ మ్యూజిక్' పేరుతో సంగీత సంస్థను ప్రారంభించినట్లు ఆయన ప్రకటించారు. 'లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్స్' అనే క్యాప్షన్‌తో ఈ విషయాన్ని తెలిపారు. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేయటం, ప్రయోగాత్మక సంగీతాన్ని ప్రోత్సహించటం, భారతీయ, అంతర్జాతీయ ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా సరికొత్త సంగీతాన్ని రూపొందించటమే దీని ప్రధాన లక్ష్యం. ఒరిజినల్ సింగిల్స్, కొలాబ్రేషన్స్, కొత్తరకమైన మ్యూజిక్ ప్రాజెక్ట్స్ ఈ లేబల్ నుంచి రాబోతున్నాయి. మోహన రాగ మ్యూజిక్ కంపెనీతో జరగబోయే అతి పెద్ద ఇంటర్నేషనల్ కొలాబ్రేషన్ గురించి వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

ఫిబ్రవరి 20న 'దో దివానే షెహర్ మే'

బాలీవుడ్ నటి మృణాల్‌ఠాకూర్ 'దో దివానే షెహర్ మే' సినిమాలో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నాయి. ఇందులో సిద్ధాంత్ చతుర్వేది కథానాయకుడు. ప్రేమ కథగా రాబోతున్న ఈ సినిమాకు రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తున్నారు. సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణ సింగ్, ఉమేష్ కుమార్ బన్సాల్, భరత్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ కొనసాగుతోంది. ప్రేమికుల రోజు సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 20న థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ మృణాల్ ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.



'తలైవా2'లో ఆపేక్ష పార్వెల్

నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్-2' చిత్రం కోసం బాలీవుడ్ నటి ఆపేక్ష పార్వెల్‌ను ఎంపిక చేశారు. 'జైలర్'కు సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో రమ్యకృష్ణ, మిర్నా మేనన్, యోగిబాబు, అతిథి పాత్రల్లో మోహన్‌లాల్, శివరాజ్ కుమార్ నటిస్తున్నారు. ఇక ఇప్పుడు తెరకెక్కిస్తున్న రెండో భాగంలో బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి, ఎస్‌జె సూర్య భాగమయ్యారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. ఇందులో ఆపేక్ష పాల్గొంటున్నారు.

చెమటోడ్చుతున్న బౌలర్లు

- కుల్దీప్‌కు మూడు వికెట్లు
- స్టబ్స్, బవుమా అద్భుత పోరాటం
- దక్షిణాఫ్రికా 247/6

గౌహతి: రెండో టెస్ట్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత జట్టు వ్యూహాలు ఫలించలేదు. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా తొలుత బ్యాటింగ్‌కు మొగ్గుచూపాడు. భారత బౌలర్లకు స్టబ్స్, బవుమా అడ్డుగా నిలిచారు. వీరిద్దరిని పెవీలియన్‌కు పంపేందుకు భారత బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. దీంతో తొలిరోజు ఆట ముగిసేసరికి దక్షిణాఫ్రికా 6వికెట్ల నష్టానికి 247పరుగులు చేసింది. తొలి సెషన్‌లో ఆచితూచి ఆడిన వీరిద్దరూ వికెట్ ఇవ్వలేదు. క్రీజులో కుదురుకున్న మర్‌క్రమ్‌ను రెండో సెషన్‌లో బుమ్రా వెనక్కి పంపి తొలి వికెట్ అందించాడు. దీంతో తొలివికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కుల్దీప్ ఓవర్లో రికెల్టన్ వికెట్ కీపర్ పంత్‌కు దొరికాడు. ఓపెనర్లు ఔటైనా సఫారీ టీమ్ తడబడలేదు. క్రీజులోకి వచ్చిన బవుమా(41), ట్రిస్టన్ స్టబ్స్(49) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ప్రమాదకరంగా మారిన ఈ ద్వయాన్ని జడేజా(1-/30) విడదీసాడు. అర్ధ శతకానికి చేరువైన స్టబ్స్‌ను కుల్దీప్(3/48) బోల్తా కొట్టించాడు. స్లిప్‌లో కేఎల్ రాహుల్ క్యాచ్ అందుకోగా 187 వద్ద నాలుగో వికెట్ పడింది. ఆ తర్వాత టోనీ జోర్జి(28), ముత్తుస్వామి(25 నాటౌట్)లు దక్షిణాఫ్రికా వికెట్ల పతనానికి అడ్డుగోడలా నిలిచారు. అయితే.. రెండో కొత్త బంతితో సిరాజ్ బ్రేకిచ్చాడు. జోర్జి ఆడిన బంతిని పంత్ కుడివైపు డైవ్ చేస్తూ క్యాచ్ అందుకున్నాడు. దాంతో.. 45 పరుగుల భాగస్వామ్యానికి తెరపడగా 246 వద్ద పర్యాటక జట్టు ఆరో వికెట్ కోల్పోయింది. తొలి రోజు ఆట ముగిసే సరికి దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లు కుల్దీప్‌కు మూడు, జడేజా, సిరాజ్, బుమ్రాకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బి)బుమ్రా 38, రికెల్టన్ (సి)పంత్ (బి)కుల్దీప్ 35, స్టబ్స్ (సి)రాహుల్ (బి)కుల్దీప్ 49, బవుమా (సి)జైస్వాల్ (బి)జడేజా 41, జోర్జి (సి)పంత్ (బి)సిరాజ్ 28, ముల్డర్ (సి)జైస్వాల్ (బి)కుల్దీప్ 13, ముత్తుసామి (బ్యాటింగ్) 25, వెర్రెయనె (బ్యాటింగ్) 1, అదనం 17. (81.5ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 247పరుగులు. **వికెట్ల పతనం:** 1/82, 2/82, 3/166, 4/187, 5/201, 6/246 **బౌలింగ్:** బుమ్రా 17-6-38-1, సిరాజ్ 17.5-3-59-1, నితీశ్ రెడ్డి 4-0-21-0, సుందర్ 14-3-36-0, కుల్దీప్ 17-3-48-3, జడేజా 12-1-30-1.

ఫైనల్‌కు లక్ష్యసేన్

ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ టోర్నీ

సిడ్నీ: భారత యువ షట్లర్ లక్ష్యసేన్ సంచలనం సృష్టించాడు. కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం జరిగిన సెమీఫైనల్లో తనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న చైనీస్ తైపీకి చెందిన ఛౌ-టిన్-చెన్‌ను చిత్తుచేశాడు. దీంతో ఈ ఏడాదిలో రెండోసారి ఒక టోర్నమెంట్ ఫైనల్‌కు చేరాడు. హోరాహోరీగా సాగిన సెమీస్‌లో ఒలింపిక్ పార్క్ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన సెమీస్‌లో లక్ష్యసేన్ 17-21, 24-22, 21-16తో దాదాపు గంటా 26 నిమిషాలసేపు పోరాడి ఛౌ-టిన్‌కు చెక్ పెట్టాడు. దీంతో ముఖాముఖి పోరును 4-4తో సమం చేశాడు. ఈ ఏడాది జరిగిన హాంకాంగ్ ఓపెన్‌లోనూ లక్ష్యసేన్ 23-21, 22-20తో ఛౌ-టిన్-చెన్‌ను చిత్తుచేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్, జపాన్‌కు చెందిన 26వ ర్యాంకర్ యూషీ తనకతో తలపడనున్నాడు. రెండో సెమీస్‌లో యూషీ తనక 21-18, 21-15తో 5వ ర్యాంకర్, చైనీస్ తైపీకి చెందిన లిన్-చౌన్-హీను ఓడించాడు. తొలిరౌండ్‌లో యుషీ టాప్‌సీడ్ జొనాథన్ క్రిస్టీ, క్వార్టర్స్‌లో రాస్మస్ జెంకే(డెన్మార్క్)లను చిత్తుచేసి టాప్ ఫామ్‌లో ఉన్నాడు.

స్టార్క్

రెండ్రోజుల్లోనే ముగిసిన తొలిటెస్ట్

యాషెస్ చరిత్రలో ఆరోసారి • ఇంగ్లండ్‌పై 8వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు

పెర్త్: యాషెస్ సిరీస్ చరిత్రలో ఆరోసారి ఒక టెస్ట్ కేవలం రెండ్రోజుల్లోనే ముగిసింది. పెర్త్ వేదికగా ఇంగ్లండ్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యతలో నిలిచింది. శుక్రవారం నుంచి ప్రారంభమైన యాషెస్ సిరీస్ ఇంగ్లండ్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 40పరుగుల ఆధిక్యత లభించగా.. శనివారం రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ జట్టు కేవలం 164పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా బౌలర్లు స్టార్క్, డోగెట్‌కు మూడేసి, బోలండ్‌కు నాలుగు వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ పతనాన్ని శాసించారు. దీంతో ఆస్ట్రేలియా ముందు పర్యాటకజట్టు కేవలం 205 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగల్గింది. అనంతరం ఆస్ట్రేలియా ఓపెనర్ హెడ్(123) సెంచరీకి తోడు లబూషేన్(51నాటౌట్) అర్ధసెంచరీతో రాణించి మ్యాచ్‌ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టార్క్‌కు లభించింది. రెండో టెస్ట్ డిసెంబర్ 4నుంచి గబ్బా వేదికగా ప్రారంభం కానుండగా.. ఈ టెస్ట్‌కు ముందు ఇంగ్లండ్ జట్టు ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ ఎలెవెన్‌తో రెండ్రోజుల మ్యాచ్ ఆడనుంది.

మూడు ఇన్నింగ్స్‌లో సున్నా పరుగుకే తొలి వికెట్
149ఏళ్ల యాషెస్ సిరీస్‌లో ఇదే తొలిసారి

149 ఏళ్ల యాషెస్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి మూడు ఇన్నింగ్స్ సున్నా స్కోర్ వద్ద తొలి వికెట్ కోల్పోయాయి. ఇంగ్లండ్-ఆస్ట్రేలియా జట్లు తమ మొదటి ఇన్నింగ్స్‌లో సున్నా వద్ద మొదటి వికెట్‌ను చేజార్చుకోగా.. శనివారం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సున్నా స్కోర్ వద్దే తొలి వికెట్‌ను కోల్పోయింది. మార్చి 1877లో టెస్ట్ క్రికెట్ ప్రారంభమైనప్పటి నుంచి 148 సంవత్సరాల 8 నెలల్లో ఇలా జరగడం ఇదే మొదటిసారి. పెర్త్ టెస్ట్‌లో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలే పరుగుల ఖాతా తెరవకుండానే అవుట్ అయ్యాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో విల్ జాక్ సైతం ఖాతా తెరకుండానే ఔటయ్యాడు. ఇక ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో రెండో రోజు జాక్ క్రాలే మళ్లీ ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. టెస్ట్ మ్యాచ్‌లో ఇలా జరగడం తొలిసారి. యాషెస్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో ఖాతా తెరవకుండానే ఔటైన నాల్గో ఇంగ్లీష్ బ్యాట్స్‌మన్ క్రాలే.. ట్రెవర్ బేలిస్, డెన్నిస్ అమిస్, మైఖేల్ అథర్టన్‌ల సరసన చేరాడు.

స్కోర్లు(సంక్షిప్తంగా..)
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 173, 164
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 132, 205/2
(ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టార్క్ (7/58), (3/55)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68